www.andhrajyothy.com సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 101
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 26-7-2024 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా. 11.31 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 2.30 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 1.45-3.15; దుర్ముహూర్తం: ఉ. 8.30-9.21, మ. 12.47-1.38; అమృతఘడియలు: ఉ. 10.03-11.32; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.46

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఒలింపిక్స్‌లో తెలుగు తేజాలు

ఈ ఒలింపిక్స్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. బ్యాడ్మింటన్ నుంచి పీవీ సింధు, డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్, యువ షూటర్ ఇషా సింగ్, ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి ఆకుల శ్రీజ, అథ్లెట్లు జ్యోతి యర్రాజి, దండి జ్యోతికశ్రీ బరిలో ఉన్నారు. వీరిలో హ్యాట్రిక్ వేటలో ఉన్న సింధు, సాత్విక్ వినహా అంతా తొలిసారి విశ్వక్రీడల్లో పోటీ పడుతున్నవారే.



'విశ్వ'మంత సంబరం

పారిస్ ఒలింపిక్స్ నేటినుంచే.. వచ్చేనెల 11న ముగింపు ఉత్సవం

206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు బరిలో.. భారత్ నుంచి 117 మంది

లిప్తపాటులో మారే ఫలితాలు.. పతకవీరుల సింహనాదాలు.. ఉవ్వెత్తున ఎగసే భావోద్వేగాలు.. అంతులేని నిర్వేదాలు! వీటన్నింటికీ వేదికయ్యే విశ్వక్రీడా సంరంభం ఒలింపిక్స్ వచ్చేసింది. ఫ్యాషన్‌కు చిరునామా అయిన పారిస్.. పదిహేడు రోజులపాటు క్రీడా కోలాహలంతో మోతెక్కనుంది. యావత్ ప్రపంచాన్ని ఊపేసే ఈ ఆటల పండగ శుక్రవారమే మొదలవనుంది. 32 క్రీడాంశాల్లో 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు తమ జీవిత స్వప్నమైన ఒలింపిక్ పతకం కోసం సర్వం పణంగా పెట్టనున్నారు. ఈసారి భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు పతకాల కోసం పోటీపడుతున్నారు. గత టోక్యో క్రీడల్లో స్వర్ణంతో సత్తాచాటిన జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా, ఇదివరకే రెండు పతకాలు ఖాతాలో వేసుకున్న ఏస్ షట్లర్ పీవీ సింధు, బాక్సర్లు లవ్లీనా, నిఖత్ జరీన్, లిఫ్టర్ మీరాబాయిలాంటి స్టార్లతో భారత్ బృందం భారీ అంచనాలతో పారిస్‌లో అడుగుపెట్టింది.

9



3 ఏళ్లలో పూర్తి!

బాబు సంకల్పం.. ప్రత్యేక కేబినెట్ భేటీ

- కట్టకపోగా జగన్ నాశనం చేశారు
- దీంతో రూ.30 వేల కోట్ల నష్టం
- తప్పుడు ప్రచారంలో వైసీపీ ఆరితేరింది
- 36 హత్యలు జరిగాయంటూ ఢిల్లీలో యాగీ
- వారి పేర్లు ఇవ్వాలని జాతీయ మీడియా అడిగితే జగన్ వెళ్లిపోయాడు
- ఇలాంటివి మనం కూడా అందుకోవాలి
- తప్పుడు విమర్శలపై తక్షణం స్పందించాలి
- ప్రతీకార దాడులు, కక్ష సాధింపులూ వద్దు
- చట్టప్రకారం శిక్ష పడేలా చూద్దాం: సీఎం

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షను వ్యక్తం చేశారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి కావడానికి రెండు సీజన్ల సమయం పడుతుందని, దీనికి సమాంతరంగా మిగిలిన పనులు చేపట్టి మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఈ ప్రతిష్ఠాత్మక

మిగతా 6వ పేజీలో...

కొత్త డయాఫ్రం వాల్!

- 990 కోట్లతో నిర్మాణానికి అనుమతివ్వండి
- తొలి దశ పనులకు తక్షణమే 12,157 కోట్లివ్వండి
- స్టాప్ వర్క్ ఆర్డర్ నిషేధాన్ని శాశ్వతంగా ఎత్తేయండి
- 45.72 మీటర్ల ఎత్తుకు అంచనాలు సవరించండి
- కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం

6

ఆర్థిక అగాధం!

11

- రూ. 11 లక్షల కోట్లకు పైగా అప్పులు
- జగన్ హయాంలో రాజ్యాంగం, చట్టాలను ఉల్లంఘించి అడ్డదారిలో అప్పులు
- తప్పులు చేసినోళ్లే ఇప్పటికీ ఆర్థికశాఖలో..
- జరిగిన మోసాలు బయటకు వస్తాయా?
- నేడు ఆర్థిక రంగంపై శ్వేతపత్రం విడుదల

"మహిళల జోలికి ఎవరైనా వస్తే 21 రోజుల్లో ఉరేస్తామని నాడు ముఖ్యమంత్రిగా జగన్ ఆర్భాటపు ప్రకటనలు గుప్పించారు. మరి ఆయన తన పాలనలో ఎంతమందికి ఉరిశిక్షలు వేయించారు? ఐదేళ్ల జగన్ పాలనలో ఎస్సీలపై 10,377 నేరాలు చోటుచేసుకున్నాయి. 300 మంది బీసీలు హత్యకు గురయ్యారు. మహిళలపై 89,875 నేర ఘటనలు జరిగాయి. ఇన్ని జరుగుతుంటే కనీసం సమీక్ష కూడా చేయలేదు. కానీ, వైసీపీకి చెందిన ఇద్దరు గంజాయి మత్తులో పరస్పర దాడులు చేసుకున్న ఘటనపై ఢిల్లీలో రాజకీయాలు చేయడమేంటి?"

"శాంతిభద్రతల పరిరక్షణలో నూతన అధ్యాయం మొదలైంది. అక్రమ కేసులు పెట్టిన, పెట్టించిన అధికారులను చట్టపరంగా శిక్షించబోతున్నాం. టీడీపీ కూటమి సభ్యులెవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు. బాధితులు సైతం చట్టపరంగా బాధ్యుల్ని ఎదుర్కోవాల్సిందే తప్ప ప్రతీకార దాడులు చేస్తామంటే కుదరదు" -చంద్రబాబు

పైశాచికానికి పరాకాష్ఠ

ఐదేళ్లూ ఎమర్జెన్సీని మించిన చీకటి రోజులు

- శాంతిభద్రతలు మృగ్యం.. సర్వత్రా అరాచకపర్వం
- ఉమ్మడి ఏపీలో నాపై బాబ్లీ కేసు ఒక్కటే
- ఐదేళ్లలోనే 17 కేసులు పెట్టి పైశాచికానందం
- జగన్ పాలనలో 300 మంది బీసీల హత్య
- ఎస్సీలపై 10,377 నేరాలు, మహిళలపై 89,875
- నాటి అక్రమ కేసులు, అణచివేతపై కమిషన్!
- నాడు అక్రమ కేసులు పెట్టిన అధికారులను శిక్షిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- శాంతిభద్రతలపై శాసనసభలో శ్వేతపత్రం



వైసీపీ ప్రభుత్వంలో కేసులు ఎదుర్కొన్న నేతలు నిలబడాల్సిందిగా చంద్రబాబు కోరడంతో సభలో నిలుచున్న సభ్యులు.



అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు పడిన కష్టాలు.. ప్రతిపక్షాలు ఎదుర్కొన్న హింసా రాజకీయాలు.. బాధితులే నిందితులైన ప్రభుత్వ టెర్రరిజాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ఆవిష్కరించారు. కట్టుతప్పిన శాంతి భద్రతలు, హత్యలు, అత్యాచారాలు, బెదిరింపులు, గంజాయి, డ్రగ్స్ దిగుమతితో ఆంధ్రప్రదేశ్ ఎంత నష్టపోయిందో వివరించారు. శాంతి భద్రతల విషయంలో నూతన అధ్యాయం ప్రారంభించబోతున్నామని చంద్రబాబు వెల్లడించారు. జగన్ హయాంలో జరిగిన అరాచకాలపై గురువారం అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారు. శాంతి భద్రతలను టీడీపీ కూటమి ప్రభుత్వం ఎలా పరిరక్షిస్తుందో వివరించారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడతామన్నారు. జగన్ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల ప్రస్తావన వచ్చినప్పుడల్లా చంద్రబాబు తీవ్ర భావోద్వేగానికి

మిగతా 11వ పేజీలో...

నాలుగు లక్ష్యాలతో పనిచేస్తాం..

1) పోలీసుశాఖను ప్రక్షాళన చేసి రాష్ట్రాన్ని సున్నా నేరాల ఏపీగా మారుస్తాం.
2) లా అండ్ ఆర్డర్‌లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం.
3) రాజకీయ కక్షతో పెట్టిన కేసులను సమీక్షించి ఐదేళ్ల వైసీపీ పాలనలో మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా అణచివేతకు గురైన వారికి సాంత్వన చేకూరుస్తాం.
4) గత ఐదేళ్లలో అక్రమ కేసులు, అణచివేతపై కమిషన్ వేయడంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.



ఖనిజ సంపదపై రాష్ట్రాలు పన్ను వేయొచ్చు!

- కేంద్రానికి ఆ అధికారం లేదు
- పరిమితులను పేర్కొనవచ్చు
- రాష్ట్రాలకు చెల్లించే రాయల్టీ పన్ను కాదు
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగే చాన్స్

12

ఇకపై పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

- ఆధార్ ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్
- క్యూఆర్ కోడ్, సీసీటీవీ నిఘా
- ఖేడ్కర్ ఉదంతం నేపథ్యంలో అప్రమత్తమైన కమిషన్

12

ఫైళ్ల దహనం కేసు సీఐడీకి!

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం!

- మదనపల్లెలోనే చీఫ్ అయ్యన్నార్ మకాం
- 60 మందితో ఆరు బృందాల దర్యాప్తు?
- ఒక్కో జట్టుకు ఒక్కో డీఎస్పీ సారథ్యం
- పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డి కోసం వేట
- మంటలకు ముందే ఫైళ్లు దాటించేసిన మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు
- 2,400 ఫైళ్లు బుగ్గి అయినట్లు గుర్తింపు!

రాయచోటి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ ఫైళ్ల కాల్చివేత కేసు విచారణ సీఐడీ చేతుల్లోకి వెళ్తోంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి నుంచి మదనపల్లెలోనే మకాం వేశారు. సీఐడీ ఆధ్వర్యంలో 60 మంది సభ్యులతో ఆరు బృందాలు ఈ కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు సమాచారం. అన్నమయ్య జిల్లా

మిగతా 2వ పేజీలో...



సిసోడియాకు ఫిర్యాదు చేయడానికి వర్షంలో సైతం తడుస్తూ బారులు తీరిన బాధితులు

పోటెత్తిన భూ బాధితులు

- భూ అక్రమాలపై సిసోడియాకు వందల మంది ఫిర్యాదు
- మదనపల్లె సబ్‌కలెక్టరేట్ వద్ద వర్షంలో సైతం బారులు
- పుంగనూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన 300 మంది

2

అంతమందిని చూసి ప్రత్యేక సీఎస్ విస్మయం

జగన్ ఆర్థిక ఉగ్రవాది

- ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచేశారు
- ఈడీ, సీబీఐతో విచారణ చేయించాలి
- ఆయనకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి
- దోచిన సొమ్మంతా తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేయాలి
- లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్

2



దమ్ముంటే అసెంబ్లీకి రండి
రాజకీయ హత్యలపై చర్చిద్దాం

- హత్యకు గురయ్యారంటున్న ఆ 36 మంది వివరాలు చెబితే చర్యలు
- తప్పుడు సమాచారమని తేలితే ప్రభుత్వ చర్యలకు సిద్ధం కావాలి
- జగన్‌కు హోం మంత్రి అనిత సవాల్

11

జగన్ ఆర్థిక ఉగ్రవాది

- ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచేశారు.. ఈడీ, సీబీఐతో విచారణ చేయించాలి
- ఆయనకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి
- దోచిన సొమ్మంతా తీసుకొచ్చి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేయాలి
- లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆర్థిక ఉగ్రవాదని, ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా దోచేశారని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఆరోపించారు. జగన్ ఐదేళ్ల దోపిడీపై దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలని గురువారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన దాష్టీకాన్ని, జగన్ దోపిడీని లోక్‌సభ సాక్షిగా దేశానికి వివరించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై లోక్‌సభలో ఆయన మాట్లాడారు. "ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల ఆటవిక రాజ్యం అంతమైంది. ఏపీ ప్రజలు ఎన్డీయేకు అపూర్వ విజయం అందించారు. విజన్ ఉన్న నాయకుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఐదేళ్లలో రాష్ట్రం కోల్పోయిన వాటిని పునర్నిర్మిస్తారనే నమ్మకం ప్రజలకు ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి చేరింది. కేంద్ర బడ్జెట్ కేటాయింపులతో ఆక్సిజన్ లభించింది. జగన్ రుషికొండలో రూ.500 కోట్లతో రాజభవనం నిర్మించుకున్నారు. అప్పును రూ.13 లక్షల కోట్లకు చేర్చారు. వైసీపీ ఎమ్మెల్సీ ఒక దళిత డ్రైవర్‌ను హత్యచేసి మృతదేహాన్ని అతడి ఇంటిముందే పడేశారు. కొవిడ్ సమయంలో మాస్కులు అడిగినందుకు ఒక ప్రభుత్వ వైద్యుడిని దారుణంగా హింసించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 2,686 హత్యలు జరిగాయి. దేవాలయాలపై దాదాపు 150 దాడులు జరిగాయి. అంతర్వేదిలో శతాబ్దాల నాటి లక్ష్మీ నరసింహస్వామి రథానికి నిప్పు పెట్టారు. దుర్గాదేవి వెండి రథంలోని 3 వెండి సింహాలు మాయమయ్యాయి. ఏళ్ల తరబడి జైలులో ఉన్న వ్యక్తి సీఎం అయితే ఎలా ఉంటుందో రాష్ట్రం చూసింది. అమరావతి, పోలవరం రాష్ట్రానికి రెండు కళ్లు లాంటివి. ఈ రెండింటిపై ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనలు నిజంగా ఏపీ ప్రజల హృదయాలను తాకాయి" అని సీఎం రమేశ్ అన్నారు. ఆ తర్వాత ఆయన సభలో తెలుగులో మాట్లాడారు. "ఎన్డీయే కూటమిలో మోదీ, చంద్రబాబు, పవన్ నేతృత్వంలో అనకాపల్లి నుంచి 3 లక్షల మెజార్టీతో గెలిచాను. ముగ్గురిపై ప్రజలకు నమ్మకం ఉంది. జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ మొత్తం దోచేశారు. భూమి, ఇసుక, నీళ్లు, మైనింగ్, లిక్కర్.. అన్నీ దోచేశారు.

పెట్టుబడులను అడ్డుకొంటున్న జగన్: టీడీపీ ఎంపీలు


న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఢిల్లీలో ధర్నాలు చేయడం సరికాదు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటే వారిని అడ్డుకునేలా జగన్ వ్యవహరిస్తున్నారు' అని టీడీపీ ఎంపీలు ఆరోపించారు. గురువారం, ఇక్కడ అశోకారోడ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ మాట్లాడారు. 'జగన్ బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధిగా వ్యవహరించాలి. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలి. కేంద్రం బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రకటిస్తే వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కనీసం స్పందించలేదు' అని అప్పలనాయుడు విమర్శించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు... చావు కబుర్లు చెప్పడానికి జగన్ ఢిల్లీ వరకు రానవసరం లేదు. రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబుకు ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ మద్దతు తెలపాలి' అని కోరారు.

'ఫైళ్ల దహనం'తో సంబంధం లేదు: మిథున్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'మదనపల్లె ఆర్డీఓ కార్యాలయం ఫైళ్ల దహనంతో నాకు ఎటువంటి సంబంధం లేదు. ఆ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి నిజాలను వెలికితీయాలి' అని వైసీపీ లోక్ సభాపక్ష నేత మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీ, ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ నేతలు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. వ్యక్తిగత ఆరోపణలతో నా ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలన్నీ ఉన్నాయి. మా ఆస్తులన్నీ చట్టబద్ధంగా సంపాదించినవే. ప్రతి పైసాకు పన్నులు చెల్లిస్తున్నాం. మదనపల్లె ఘటనలో అరెస్టయిన అనురాగ్ టీడీపీకి చెందిన వ్యక్తి. ఆ విషయాన్ని అతని తల్లిదండ్రులే చెబుతున్నారు. కొన్ని పత్రికలు మా వివరణ తీసుకోకుండా ఏకపక్ష కథనాలు ప్రచురిస్తున్నాయి. అది ఇలానే కొనసాగితే పరువు నష్టం దావా వేస్తా. ఎలక్షన్ ఫండ్ తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధం' అని మిథున్‌రెడ్డి చెప్పారు.

పోలవరం బాధ్యత మాదే

- 2026 మార్చి నాటికి తొలిదశ పూర్తి.. లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ
- మూడేళ్లుగా అరకొర పనులేనని వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి బాధ్యత తమదేనని కేంద్రం స్పష్టం చేసింది. పోలవరం నిర్మాణానికి గత మూడేళ్లలో రూ.8,044 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, జీఎం హరీష్ బాలయోగి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గత మూడేళ్లలో పోలవరం నిర్మాణ పనులు అరకొరగా జరిగినట్లు తెలిపారు. నిర్మాణ సంస్థను మార్చడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన సాగిందని, భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల్లో తీవ్ర జాప్యం జరిగిందని ఐఐటీ హైదరాబాద్ తన నివేదికలో పేర్కొందని చెప్పారు. ప్రాజెక్టు తొలిదశ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. మూడేళ్ల పనుల పురోగతి వివరాలు తెలిపారు. 2021-22 నుంచి మూడేళ్లలో ప్రాజెక్టు ప్రధాన పనుల్లో 21 శాతం మట్టి పనులు, కాంక్రీటు పనులు కేవలం 5.3 శాతం జరిగినట్లు తెలిపారు. కుడి కాలువకు లైనింగ్ పనులు 1.82 శాతం, స్ట్రక్చర్స్ 0.39 శాతం జరిగాయని, మట్టిపనులు ఏమాత్రం జరగలేదని తెలిపారు. ఎడమ కాలువకు మట్టి పనులు 0.30 శాతం, లైనింగ్ 1.18 శాతం, స్ట్రక్చర్స్ 3.33 శాతం జరిగినట్లు తెలిపారు. భూసేకరణ 0.22 శాతం, సహాయ పునరావాస పనులు 8 శాతం జరిగినట్లు పేర్కొన్నారు.

విజయసాయి వక్రీకరణలు

- ఏపీకి కేంద్ర సాయంపై అక్కసు.. చంద్రబాబుపై ఆరోపణలు
- ఆధారాలు ఇవ్వాలన్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
- లేదంటే ఉపసంహరించుకోవాలని హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై అడ్డగోలు ఆరోపణలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి తీరుపై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ మండిపడ్డారు. ఆరోపణలకు ఆధారాలు చూపాలని, లేదా వాటిని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో కేంద్రం నుంచి అప్పులకు అనుమతి తప్ప సాధించిందేమీ లేదు. తాజా బడ్జెట్‌లో చంద్రబాబు ప్రతిపాదనలను దాదాపుగా ఆమోదించి... పోలవరం, అమరావతికి అండగా ఉంటామని కేంద్రం ప్రకటించింది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా అమరావతికి ఈ ఏడాది రూ.15వేల కోట్లు ఇప్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాను కూడా గ్రాంటుగా కేంద్రమే భరించడంపైనా నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలవరం నిర్మాణం పూర్తి బాధ్యత తమదే అని స్పష్టం చేశారు. ఇవన్నీ నిర్మల తెలుగులోనే చెప్పారు. అయినప్పటికీ.. విజయసాయి రెడ్డి. గురువారం రాజ్యసభలో దీనిని వక్రీకరిస్తూ మాట్లాడారు. "ఏపీకి కేంద్రం నిధులు ఇచ్చిందని ఎన్డీయే, ఇండియా కూటములు అంటున్నాయి. కానీ.. అసలేం ఇచ్చిందో అర్థం కావడం లేదు. అమరావతికి కేంద్రం ప్రకటించిన రూ.15వేలకోట్లు రుణమే. దాన్ని రాష్ట్రమే చెల్లించాలి" అని సొంత భాష్యం చెప్పారు. పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం సీఎం చంద్రబాబుకు ఆర్థిక లబ్ధి చేకూరిందని అంటూ ఆరోపణలు చేశారు. "2014-19లో చాలా అవినీతి జరిగింది. అవినీతి నుంచి బయటపడేందుకే చంద్రబాబు ఎన్డీయేలో చేరారు. ఎన్డీయే, చంద్రబాబు మధ్య క్విడ్ ప్రోకో ఉంది" అని విజయసాయి రెడ్డి తన అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ అభ్యంతరం తెలిపారు. మీరు ఆధారాలు ఉంటేనే మాట్లాడాలని హెచ్చరించారు. "చాలా పెద్ద ఆరోపణ చేస్తున్నారు. వాటికి సాయంత్రంలోపు ఆధారాలు ఇవ్వాలి. లేనిపక్షంలో ఆ మాటలను ఉపసంహరించుకోవాలి" అని హెచ్చరించారు.

ఫైళ్ల దహనం కేసు సీఐడీకి!

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అదనపు ఎస్పీ రాజ్‌కమల్‌తో పాటు అనేక మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఇప్పటికే ఈ కేసు దర్యాప్తులో తలమునకలై ఉన్నారు. పలువురు సబ్ కలెక్టరేట్ ఉద్యోగులను, అనుమానితులను విచారించారు. ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. కొందరిని అదుపులోకి కూడా తీసుకున్నారు. ఫైళ్ల దహనంలో ప్రధాన అనుమానితుడిగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, బినామీ మాధవరెడ్డి కోసం వేట కొనసాగిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల కదలికలపై పోలీసులు కన్నేశారు. ప్రస్తుత విచారణను ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. ఫైళ్ల దహనం ఘటన జరిగి రోజులు గడిచే కొద్దీ.. పెద్దిరెడ్డి అనుచరులు, బినామీల భూఅక్రమాలు, ఆగడాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. తమ తమ భూములను వారు ఎలా ఆక్రమించుకున్నదీ ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు బాధితులు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసు తీవ్రత దృష్ట్యా దర్యాప్తు బాధ్యతను ప్రభుత్వం సీఐడీకి అప్పగించనుంది. విచారణ కోసం ఏర్పాటు చేసే ఆరు బృందాల్లో ప్రతి బృందానికీ ఓ డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారని సమాచారం. సీఐలు,ఎస్ఐలు,కానిస్టేబుళ్లు ఈ బృందాల్లో ఉంటారు.అనుమానితుల కదలికలను పరిశీలించడంతో పాటు ఫోన్ కాల్స్ వివరాలపైనా ఆరా తీయనున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో పాటు బయట వ్యక్తులపైనా నిఘా ఉంచారు. ముఖ్యంగా ఐదుగురిపై పూర్తి స్థాయిలో డేగకన్ను వేసినట్లు సమాచారం.



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో సిసోడియాకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ప్రధానంగా 22ఏ ఫైళ్లపై ఆరా తీస్తున్నారు.

బుగ్గిచేయడానికి 4 రోజుల ముందే..!

ఈ నెల 21న (ఆదివారం) రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కాల్చివేయడానికి నాలుగైదు రోజుల ముందే ముఖ్యమైన డాక్యుమెంట్ల మూటలను పెద్దిరెడ్డి బినామీ అయిన మాధవరెడ్డి రహస్య ప్రదేశానికి తరలించినట్లు ప్రచారంలో ఉంది. వీటిలో పెద్దిరెడ్డికి సంబంధించిన పలు ఫైళ్లు ఉన్నట్లు సమాచారం. ఫైళ్ల దహనం ఘటన జరిగాక.. తన ఇంట్లో సోదాలు నిర్వహిస్తారేమోనని ముందుగానే ఊహించి వాటిని మరెక్కడో మాధవరెడ్డి దాచినట్లు తెలుస్తోంది. అధికారుల లెక్క ప్రకారం.. సుమారు 2,400 ఫైళ్లు కాలి బూడిదయ్యాయి. అయితే బయటకు తీసుకెళ్లిన ఫైళ్లు ఇంకెన్ని ఉంటాయో విచారణలో నిగ్గు తేలాల్సి ఉంది. ఫైళ్ల దహనం వెనుక.. పెద్దిరెడ్డి, ఆయన అనుచరుల హస్తం ఉందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్న విషయం తెలిసిందే.

కాలిపోయిన రికార్డుల వివరాల సేకరణ..

మదనపల్లె ఫైళ్ల దహనం వ్యవహారంలో సమాంతరంగా రెవెన్యూ శాఖ కూడా విచారణ సాగిస్తోంది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా విచారణను పర్యవేక్షిస్తున్నారు. కాలిపోయిన రికార్డుల వివరాల సేకరణలో కలెక్టర్ శ్రీధర్, జిల్లావ్యాప్తంగా పలువురు తహశీల్దార్లు నిమగ్నమై ఉన్నారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని 11 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలిస్తున్నారు.

సిసోడియాను కలిసేందుకు పోటెత్తిన బాధితులు

భూ అక్రమాలపై వందల మంది ఫిర్యాదు

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, ఇతర వైసీపీ నాయకుల భూఅక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు వందలాది మంది బాధితులు గురువారం మదనపల్లెకు తరలివచ్చారు. జోరుగా వర్షం కురుస్తున్నా.. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాను కలిసి తమ గోడు చెప్పుకొనేందుకు తడుస్తూనే క్యూలో నిలబడడం విశేషం. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వారి నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. పెద్దిరెడ్డి, ఆయన అనుచరుల చేతుల్లో చిక్కుకున్న తమ భూములపై ఫిర్యాదు చేసేందుకు మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి భారీగా తరలివచ్చారు. పుంగనూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి వచ్చిన ఈ బాధితులతో సబ్‌కలెక్టర్ కార్యాలయం కిటకిటలాడింది. బాధితులు 300 మందికి పైగా ఉండడం చూసి సిసోడియా సైతం ఆశ్చర్యపోయినట్లు సమాచారం. తొలి రోజే ఇంతమంది వచ్చారని.. వచ్చే 2-3 రోజుల్లో ఇంకెంత మంది వస్తారోనని అధికార వర్గాలు అంటున్నాయి.

మా భూమి ఆక్రమించి మాపైనే కేసులు



కోటావూరు గ్రామం నాయనబండపల్లెలోని సర్వే నంబరు 386లో ఉన్న 1.25 ఎకరాల భూమిని 2002లో ఇతరుల నుంచి మేం కొన్నాం. మరో 24 సెంట్ల భూమిని 2022లో కొనుగోలు చేశాం. వైసీపీ ప్రభుత్వంలో 2023 ఫిబ్రవరిలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, ఆయన బావమరిది భానుప్రకాశ్ రెడ్డి అండదండలతో కోటావూరుకు వైసీపీ నాయకులు చెన్నకేశవ, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు మా భూమిని ఆక్రమించి.. మాపైనే తప్పుడు కేసులు పెట్టారు. ప్రస్తుతం మా పొలంలో పంట పెట్టుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఆ భూములకు సంబంధించి మా వద్ద అన్ని రికార్డులూ ఉన్నాయి. మా ఊరి వీఆర్‌వో నరేంద్ర మా పేరు మీద ఉన్న ఆన్‌లైన్‌ను తీసేశాడు.

- నారాయణ, కోటావూరు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె నియోజకవర్గం

వచ్చే ఏడాది జూన్‌కు విజయవాడ టర్మినల్ రెడీ



- టికెట్ల ధరల అకస్మిక పెంపుపై విచారణ: రామ్మోహన్
- 'శ్రీవెంకటేశ్వర విమానాశ్రయం'గా తిరుపతి ఎయిర్‌పోర్ట్

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన ఇంటగ్రల్ టర్మినల్ వచ్చే ఏడాది జూన్ నాటికి సిద్ధమవుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2020 జూన్‌లో 611.80 కోట్ల అంచనా వ్యయంతో దీని నిర్మాణం చేపట్టామని, కొవిడ్, తుఫాన్ల వంటి కారణాలవల్ల నిర్మాణం ఆలస్యమైందని చెప్పారు. ప్రస్తుతానికి 48.5 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. గురువారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు రామ్మోహన్‌నాయుడు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అలాగే... అకస్మాత్తుగా, అడ్డగోలుగా విమాన టికెట్ ధరలు పెంచడంపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. విస్తారా ఎయిర్‌లైన్స్‌లో చెన్నై నుంచి ఢిల్లీకి టికెట్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నించగా... తొలుత రూ.25వేల ధర చూపించిందని, బుకింగ్ పూర్తయ్యేసరికి అది రెండుమూడు రెట్లు పెరిగిందని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయని స్పీకర్ చెప్పడంతో దీనిపై విచారణ జరుపుతామని రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. మరోవైపు... తమ పరిధిలోని విమానాశ్రయాలకు కొత్త పేర్లు పెట్టాలని పది రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీ మొహోల్ తెలిపారు. తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీవెంకటేశ్వర ఎయిర్‌పోర్ట్' అనే పేరు పెట్టాలని ఏపీ ప్రభుత్వం కోరిందన్నారు.

మద్యం రుణాల్లో ముడుపులు!

- ఇద్దరు రాజ్యసభ సభ్యులకు 80 కోట్లు!
- వారిలో ఒకరు ఇప్పుడు మాజీ
- వేరే రాష్ట్రం నుంచి పెద్దల సభకు ఎన్నిక
- రెండో వ్యక్తి ఇప్పటికీ ఎంపీయే
- ఆయన నిత్యం వివాదాల్లోనే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మద్యం అక్రమాల వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. లిక్కర్ కేసులపై కమీషన్లు, కంపెనీలకు ఆర్డర్లలో అవకతవకలు ఒక ఎత్తు అయితే.. మద్యం బాండ్ల ద్వారా రుణ సమీకరణలోనూ ముడుపులు తీసుకున్న వ్యవహారం బహిర్గతమైంది. పైగా ఈ ముడుపుల్లో సగం ఇద్దరు రాజ్యసభ సభ్యులకు అందినట్లు తెలిసింది. అప్పట్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ బాండ్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో తనఖా పెట్టి రెండు దఫాలుగా ఆ కార్పొరేషన్ రుణం తీసుకుంది. తొలుత ఆ బాండ్లను ప్రమోట్ చేయడానికి, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ చేయించడానికి ముంబైకి చెందిన ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లను నియమించుకుంది. తీసుకునే రుణంలో 1.44 శాతం కమీషన్‌గా ఇస్తామని వారితో ఒప్పందం చేసుకుంది. ఆ అడ్వైజర్ల ద్వారా రూ.9,755 కోట్లు సమీకరించినట్లు చూపించి.. వారికి రూ.165.76 కోట్లు కమీషన్‌గా చెల్లించింది. వాస్తవానికి ఒప్పందం కంటే చెల్లించిన మొత్తం సుమారు రూ.20 కోట్లు అదనం. ఆ అడ్వైజర్ల వెనుక రాష్ట్రానికి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. వీరిద్దరూ వేర్వేరు పార్టీలకు చెందినవారు. వీరిలో ఒకరు వేరే రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. పదవీకాలం ముగిసి మాజీ అయ్యారు. రెండో వ్యక్తి ఇప్పుడు కూడా రాజ్యసభ సభ్యుడిగా ఉండడం గమనార్హం. సదరు అడ్వైజర్లను మేనేజ్ చేసి రుణాలు ఇప్పిస్తామని చెప్పి ఒప్పించారు. వారికిచ్చిన మొత్తంలో తమ వాటా కింద ఎంపీలిద్దరూ చెరో రూ.40 కోట్లు తీసుకున్నారు. అంటే మొత్తం రూ.165 కోట్లలో ఆ ఇద్దరు నేతలకు రూ.80 కోట్లు పోగా.. అడ్వైజర్లకు రూ.85 కోట్లు వెళ్లాయి. ఇందులో ఒక ఎంపీ నిత్యం వివాదాల్లో ఉంటున్న వ్యక్తి. ఎలాగైనావారి వారిద్దరి పాత్రను బహిర్గతంచేయాలని పట్టుదలతో ఉంది.

అప్పులు తెచ్చింది ఇలా..

గత ప్రభుత్వాలు బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి అప్పులు చేసేవి కావు. కానీ జగన్ ఈ కార్పొరేషన్‌ను రుణ సమీకరణ కేంద్రంగా మార్చారు. మొదట కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలు అమలుచేస్తామంటూ ఓ చట్టం చేసింది. అమ్మఒడి, చేయూత, ఆసరా, పెన్షన్ల పథకాల్లో భాగస్వామిని చేసింది. ఆయా పథకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ఇచ్చే నగదును కార్పొరేషన్ ఇచ్చేలా నిబంధనలు రూపొందించింది. సదరు స్కీముల పేరుతో దాని ద్వారా అప్పుల సమీకరణ ప్రారంభించింది. మొదట 9.62 శాతం వడ్డీ రేటుతో రూ.8,305కోట్లు రుణం తీసుకుంది. రెండోసారి బాండ్లు తనఖాపెట్టి అదే వడ్డీ రేటుపై రూ.1,700కోట్లు తీసుకొచ్చింది. మొత్తం రూ.10,005 కోట్లు.ఇందులో రూ.9,755 కోట్ల రుణ సమీకరణకు అడ్వైజర్లు సహకరించారం టూ వారికి రూ.165కోట్లు కమీషన్‌గా ఇచ్చింది.

రాష్ట్ర విద్యుత్ సంస్థల నుంచీ..

తొలుత బాండ్ల తనఖా ద్వారా అప్పులు సమీకరించిన కార్పొరేషన్ తర్వాత సొంత రాష్ట్రంలో అప్పులు మొదలుపెట్టింది. బయట ఇచ్చే వడ్డీ తామే ఇస్తామంటూ విద్యుత్ సంస్థల నుంచి భారీగా అప్పులు తీసుకుంది. ఏపీఈపీడీసీఎల్ పెన్షన్ అండ్ గ్రాట్యుటీ ట్రస్టు, ఏపీఎస్‌పీడీసీఎల్ పెన్షన్ అండ్ గ్రాట్యుటీ ట్రస్టు, ఏపీ జెన్‌కో పీఎఫ్ ట్రస్టు, ఏపీ ట్రాన్స్‌కో పీఎఫ్ ట్రస్టు, ఏపీ ట్రాన్స్‌కో గ్రాట్యుటీ ట్రస్టు, ఏపీఈపీడీసీఎల్ పీఎఫ్ ట్రస్టు.. ఇలా మొత్తం విద్యుత్ సంబంధిత ట్రస్టుల్లో ఉన్న ఉద్యోగుల నగదు రూ.3,143 కోట్లను 8.5 శాతం వడ్డీ రేటుతో సమీకరించింది. వాటికి ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించలేదు. స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా తెచ్చినవి మాత్రమే చెల్లించింది. కార్పొరేషన్ ఇప్పుడు అప్పుల కుప్పగా మారింది.

జారుకుంటున్నారు!

- కేంద్ర సర్వీసులకు వైసీపీ అధికారులు
- అనుమతి లేకుండా కదలొద్దన్న బాబు
- అయినా..వెళ్లిపోయిన విజయ్‌కుమార్ రెడ్డి
- జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన జవహర్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, ధర్మారెడ్డి...
- వారి పదవీ విరమణకు సహకరించిన సర్కారు
- చర్చనీయాంశమైన రాష్ట్ర ప్రభుత్వం తీరు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలన్నర క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నత్తనడకతో వైసీపీ అధికారులు జారుకొంటున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన పలువురు అధికారులు.. ఐదేళ్లు ఇష్టారాజ్యం వ్యవహరించి, ప్రభుత్వం మారగానే ఎంచక్కా కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లిపోతున్నారు. పన్నుల శాఖలో డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేసి ఇటీవలే ఒక రెడ్డి చెప్పకుండా వెళ్లిపోతే, తాజాగా ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి కలకత్తాలో తేలారు. అక్కడ రీజినల్ పీఐబీ ఇంచార్జిగా బాధ్యతలు కూడా తీసుకున్నారు. ఏపీలో ఐదేళ్లపాటు పనిచేసిన ఆయన హయాంలో సమాచార శాఖలో పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఆధారాలతో పాత్రికేయ సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కేంద్ర సర్వీసు అధికారులు ఎవరూ తిరిగి వెళ్లరాదంటూ సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వం నోట్ కూడా విడుదల చేసింది. ఏమైందో తెలీదు కానీ ఏపీలో ఏకపక్షంగా, అడ్డగోలుగా వ్యవహరించిన విజయ్‌కుమార్ రెడ్డి రాష్ట్రం దాటి వెళ్లిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తుండటంతో ఇదే అదనుగా పలువురు అధికారులు జారుగుంటున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్న కె.ఎస్.జవహర్ రెడ్డి, జగన్ ప్రభుత్వంలో దాదాపు ప్రతి అవినీతి, అక్రమానికీ ఏదో రూపంలో లింకున్న ధనుంజయ్ రెడ్డి, టీటీడీ పవిత్రతను దెబ్బతీసి కేవలం జగన్ కేసుల లాబీయింగ్ కోసమే పనిచేసి ధర్మారెడ్డి పదవీ విరమణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మరోవైపు ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ 'ఎప్పుడూ ఇదే ఉండదు మధుసూధన్‌రావు' అంటూ పోలీసుల్ని బెదిరించడాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం జగన్ అధికారంలోకి వచ్చినప్పుడు జాస్తి కిశోర్ లాంటి వారిని మాతృశాఖకు రిలీవ్ చేయలేదు. ఆరోపణల్లేని వారిని ఎందుకు పెట్టుకున్నారని కేంద్రం గట్టిగా అడిగితే, అప్పుడు పంపారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం తనకు సమాచారం ఇవ్వకుండా కేంద్ర సర్వీసుల అధికారులు తిరిగి వెళ్లిపోతుంటే ఏమి చేస్తున్నట్లు.? లేదా సమాచారం ఇచ్చి అనుమతితోనే వెళుతుంటే ఏమి సంకేతం ఇస్తున్నట్లు? అనే ప్రశ్నలకు సమాధానాలు లేవు.

లోకం తీరు



రుతుపవనాలు బలహీనం

విశాఖపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనాలు, రాష్ట్రంపై ద్రోణులు, ఉపరితల ఆవర్తనాలు లేకపోవడంతో రుతుపవనాలు బలహీనంగా మారాయి. దీంతో రాష్ట్రంలో అనేకచోట్ల గురువారం పొడి వాతావరణం నెలకొంది. అక్కడక్కడ మాత్రమే తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరకోస్తా తీరం వెంబడి గాలులు బలంగా వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

ఆరోగ్య బీమాపై కసరత్తు

- ఎన్నికల హామీ అమలుపై స్పీడ్ పెంచిన ప్రభుత్వం
- నిపుణులతో ఆరోగ్యశాఖ మంత్రి చర్చలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఐదు కోట్ల మందికి ఆరోగ్య బీమా కల్పించే అంశంపై ప్రభుత్వం గట్టి కసరత్తు ప్రారంభించింది. ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం విదితమే!. ఈ హామీ అమల్లో భాగంగా ప్రభుత్వం ముందడుగులు వేస్తోంది. ఈమేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం పలువురు ఆరోగ్య బీమా నిపుణులతో చర్చించారు. ఆరోగ్య బీమా అమలు సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. గుజరాత్, కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఆరోగ్య బీమా అద్భుతంగా అమలవుతోందని నిపుణులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఇతర రాష్ట్రాల్లో అమలు ఎలా జరుగుతోంది? అక్కడ ఎలాంటి విధివిధానాలు అమలు చేస్తున్నారనే అంశాలతో పూర్తి నివేదికను అందించాలని ఆదేశించారు.

వివేకా హత్య కేసులో దస్తగిరి సాక్షే

- ఆయన పిటిషన్‌ను అనుమతించిన సీబీఐ కోర్టు



హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నాలుగో నిందితుడు(ఏ-4)గా ఉన్న షేక్ దస్తగిరిని సాక్షిగా గుర్తిస్తున్నట్లు నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ప్రకటించింది. తనను నిందితుడిగా కాకుండా సాక్షిగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తూ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టీ రఘురాం అనుమతించారు. అభియోగాలు నమోదు చేసే వరకు దస్తగిరిని నిందితుడిగా కాకుండా సాక్షిగానే గుర్తిస్తామని స్పష్టంచేశారు. దీంతో అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులకు ఇది శరాఘాతంగా మారింది.

సౌదీ నుంచి నా కుమారుడిని రప్పించరూ..

- మంత్రి లోకేశ్‌కు బాధితుడి తల్లి వినతి



ఆగిరిపల్లి, జూలై 25: పొట్టకూటి కోసం సౌదీ వెళ్లి తినటానికి తిండి లేక నరకయాతన అనుభవిస్తున్న తన కుమారుడ్ని స్వదేశానికి రప్పించాలంటూ బాధితుడి తల్లి సలీమున్నీసా గురువారం మంత్రి లోకేశ్‌ను వేడుకుంది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన సలీమున్నీసా కుమారుడు జుబేర్ మూడు నెలల క్రితం బతుకు తెరువు కోసం సౌదీ అరేబియాలోని రియాద్‌లో డ్రైవర్‌గా పనిచేయటానికి వెళ్లాడు. అయితే, యజమాని జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి, అడిగితే పాస్‌పోర్ట్ లాక్కుని గదిలో ఉంచి చిత్రహింసలకు గురి చేశాడని, తిండి, నీరు కూడా ఇవ్వలేదని.. దీంతో అక్కడి నుంచి పారిపోయి బయటకు వచ్చి కార్ల స్టాండ్‌లో తలదాచుకున్నానని జుబేర్ సోషల్ మీడియాలో వీడియో వైరల్ చేశాడు. ఇది తెలిసిన తల్లి తీవ్ర ఆందోళన చెందుతూ.. మంత్రి లోకేశ్‌ను కలిశారు. వారం రోజుల లోపు జుబేర్‌ను స్వదేశానికి రప్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

కస్టమ్స్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సాధు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కస్టమ్స్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సాధు నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈ పోస్టులో సీహెచ్ వెంకయ్యచౌదరి ఉండేవారు. ఆయన డిప్యుటేషన్‌పై టీటీడీ జేఈవోగా వెళ్లారు. కాగా, సాధు నరసింహారెడ్డి గురువారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు.

టోఫెల్ బోధనకు పీరియడ్లు తొలగింపు

- అకడమిక్ క్యాలెండర్‌పై నిర్ణయం

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకొచ్చిన టోఫెల్ బోధన విధానంపై సమీక్ష చేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. టోఫెల్‌పై త్వరలో విధానపరమైన నిర్ణయం ప్రకటించనుంది. అయితే ఈలోగా విడుదల చేసే 2024-25 విద్యా సంవత్సరం క్యాలెండర్‌లో టోఫెల్‌కు ప్రత్యేకంగా పీరియడ్లు పెట్టకూడదని నిర్ణయించింది.

ఐసెట్ కౌన్సెలింగ్‌కు షెడ్యూలు

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఐసెట్ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి షెడ్యూలు విడుదల చేసింది. ఈనెల 26 నుంచి ఆగస్టు 1 వరకు విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 27 నుంచి 3 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపింది.

టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం రోజున ఇచ్చే ఉపాధ్యాయులకు అవార్డులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరాజరాజు ఓ ప్రకటనలో సూచించారు. మూడు కేటగిరీల్లో టీచర్లకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ అవార్డులు, ఇతర టీచర్లు సిఫారసు చేసే అవార్డులు ఉంటాయని వెల్లడించారు. ఈనెల 26 నుంచి ఆగస్టు 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

స్పోర్ట్స్ కోటా జాబితాను మళ్లీ పంపండి

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో స్పోర్ట్స్ కోటా సీట్ల భర్తీపై సాంకేతిక విద్యాశాఖ దృష్టిపెట్టింది. గతంలో పంపిన స్పోర్ట్స్ కోటా జాబితాలను సరిచేసి మళ్లీ పంపాలని శాప్‌కు సూచించింది. క్రీడా కోటా కింద సీట్లు పొందే అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టింది.

అవినీతి సొమ్ముకు ఆశపడలేదు

- మా కుటుంబం కోసం 'హెరిటేజ్' ఉంది
- కుప్పం ప్రజలతో నారా భువనేశ్వరి



శాంతిపురం మండలం బడుగుమాకులపల్లెలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం, జూలై 25: 'మేము ఏనాడూ అవినీతి సొమ్ముకు ఆశపడలేదు. అవినీతి సొమ్ము ఎంత సంపాదించినా పాపాలను మూటగట్టుకోవడం తప్ప అది చేతిలో నిలవదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజైన గురువారం ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ.. తమ కుటుంబం కోసం హెరిటేజ్‌ను స్థాపించామని, ప్రజల సొమ్ము తమకు అవసరంలేదన్నారు. రాజకీయాలపైనే తమ కుటుంబం ఆధారపడాలన్న ఉద్దేశం చంద్రబాబుకు ఏ కోశానా లేదన్నారు. ప్రజాధనం దోచుకోవాలని ఆయన ఏనాడూ అనుకోలేదన్నారు. చంద్రబాబుపైన, హెరిటేజ్‌పైన అనేక కేసులు పెట్టి గత ప్రభుత్వం అవినీతి అంటించడానికి ఎంతగానో ప్రయత్నించిందని గుర్తుచేశారు. వారి ప్రయత్నాలు ఫలించలేదని, చంద్రబాబు నిజాయితీ ఎన్నికల సందర్భంగా ప్రజా క్షేత్రంలో నిరూపితమైందని భువనేశ్వరి తెలిపారు.

వివస్త్రను చేసి, చెట్టుకు కట్టి, బ్లేడ్లతో కోసి, రాళ్లతో కొట్టి..

- వివాహేతర సంబంధం నెపంతో మహిళపై దాడి
- అన్నమయ్య జిల్లాలో అమానుషం
- పోలీస్ స్టేషన్‌కు వెళితే దుర్భాషలాడిన ఎస్ఐ
- కేసు నమోదుకు తిరస్కరణ, కుల పంచాయితీ చేసుకోవాలని సూచన



చెట్టుకు కట్టేసిన మహిళను విడిపిస్తున్న పోలీసు

వీరబల్లి, జూలై 25: అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం తాటిగుంట పల్లె పంచాయతీ శికారుపాలెంలో మహిళ పట్ల అమానుషంగా ప్రవర్తించారు. వివాహేతర సంబంధం నెపంతో కొందరు ఆమెను వివస్త్రను చేసి అనంతరం చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టి హింసించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ మహిళ (27) మొదటి భర్తతో విడిపోయి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న నెపంతో అతని బంధువులు గురువారం ఆమెను చిత్రహింసలు పెట్టారు. వివస్త్రను చేసి కొట్టడంతో పాటు బ్లేడ్లతో కోశారు. ఆ తర్వాత ఆమెను చెట్టుకు కట్టి కోడిగుడ్లతో, టమోటాలతో, రాళ్లతో, చెప్పులతో కొట్టారు. ఇంత జరుగుతున్నా గ్రామస్థులు వేడుక చూశారు. బంధువులు ఆమెను విడిపించడానికి ప్రయత్నించగా వి ఎమ్మల్ని ఇదే విధంగా కొడతామని బెదిరించడంతో మిన్నకుండిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను విడిపించారు. అనంతరం వీరబల్లి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు రాగా, ఎస్ఐ తీసుకోకుండా మీ కుల వ్యవహారం మీరే పరిష్కరించుకోవాలని చెప్పి పంపారని బాధితురాలు వాపోయారు. రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మీడియాతో మాట్లాడుతూ తనను చిత్రహింసలు పెట్టారని చెప్పినా ఎస్ఐ ఎటువంటి చర్యలు తీసుకోకుండా పంపారని తెలిపారు. బాధితురాలిని రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ పరామర్శించి, ఆమె వాంగ్మూలం ప్రకారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. కాగా..శికారుపాలెంలో మహిళపై దాడి చేసిన వారికి కఠినశిక్ష పడాలని జనసేన పార్టీ వీరమహిళ రెడ్డి రాణి తెలిపారు. ఘటనను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ఈ విషయమై ఎస్ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా కుటుంబానికి సంబంధించిన విషయమని తాము పంచాయితీ చేసుకుంటామని చెప్పడంతో కేసు పెట్టలేదని ఎస్ఐ చెప్పారు.

గోదావరి దోబూచులు



పట్టిసీమ నుంచి విడుదలవులవుతున్న గోదావరి జలాలు



శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి చేరుతున్న వరద నీరు

- తగ్గుతూ..పెరుగుతూ ఉన్న వరద ప్రవాహం
- ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- భద్రాచలం వద్ద మళ్లీ రెండో హెచ్చరిక జారీ
- ఆగస్టు వరకు ఇంతే అంటున్న అధికారులు
- సముద్రంలోకి 12 లక్షల క్యూసెక్కులు


రాజమహేంద్రవరం/పోలవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో గురువారం ఉదయం 9 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సాయంత్రం ఆరు గంటలకు నీటిమట్టం 13.40 అడుగులు ఉంది. బ్యారేజీ గుండా 12,30,242 క్యూసెక్కుల నీరు సముద్రంలో పోతోంది. అయి తే భద్రాచలం వద్ద ఉధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. దీంతో భద్రాచలం వద్ద మళ్లీ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 48.60 అడుగులకు చేరింది. మహారాష్ట్ర, తెలంగాణల్లో అక్కడక్కడ వర్షాలు పడుతుండడంతో గోదావరి వరద పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు మాత్రం ఆగస్టు వరకూ ఇలాగే వరద తగ్గుతూ, పెరుగుతూనే ఉంటుందని చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో పునరావాస శిబిరాలు కొనసాగిస్తున్నారు. వరద దోబూచులాట వల్ల ఏజెన్సీలోని విలీన మండలాల ప్రజలు, గోదావరి లంకల ప్రజలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంకల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రకాలవ పొంగడం వల్ల గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రకాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల

గురువారం సాయంత్రం పోలవరంలో గోదావరి నీటిమట్టం 22.987 మీటర్లు ఉంది. పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా 10,95,616 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి ఎనిమిది పంపుల ద్వారా 2,832 క్యూసెక్కుల గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేస్తున్నారు.

తుంగభద్ర 28 గేట్లు ఎత్తివేత

- శ్రీశైలంకు 1,92,302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- రోజుకు 16.5 టీఎంసీల నీరు చేరిక
- వారంలో జలాశయం నిండే అవకాశం?



తుంగభద్ర డ్యాం 28 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, పల్నాడు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరిగింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గురువారం ఉదయం 8 గంటలకు నీటి మట్టం 1631.91 అడుగులకు, నీటి నిల్వ 101.91 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 75,819 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 20 గేట్లను రెండు అడుగులు, 8 గేట్లను ఒక అడుగు చొప్పున ఎత్తి 75,774 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. డ్యాం ఎగునవ తుంగ, వర్దా నదుల నుంచి వరద పెరగడంతో ఏ క్షణంలోనైనా లక్ష నుంచి లక్షన్నర క్యూసెక్కులు దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని టీబీపీ బోర్డు ఇంజనీర్లు తెలిపారు. కర్నూలు జిల్లాలోనూ తుంగభద్ర తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆదేశించారు. మరోవైపు శ్రీశైలం డ్యాంకు వరద పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1,83,745 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన వరద కూడా రెండు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టుకు చేరే అవకాశం ఉంది. శ్రీశైలంలో ప్రస్తుతం 1,92,302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 855.90 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 94.23 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం రోజుకు సగటున 16.50 టీఎంసీల నీరు డ్యాంలో చేరుతోంది. ఈ వరద ఇలాగే కొనసాగితే వారం రోజుల్లో జలాశయం నిండే అవకాశం ఉంది.

ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం విచారకరం

- ఈ స్థాయిలో సహజ సంపద విధ్వంసాన్ని మొదటిసారి చూస్తున్నా
- వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ ఆవేదన
- ప్రభుత్వం తక్షణం అడ్మినిస్ట్రేటివ్ కమిటీని నియమించాలి: ప్రొఫెసర్ రాజశేఖర్



ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్ తదితరులు

భీమునిపట్నం, జూలై 25: జాతీయ వారసత్వ సంపదగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేయడం పట్ల పర్యావరణవేత్త, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ రాజేంద్రసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ సమీపంలోని భీమిలి ప్రాంతంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలను ఒక బిల్డింగ్ సొసైటీ సభ్యులు చదును చేయడంపై వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. గురువారం ఆ ప్రాంతాన్ని రాజేంద్రసింగ్ సందర్శించారు. ప్రఖ్యాతి గాంచిన ఎర్రమట్టి దిబ్బలను నేషనల్ జియో పార్క్‌గా తీర్చిదిద్దడానికి తనతోపాటు ఎంతోమంది పర్యావరణ నిపుణులు కృషి చేస్తున్నామని, ఈలోగా ఇలా చదును చేయడం చాలా బాధాకరమన్నారు. భారతదేశానికి ఎంతో గర్వకారణంగా, విశాఖ వంటి అందమైన నగరానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టే ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. యాభై ఏళ్లుగా పర్యావరణాన్ని, సహజసిద్ధ నీటి వనరులను కాపాడేందుకు పనిచేస్తున్నానని, ఇంత పెద్ద మొత్తంలో సహజ సంపదను నాశనం చేయడాన్ని మొదటిసారిగా చూస్తున్నానన్నారు. సముద్రతీరంలో ఉన్న ఈ ఎర్రమట్టి దిబ్బల వల్ల సముద్రపు నీరు నగరం వైపు వెళ్లేటపుడు తియ్యగా మారుతుందన్నారు. సముద్ర నీటిలో ఉప్పదనాన్ని ఈ దిబ్బలు తగ్గిస్తాయన్నారు. సముద్ర గర్భ, భూగర్భ నీటి వనరులను శుద్ధి చేసే శక్తి ఈ ఎర్రమట్టి దిబ్బలకు ఉందని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ జియాలజీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏన్నో ఏళ్ల క్రితం సంభవించిన పర్యావరణ మార్పులతో ఈ ఎర్రమట్టి దిబ్బలు ఏర్పడ్డాయన్నారు. అంతటి శాస్త్రీయ ప్రాముఖ్యం ఉండడం వల్లనే 2014లో జాతీయ వారసత్వ సంపదగా గుర్తింపు ఇచ్చి, వీటిని పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందన్నారు. ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం ఎందుకు జరిగిందో తెలుసుకోవడానికి ప్రభుత్వం తక్షణం అడ్మినిస్ట్రేటివ్ కమిటీని నియమించాలని ఆయన కోరారు. ఆ కమిటీలో భవిష్యత్తులో ఎర్రమట్టి దిబ్బలను కాపాడేందుకు అవగాహన ఉన్న శాస్త్రవేత్తలను కూడా నియమించాలని సూచించారు. దీనిని ప్రత్యేక కేసుగా ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే నవంబరు, డిసెంబరు నెలల్లో ఇక్కడే భారీ నేషనల్ జియో హెరిటేజ్ వర్క్‌షాపు నిర్వహించనున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని బూస్టర్ జోన్‌గా డిక్లేర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

టీటీడీ అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి

- రేపు బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవోగా చిరుమామిళ్ల వెంకయ్య చౌదరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2005వ బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అయిన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఈ నెల 16న ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన్ను టీటీడీ అదనపు ఈవోగా నియమించడంతో పాటు తిరుమల జేఈవోగానూ విధులు నిర్వర్తించనున్నారని బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంకయ్య చౌదరి శనివారం ఉదయం శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

దిగ్విజయోస్తు

విశ్వ క్రీడా సంరంభానికి వేళ అయింది. పారిస్ వేదికగా ఒలింపిక్ క్రీడలు ప్రారంభమవుతున్నాయి. 1896లో ఫ్రాన్స్‌కు చెందిన పియరీ డీ కోబర్టిన్ కృషితో ఏథెన్స్ వేదికగా మొదలైన ఆధునిక ఒలింపిక్స్ ప్రపంచ యుద్ధాల కారణంగా మూడుసార్లు మినహా అప్రతిహతంగా సాగుతూ ఆబాల-గోపాలాన్ని అలరిస్తున్నాయి. మానవాళిని వణికించిన కరోనా సమయంలోనూ ఓ ఏడాది వాయిదా పడిందేగానీ రద్దు కాలేదు. వేసవి ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం ఫ్రాన్స్‌కిది మూడోసారి. 1900, 1924లలో పోటీలు జరిగాయి. సరిగ్గా శతాబ్దం తర్వాత మళ్లీ ఇప్పుడు వేడుకకు సిద్ధమైంది. 206 దేశాలకు చెందిన సుమారు 10,500 మంది క్రీడాకారులు 32 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో ఉన్నారు. పారిస్ క్రీడలకు అక్కడి ప్రభుత్వం భారీ స్థాయిలో 45 వేలమంది పోలీసు, మిలిటరీ బలగాలను రంగంలోకి దించింది. క్రీడల్లో సేవలందించేందుకు మిగతా దేశాలనుంచి 45 వేల మంది వాలంటీర్లు రానున్నారు.

ఈ 17 రోజుల పండుగకు భారత్ నుంచి 117 మందితో కూడిన బృందం పారిస్‌కు బయల్దేరింది. 2021లో జరిగిన టోక్యో క్రీడల్లో 122 మందితో వెళ్లిన మన బృందం ఏడు పతకాలు సాధించు-కొచ్చింది. ఒలింపిక్ క్రీడల చరిత్రలో ఇన్ని పతకాలు మనం ఎన్నడూ సాధించింది లేదు. మొత్తంగా చూస్తే ఈ పోటీల్లో మన స్థానం 48. ఈసారి కనీసం పది పతకాలైనా కొల్లగొడతారని అభి-మానులు ఆశలు పెట్టుకున్నారు. జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా మరోసారి స్వర్ణ భేరీ మోగిస్తాడని అంతా ధీమాగా ఉన్నారు. ఏదైనా సంచలనం జరిగి జావెలిన్‌తోపాటు మరొక్క స్వర్ణం మనకు దఖలు పడితే అవధుల్లేని ఆనందమే. లిఫ్టర్ మీరాబాయి చాను, బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాత్విక్ జోడీ, పీవీ సింధు, రెజ్లర్ అంతిమ్ పంగల్, పురుషుల హాకీ జట్టు నుంచి పతకాలు లభించవచ్చునన్నది ఓ అంచనా. ఒలింపిక్స్‌లో 1920లో తొలిసారిగా బరిలోకి దిగింది మొదలు మనం ఇప్పటి-వరకూ సాధించిన పతకాల సంఖ్య 35. వీటిలో హాకీలోనే 12 మెడల్స్ ఉన్నాయంటే, ఇతర క్రీడాంశాల్లో మనం ఎంత వెనుకబడి ఉన్నామో అర్థమవుతుంది. 1952 హెల్సెంకి క్రీడల్లో కేడీ జాదవ్ కుస్తీలో కాంస్యం సాధించే వరకూ మనకు వ్యక్తిగత పతకమే లేదు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఈసారి ఎనిమిది మంది పతకాల పరుగులో ఉన్నారు. వీరిలో ఆరుగురు అమ్మాయిలే. పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, యర్రాజి జ్యోతి, దండి జ్యోతికశ్రీ, బొమ్మదేవర ధీరజ్, నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ, ఇషా సింగ్ నుంచి పతకాలు ఆశిస్తున్నారు.

ఆధునిక ఒలింపిక్స్ మొదలైనప్పటినుంచీ ఇప్పటిదాకా అమెరికాదే ఆధిపత్యం. నువ్వా నేనా అన్నట్టు రష్యా, చైనా దేశాలు దాని వెన్నంటే ఉంటున్నాయి. గత క్రీడల్లో అమెరికా జట్టు పతకాల పట్టికలో చైనా కంటే ఒక్క స్వర్ణం మాత్రమే ఎక్కువ సాధించింది. ఇక డోపింగ్ కారణంగా 2021 క్రీడల నుంచి, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా ఈసారి ఒలింపిక్స్ నుంచి రష్యాను నిషేధించారు. దీంతో వారంతా రష్యా ఒలింపిక్ కమిటీ జెండాకింద ఆడుతున్నారు. 1896 నుంచి 2021 వరకూ పతకాలపై అమెరికా ఒకరకంగా దండయాత్రే చేస్తోంది. మొత్తం 2600 పతకాలతో అగ్రపీఠంపై ఉంది.

గతం సంగతలావుంచితే పారిస్‌లో పలువురు ప్రపంచస్థాయి అథ్లెట్లు మోహరించారు. అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్, కెన్యా మారథాన్ రన్నర్ కిప్చోగె, అమెరికాకు చెందిన 100, 200 మీటర్ల రన్నర్ నోవా లైల్స్, స్వీడన్ పోల్‌వాల్ట్ ఆటగాడు డుప్లాంటిస్, టెన్నిస్ దిగ్గజాలు రఫెల్ నడాల్, జొకోవిచ్, బాస్కెట్‌బాల్ స్టార్ లెబ్రాన్ జేమ్స్, జమైకా స్ప్రింటర్, మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్, ఈత కొలను రాణి కేటీ లెడెకీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. రెప్పపాటులో తారుమారయ్యే ఫలితాలు, ప్రపంచ రికార్డులు, ఉత్కంఠభరిత పోరాటాల సమాహారమైన మహా సంగ్రామానికి అంతా సిద్ధమైంది. అంతర్జాతీయ ఆటగాళ్ల అత్యు-త్తమ ప్రతిభాపాటవాలను ఆస్వాదిస్తూనే, భారత బృందం పతక వేటలో గత రికార్డుల్ని పటాపంచలు చేయాలని ఆకాంక్షిద్దాం.

కన్వర్ యాత్రలో ఆహార రాజకీయం!


akbar


■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

> యోగి ఆదిత్యనాథ్ సర్కార్ నిర్ణయంతో ఈ రోజు ముస్లిం విక్రేతల జీవనాధారాలు ప్రమాదంలో పడ్డాయి. మరి రేపు దళితుల, కింది స్థాయి ఓబీసీ వర్గాల వారి జీవనోపాధులకు అటువంటి గతి పట్టదని ఎవరు చెప్పగలరు? ఎవరెన్ని చెప్పినా ఆహార 'శుచి', 'అస్పృశ్యత' అనేవి శతాబ్దాలుగా హిందూ సమాజంలో కుల వివక్షలో నిర్ణయాత్మకంగా ఉన్నాయి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అన్న ఆదర్శం ఆహారం విషయమై మతతత్వ సంకేతాత్మక రాజకీయ సందేశాలకు ఆస్కారమివ్వదు.

చాలా సంవత్సరాలుగా నేను 'ఎలెక్షన్స్ ఆన్ ఫ్లై ప్లేట్' అనే ఒక టీవీ కార్యక్రమాన్ని నిర్వహి-స్తున్నాను. రుచికరమైన వైవిధ్యభరిత ఆహార పదార్థాల గురించి నివేదనతో సహా ఎన్నికల ప్రచార పోకడలను సవివరంగా చూపించే, వ్యాఖ్యానించే టీవీ షో అది. వాస్తవంగా ఆహారమే ఆ కార్యక్రమం ప్రధాన ఆకర్షణ. కారణం చెప్పాలా? భారతదేశ అద్భుత ఆహార వైవిధ్యానికి సాటిరాగల దేశమేదీ ప్రపంచంలో లేదు కదా. మరి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ పోలీసులు కన్వర్ యాత్ర సమయంలో ఆహార నిఘా (పోలీసింగ్)కు పాల్పడు-తున్నారు! ఇది భారతీయ అస్తిత్వ విశిష్టతగా భావించేదాన్ని దెబ్బతీయడమే కాదూ?

భారతీయ ఆహారం భారతీయ జీవన పరిమళం. దక్షిణ భారతావనిలో ఉన్న మదురై వెళ్లండి. ఉత్కృష్ట ఆలయ శిల్పానికి దర్పణమైన మీనాక్షిపురం కోవెల సమీపంలోనే అమ్మాస్ కిచెన్ అనే ఒక అద్భుత భోజనశాల ఉన్నది. చెట్టినాడ్ మాంసాహారం, పీతల ఆమ్లెట్, కుందేలు మాంసాన్ని ఆస్వాదించాలంటే ఆ కిచెన్‌కు వెళ్లాల్సిందే. అటువంటి కమ్మని వంటకాలు మదురైలో కాక మరెక్కడ లభిస్తాయి? జైపూర్ పాత బస్తీలో మూడు అంతస్తుల రెస్టారెంట్ ఒకటి ఉన్నది. ఇప్పటికి చాలా తరాలుగా ఒక ముస్లిం కుటుంబమే దానిని నిర్వహిస్తోంది. చవులూరించే మొగలాయి వంటకాలు అక్కడ కాక మరెక్కడ మీకు ఎక్కడ లభ్యమవుతాయి? ఆ పురాతన హోటల్ ఒక 'శుద్ధ' శాకాహార భోజనశాల పక్కనే ఉందని నేను చెప్పి తీరాలి. పూణే–సోలాపూర్ హైవేలో జై తుల్జా భవాని అనే పేరు గల ధాబా ఒకటి ఉన్నది. పరిమళ భరితమైన మటన్ వంటకాలకు అది పెట్టింది పేరు. ఆ ధాబాను నిర్వహిస్తున్న కుటుంబం ధంగార్లు అనే ఒక ఓబీసీ సామాజిక వర్గానికి చెందినది. అమితమైన మత నిష్ఠ గల కుటుంబమది. అయినా ఆ కుటుంబ సభ్యులందరికీ మాంసాహారమే నిత్య ఆహారం. ఆంధ్రాకు వెళదాం. విజయవాడ నడి బొడ్డున అర డజన్ రకాల ఆంధ్ర బిర్యానీలను విక్రయించే ఒక స్టాల్ ఉంటుంది. మీరు ఆ స్టాల్‌కు వెళ్లితే దాని పక్కనే ఉన్న ఒక ఇడ్లీ–దోశ జాయింట్ మిమ్ములను తప్పక ఆకర్షిస్తుంది.

అద్భుతమైన పాకనాడు మన భారతావని. ఆహార భారతంలో మీకు ఎల్లెడలా శాంతియుత సహజీవనమే కనిపిస్తుంది. ఒక రెస్టారెంట్ ఘనతను దాని యజమాని పేరునుబట్టి కాకుండా అది వడ్డించే వంటకాల నాణ్యత ఆధారంగా మాత్రమే ఆస్వాదకులు నిర్ణయిస్తారు, గుర్తు పెట్టుకుంటారు. అయినా కన్వర్ యాత్రా మార్గంలో రోడ్డు పక్క రెస్టారెంట్‌లు తమ యజమాని పేరు ఉన్న బోర్డు (నేమ్ ప్లేట్) ఉండి తీరేలా చూడాలని ఉత్తరప్రదేశ్ పోలీ-సులను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 'ఆదేశించింది'! ఇది, ఉద్దేశపూర్వకంగా పౌర సమాజంలో మతపరమైన విభేదాలను రగుల్కొల్పే నిర్ణయమే కాదూ? యాత్ర మార్గం పొడవునా శాంతి భద్రతలకు ఎటువంటి భంగం కలుగకుండా జాగ్రత్త వహించేందుకే ఆ ఆదేశాన్ని జారీ చేసినట్టు యోగి సర్కార్ సమర్థించుకుంటోంది. ఇంతకంటే కపటం మరేమైనా ఉంటుందా? కన్వర్ యాత్ర ఈ నాటిదా? ఏ నాటి నుంచో జరుగుతున్న తీర్థయాత్ర కదా అది. అయితే యాత్రికుల ఆహార అలవాట్ల విషయమై అది ఎన్నడూ ఇబ్బందుల్లో పడలేదు. ఇప్పుడు యోగి ప్రభుత్వ వివక్షాపూరిత ఆహార రాజకీయాల కారణంగానే అది వివాదాస్పదమయింది. అనవసర సమస్యల నెదుర్కొంటోంది.

రెస్టారెంట్లు, ధాబాలు తమ యజమాని పేరును ఎందుకు ప్రదర్శించాలి? సామాజిక వేర్పాటుతనాన్ని రెచ్చగొట్టేందుకే యోగి సర్కార్ ఆ ఆదేశాన్ని జారీ చేసింది. ఒక నిర్దిష్ట మతం వారిని ప్రత్యేకంగా సూచించేందుకే ఆ ఆదేశం. ఆ మతస్థులు ముస్లింలు అని మరి చెప్పనవసరం లేదు. ముస్లిం మతస్తుల నిర్వహణలోని తినుబండారాలలో యాత్రికులు ఏమీ కొనకుండా నిరోధించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నారు. ఇది ఎటువంటి మినహాయింపులు లేని సామాజిక వివక్ష, సందేహం లేదు. మతపరమైన చీలికలు సృష్టించడమే దీనివెనుక ఉన్న ఉద్దేశం. యాత్రికులు వాంఛించని, వారి మతవిశ్వాసాలకు విరుద్ధ-మైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని ఏ వ్యాపారి అభిలషిస్తాడు? వ్యాపారి అనేవాడు మతపరమైన కారణాలతో వినియోగదా-రులను పోగొట్టుకుంటాడా?

సరే, సామాజిక మాధ్యమాలు కన్వర్ యాత్రలో ఆహార రాజకీయాన్ని మరింత హానికరం చేసేందుకు ప్రయత్నిస్తు-న్నాయి. ముస్లింల యాజమాన్యంలోని రెస్టారెంట్లు 'అపరిశుభ్రమైనవని', 'అనారోగ్యకరమైనవని' ఆ అధునాతన మాధ్యమాలలో ఎందరో ఘోషిస్తున్నారు. ఇదొక శుద్ధ అబద్ధం. ఇది నిస్సిగ్గుగా మతతత్వాన్ని ప్రదర్శించడమే. అటువంటి అభిప్రాయాలు వ్యక్తం చేసిన వారు ముస్లింల పట్ల ఎంత దురభి-ప్రాయంతో ఉన్నారో వెల్లడవుతుంది.

ఈ సందర్భంగా ఒక సమాంతర విపరీత ఉదంతాన్ని పేర్కొనడం సము-చితంగా ఉంటుంది. అది కొవిడ్ ఉపద్రవ కాలంలో సంభవించింది. దేశ రాజధానిలో తబ్లీఘీ జమాత్ సమావేశాలు జరిగాయి. సరిగ్గా అదే సమయంలో కొవిడ్ కేసులు అంతు లేకుండా పెరిగాయి. ఇంకేముంది, మతో-న్మాదులకు ఒక సాకు దొరికింది. తబ్లీఘీ ముస్లింలే కరోనా విలయాన్ని వ్యాపింపచేస్తున్నారనే ఒక అపప్రథను పుట్టిం-చారు! ఆ ప్రపంచవ్యాప్త మహమ్మారికి ముస్లింలే కారణ-మంటూ విషప్రచారం జరిగింది. ముస్లింలు అందరినీ లక్ష్యం చేసుకున్న ఆ తప్పుడు ప్రచారం ఆ విపత్కాలంలో చాలా ప్రభావదాయకంగా పరిణమించింది. ఎంతగా అంటే వీధుల్లో తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకునే ముస్లిం విక్రేతలను ఊరూ, వాడలోనూ, బస్తీలు, కాలనీలలోనూ బహిష్కరించడం జరిగింది. కన్వర్ యాత్ర వివాదంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం శీఘ్ర-గతిన, సకాలంలో జోక్యం చేసుకుని ఉండకపోతే కొవిడ్ కాలంలో సంభవించిన దుష్పరిణామమే ఇప్పుడూ వాటిల్లి ఉండేదనంలో సందేహం లేదు. ఆ హిందూ తీర్థయాత్ర మార్గంలో ఉన్న రెస్టారెంట్లు తమ యజమానులు, నిర్వాహకుల, సిబ్బంది పేర్లను ప్రదర్శించాలనే ఆదేశం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను, వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉల్లంఘిం-చడమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ఎంతైనా ముదావహం.

ఈ వివాదం ఉత్తరప్రదేశ్‌లో ఆరంభమవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకని? ముగిసిన వేసవిలో జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికలలో, దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఆ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ భారీగా నష్ట-పోయింది. ఆ ఎన్నికల తీర్పు వెలువడిన నాటి నుంచి యూపీలో ఆ పార్టీ చాలా క్లిష్టపరిస్థితుల నెదుర్కొంటోంది. పార్టీకి ఎన్నడూ లేని విధంగా సీట్లు, ఓట్లు తగ్గిపోవడానికి కారణమెవరు అనే విషయమై యూపీ బీజేపీలోని వివిధ వర్గాలు బహిరంగంగా పరస్పర ఆరోపణలు చేసుకుంటు-న్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పార్టీ పరా-జయానికి ప్రధాన కారకుడిని చేసేందుకు ఒక గట్టి ప్రయత్నమే జరుగుతోంది బీజేపీ కేంద్ర నాయకత్వం బాహాటంగా అయితే ఏ పక్షమూ వహించడం లేదు. అటువంటి వైఖరి శ్రేయస్కరం కాదని భావిస్తున్నందున ఆ పరస్పర సతాయింపులు మరింతగా కొనసాగేందుకు అనుమతిస్తోంది. తనపై వర్షిస్తున్న నిందలు, ఆరోపణలకు నిలువెల్ల కాషాయ వస్త్రధారి అయిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎప్పటిలాగానే దురుసుగా ప్రతిస్పంది-స్తున్నారు. దేనికీ విచారం వ్యక్తం చేసే స్వభావం కాని, క్షమాపణ చెప్పే నమ్రత కాని ఏ కోశా-నాలేని అతివాద హిందుత్వ యోధుడు ఆ యోగి. మరి రాజకీయంగా సరైన ప్రవర్తన అనే విషయమై సంప్రదాయ రీతి రివాజులకు ఆయన కట్టు-బడుతాడా? అసంభవం. భగవాన్ శివ భక్తులు కాలినడకన హరిద్వార్ మొద-లైన పవిత్ర గంగానది వెంబడి పుణ్య క్షేత్రాలకు వెళ్లి గంగా జలాన్ని సేకరించి శివాలయాలలో సమర్పించడమే కన్వర్ యాత్ర. ఈ వార్షిక తీర్థయాత్ర ఏటా శ్రావణ మాసంలో జరగడం అనూచా-నంగా వస్తోంది. ఈ యాత్ర 'పవిత్రత' లేదా 'ధర్మబద్ధత'ను సమర్థిస్తూ తన హిందూ మత నిబద్ధతను హిందూత్వ మద్దతుదారులకు నొక్కి వక్కాణించేం-దుకు యోగి ప్రభుత్వం ఆరాటపడు-తోంది. తత్కారణంగానే కన్వర్ యాత్ర మార్గంలోని ఆహార పదార్థాలను విక్రయించే ముస్లింల మూలంగా ఈ తీర్థయాత్ర మాన్యత అపవిత్రమవుతుం-దనే వాదనతో ధాబాలు, రెస్టారెంట్లు తమ యజమానుల, నిర్వాహకుల పేర్లను ప్రదర్శించాలని యోగి సర్కార్ ఆదే-శించింది. అయితే ఈ వ్యూహాత్మక రాజకీయ నిర్ణయం రాజ్యాంగ నియమాలు, నిర్దేశాలను పూర్తిగా ఉపేక్షించింది, అగౌరవపరిచింది.

ఆదిత్యనాథ్, ఆయన హిందుత్వ సమూహం ఒక సత్యాన్ని విస్మరించింది. ఎన్నికలలో గెలిచేందుకు మెజారి-టేరియన్ అస్తిత్వ రాజకీయాలు ఇంకెంత మాత్రం ఎన్నిక-లలో విజయానికి భరోసా కావని, కాబోవనే నిరూపిత వాస్తవాన్ని గుర్తించడంలో యోగి ఆదిత్యనాథ్ విఫల-మయ్యారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో జరిగిందేమిటి? యోగి పాలనలో ఉన్న యూపీలో బీజేపీకి వ్యతిరేకంగా దళితులు, ముస్లింలు, యాదవ్‌లు ఓబీసీలు ఏకమయ్యారు. సమ్మిళిత పాలన నందించడలో బీజేపీ ప్రభుత్వం విఫలమవడం వల్లే కాదూ? కుల అస్తిత్వాలు మళ్లీ పదునెక్కుతున్నాయి, కీలకంగా పరిగణన పొందు-తున్నాయి. యోగి సర్కార్ నిర్ణయంతో ఈ రోజు ముస్లిం విక్రేతల జీవనాధారాలు ప్రమాదంలో పడ్డాయి. మరి రేపు దళితుల, కింది స్థాయి ఓబీసీ వర్గాల వారి జీవనో-పాధులకు అటువంటి గతి పట్టదని చెప్పగలిగేది ఎవరు? ఎన్ని చెప్పినా, ఏమి జరిగినా ఆహార 'శుచి', 'అస్పృశ్యత' అనేవి శతాబ్దాలుగా హిందూ సమాజంలో కుల వివక్షలో నిర్ణయాత్మకంగా ఉన్నాయి. మరి ఏ ప్రగతిశీల ప్రజా-స్వామ్య ప్రభుత్వమైనా గతించిన యుగాలలో హిందువుల జీవన విధానాన్ని కట్టడి చేసిన ఆ పక్షపాతాలను పునరు-ద్ధరించడానికి బదులు మనసా వాచా కర్మణా సమతా భావనలు వర్ధిల్లే భవిష్యత్తు నిర్మాణానికి పూనుకోవాలి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' (అందరితో కలిసి అంద-రికీ అభివృద్ధి) అన్న ఆదర్శం ఆహార రాజకీయాలపై మత-తత్వ సంకేతాత్మక సందేశాలు, సూత్రీకరణలకు ఆస్కార-మివ్వదు.

తాజా కలం: ఉత్తరప్రదేశ్‌లోని ఒక హైవేలో 'మున్నా కిచెన్' అనే ఒక రెస్టారెంట్ ఉన్నది. మున్నా అనేది వాస్తవంగా ఆ హోటల్ యజమాని మహమ్మద్ ఖాన్ ముద్దు పేరు. ఆయన హోటల్‌లో పని చేసే నలభీముల్లో ఒకరు యాదవ్ కులస్తుడు. భారతీయతలో మనలను సమ్మిళితపరిచే అద్భుతమది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజ్యాంగంపై 'కుడి ఎడమల' దాడి!

రాజ్యాంగ రచనా కాలం నుంచీ రాజ్యాంగంపై దాడి కొనసాగుతున్నదే. తాము కాంక్షించిన మతరాజ్యాన్ని అంగీకరించనందుకు ఈ రాజ్యాంగాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం అని రైట్ వింగ్ ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు ఆనాడే ప్రకటించారు. అనంతర కాలంలో 'ఈ రాజ్యాంగం పేదలను అణచిపెట్టేందుకు రాసినది' అని ఆధిపత్య కుల నాయకత్వంలోని లెఫ్ట్ వింగ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ విప్లవ సంస్థలు ప్రకటించాయి. గతంలో పాలన సాగించిన కాంగ్రెస్ తది-తర పార్టీలు రాజ్యాంగ లక్ష్యాలను పూర్తిస్థాయిలో నెరవేరనీయకుండా కాలయాపన చేస్తూ వచ్చాయి. ప్రస్తుతం బీజేపీ రాజ్యాంగబద్ధంగా ఎన్నికై రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రక-టించింది. విప్లవ రచయితల సంఘం 29వ రాష్ట్ర మహాసభలలో 'రాజ్యాంగ వాదం' పేరుతో రాజ్యాంగంపై దాడికి దిగింది. లెఫ్ట్ రైట్‌ల ఉమ్మడి కార్యాచరణగా కొనసాగుతున్న ఈ రాజ్యాంగ రద్దు లక్ష్యాన్ని పౌర సమాజం తమ ఓటు హక్కుతో కొంతమేర కట్టడి చేయగలి-గింది. ఇటీవలి ఎన్నికల్లో మతతత్వ ఎజెండా పట్ల ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో 'రాజ్యాంగ రద్దు' బాధ్యతను ఇప్పుడు ఎర్రజెండా స్వీకరించినట్లుగా స్పష్టమవుతుంది. ఈ క్రమంలోనిదే బి.ఆర్. బాపూజీ 'అందరూ రాజ్యాంగ రక్షకులే కానీ...' వ్యాసం (ఆంధ్రజ్యోతి –12.7.2024). రాజ్యాంగం ముంగిట స్మృతుల ఆచరణ కొనసాగిస్తున్న వ్యవస్థలు పరిఢవి-ల్లుతున్న దశలో శ్రామిక ప్రజల ప్రయోజనాల వంకన వాస్తవ స్పృహ లేకుండా సాగిన వ్యాసమిది.



> ఇటీవలి ఎన్నికల్లో మతతత్వ ఎజెండా పట్ల ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో 'రాజ్యాంగ రద్దు' బాధ్యతను ఇప్పుడు ఎర్రజెండా స్వీకరించినట్లుగా స్పష్టమవుతోంది. రాజ్యాంగ వైఫల్యానికి అసలు కారణాలేమిటో అన్వేషించకుండా, కనిపించినా చూడకుండా రాజ్యాంగ రచయితే లక్ష్యంగా బి.ఆర్. బాపూజీ వ్యాసం కొనసాగింది.

ఈ రచయిత రాజ్యాంగ సభ్యుల ఎన్నికల నుంచి మొదలుపెట్టి రాజ్యాంగంలోని కొన్ని ఆర్టికల్స్‌ను ఉటంకిస్తూ రాజ్యాంగ రచయితను ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగ స్వభావాన్ని శ్రామిక వర్గ దృక్పథంతో అంచనా వేయాలని కోరుతు-న్నారు. అలాగే సంస్కరణతో సమయం వృథా చేయకూడదని తక్షణ రాజ్యాంగ రద్దుకు తొందరపడుతున్నారు. ఆ తీవ్రకాంక్ష ఆయన అక్షరాక్షరానా వ్యక్తం అయింది.

అంబేడ్కర్ అసలు రాజ్యాంగం అంతా ఆయన పాల్గొన్న రౌండ్ టేబుల్ సమావేశాల్లోను, ఆయన రాసిన 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పుస్తకంలోను రాజ్యాంగ రచనకు ముందే వ్యక్తమైంది. అది గమనంలో ఉంటే అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తి ప్రస్ఫుటంగా ఎవరికైనా అర్థమవుతుంది. ప్రస్తుత రాజ్యాంగం అంతా రచయితగా అంబేడ్కర్ కాంక్షించినదేమీ కాద-న్నది, ఆయన అభిప్రాయాలకు విరుద్ధమైనవి కూడా అందులో చోటుచేసుకున్నాయన్నదీ చారిత్రక వాస్తవం. దీనికి ఇప్పటికీ 'కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ డిబేట్స్ వాల్యూ-ములు' తిరుగులేని సాక్ష్యాలు. రాజ్యాంగ రూపకల్పనలో గల కీలకాంశాలను, అందులో వ్యక్తుల పాత్రను అవి పట్టి చూపుతున్నాయి. అంబేడ్కర్ కోరుకున్న రాజ్యాంగ రచనకు సహకరించినవారు ఎవరో, అందులోని ప్రగతికారకమైన అంశాలను తొలగించేందుకు ప్రయత్నించినవారు ఎవరో అవి ఆధారాలతో సహా పట్టిస్తున్నాయి. రాజ్యాంగ సభలో మెజా-రిటీ సభ్యుల అభిప్రాయం మేరకు మాత్రమే రాజ్యాంగంగా రూపొందిందనే వాస్తవం తెలి-సినప్పటికీ వ్యాసకర్త బాపూజీ కేవలం రాజ్యాంగ రచయితపైనే దోషమంతా నెట్టే పనికి పూనుకున్నారు.

'భూమిని ఇతర కీలక పరిశ్రమలని జాతీయం చేయాలని, భూమిని అభివృద్ధి చేసి ప్రభుత్వమే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా నిర్వహించాలని' అంబేడ్కర్ కోరుకున్నారు. 'ఏ ప్రభుత్వమైనా నిజాయితీగా రాజకీయంగా సామాజికంగా సమానత్వాన్ని సాధించాలనుకుంటే దాని ఆర్థిక విధానం సోషలిస్టు ఆర్థిక విధానం కాకపోతే ఎలా సాధ్యం' అని పండిట్ నెహ్రూను సైతం ప్రశ్నించేందుకు అంబేడ్కర్ వెనుకాడలేదు. రాజ్యాంగంలో స్టేట్ సోషలిజం చోటు చేసుకోకుండా మెజారిటీ సభ్యులు అడ్డుకున్నారు. అంబేడ్కర్ తీవ్రంగా వ్యతిరేకించిన ఆస్తి హక్కు ఆర్టికల్ 31గా రాజ్యాంగంలో చేర్చి మొత్తం అంబేడ్కర్ రాజ్యాంగ రచనా స్ఫూర్తినే దెబ్బ తీశారు. ఈ విషయంలో తన ఆవేదనను అంబేడ్కర్ 1955 మార్చి 19న రాజ్యసభలో చేసిన ప్రసంగంలో వ్యక్తం చేసారు. 'ఆర్టికల్ 31 పరమ వికృతమైన అంశం. దాని వంక చూడడమే నాకు పరమ అసహ్యం' అని ఆయన పేర్కొన్నారు. కానీ రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రను, రాజ్యాంగ విశ్వసనీయతను ఏకకాలంలో దెబ్బతీయటం ద్వారా ఇప్పటికీ రాజ్యాంగ పరిరక్షణ కర్తవ్యాన్ని మోస్తున్న వర్గాలను ఆ కృషి నుంచి సడలిపోయేలా చేయడమే బాపూజీ ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది.

అంబేడ్కర్ బ్రతికినంత కాలం తీవ్రంగా నిరసించిన ప్రైవేటు ఆస్తిహక్కును నిర్మూలించడం కోసం ఏ రకమైన కృషి చేయని ఈ వామపక్ష వాదులకు భారత రాజ్యాంగంలో నాటి నుండి నేటికీ ఒక్కటంటే ఒక్క విషయం కూడా శ్రామిక ప్రజలకు పనికొచ్చే అంశం కనిపించక-పోవటానికీ, రాజ్యాంగాన్ని ఏక మొత్తంగా తృణీకరించి దాని రద్దును ఇంతగా కాంక్షించ-టానికీ కారణాలు స్పష్టమే. లెఫ్ట్ రైట్‌లు రెండూ వేర్వేరు అంశాలుగా కనిపించే ఆధిపత్య కుల కవలలు కావటమే అసలు కారణం. నాలుగు కనులు – ఒకే ఒక దుస్వప్నం.

నాటి రాజ్యాంగ పరిషత్ సభ్యులు భారత ప్రజలంతా ఓట్లు వేసి ఎన్నుకున్నవాళ్లు కానప్పటికీ పరిమితంగానైనా ఈ దేశ ప్రజలకు ఈ రోజు అందుతున్న హక్కులకు నాటి సభ్యుల అంగీకారమే ఏదో మేర కారణం. ప్రజాప్రతినిధులు ఇన్ని సంవత్సరాలలో ఆ రాజ్యాంగాన్ని ఏ మేరకు అమలు చేయగలిగారో రచయిత పరిశీలించినట్లు కనిపించదు. ఎస్సీ ఎస్టీ కేసులలో నిందితులు శిక్షించబడకపోవడానికి ఈ రాజ్యాంగమే కారణమని, ఈ చట్టాలతో ఏ ప్రయోజనమూ లేదనే వింత వాదన చేసారు వ్యాసకర్త. పాలకులు ప్రభుత్వ యంత్రాంగాలు నిందితుల పక్షాన నిలిచిన కారణంగా జరిగే అన్యాయానికి కూడా రాజ్యాంగ రచయితలే కారణమని చెప్పబోవడం వాస్తవ విస్మరణ.

'రాజ్యాంగం అంటే పెత్తనం చెలాయించే సాధనం కాదని అది కేవలం సమాజంలో అసమానతలను చట్టబద్ధంగా తొలగించి నవ జీవనాన్ని క్రమ పద్ధతులలో నడిపే ఒక మార్గదర్శిగా ఉండాలని' అంబేడ్కర్ కోరుకోవడాన్ని గ్రహించాలి. రాజ్యాంగ రూపకర్తలకు అవకాశం దొరకక వదిలిన ఖాళీలను వర్తమాన తరాలు పూరించుకోవాలి. అలాగే ప్రతికూల అంశాలను తొలగించుకునేందుకు రాజ్యాంగమే ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఉన్న రాజ్యాంగ హక్కుల పరిరక్షణకే శతాబ్దాల కాలం సరిపోకపోతే మరింత మెరుగైన కృషికి ఆస్కారమెక్కడ. అటువంటి వాస్తవిక దృష్టి ఏమీ లేకుండా నిర్మాణాత్మక వైఖరిని విస్మరించి రాజ్యాంగ రద్దును ఆది నుండీ జపించే లెఫ్ట్ రైట్ దళాల రాజ్యాంగ ద్వేషం అంతిమ లక్ష్యం ఏమిటి?

వీరు నినదించిన మరో ప్రపంచం అగ్రజులను అగ్రనాయకులుగా మార్చి పీడిత కులాలకు రమణీయ మరణాన్ని మిగిల్చాక ఇప్పుడు మరలా శ్రామికుల పేరిట నూతన రాజ్యాంగాన్ని వాగ్దానం చేస్తున్నారు. ఈ కుట్రలను గ్రహించలేని దశను భారతీయ దళిత, పౌర సమాజం ఎప్పుడో దాటిపోయిందని వ్యాస రచయిత గ్రహించాలి!

● బడుగు భాస్కర్ జోగేష్

ఎవరి ప్రయోజనాలకు ప్రతిపక్ష నేత హోదా?

చట్టప్రకారం శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. శాసనసభలో ప్రతిపక్షం, ప్రతిపక్ష నేత ఉండటం అవసరం అని, ప్రజాసమస్యలు లేవలేవనెత్తి, వాటిపై మాట్లాడే హక్కు తనకే వుందని, ఆ హక్కును తన పార్టీకి వచ్చిన సీట్ల ఆధారంగా కాలరాయడానికి వీలు లేదని, సంప్రదాయాల పేరుతో చట్టవిరుద్ధంగా వెళ్లడానికి వీలులేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు జగన్‌రెడ్డి. ఆ మధ్య కూడా ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తగలుగుతానని బెదిరింపు ధోరణితో స్పీకర్‌కు జగన్ లేఖ రాశారు. అసలు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ఇష్టపడకపోతే నాకు ప్రతిపక్ష హోదా ఇచ్చి తీరాల్సిందే అంటూ గగ్గోలుపెట్టడం ఏమిటి?

పార్లమెంట్లు, అసెంబ్లీ సంప్రదాయం ప్రకారం రాజకీయ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే ఎన్నికల్లో పది శాతం సీట్లు రావాలి. కౌల్ అండ్ షక్దర్ రూల్స్ పుస్తకంలో కూడా ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటే ఆ పార్టీకి పది శాతం మంది సభ్యులు ఉండాలని ఉన్నది. జగన్‌కి ప్రతిపక్ష హోదా దక్కాలంటే, 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. కానీ ఆయనతో సహా 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దీని ప్రకారం ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కే అవకాశమే లేదు. నిజంగా ప్రతిపక్ష నేత హోదా కోసం రాద్ధాంతం చేసేది జనం కోసమా? జగన్ కోసమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సభలో ప్రజా సమస్యలు లేవనెత్తాలంటే ప్రతిపక్ష నేత హోదానే అక్కరలేదు. ఎమ్మెల్యే అయినా చాలు. కానీ జగన్ తన స్వార్థం కోసం, క్యాబినెట్ ర్యాంక్ మంత్రి పదవికి సమానమైన పదవి కోసం, వ్యక్తిగత భద్రత కోసం, దర్పం వెలగబెట్టడం కోసం పాకులాడుతున్నాడు తప్ప ప్రజల కోసం కాదు. రాష్ట్రంలో అసెంబ్లీ జరుగుతుంటే, ఇక్కడ గళమెత్తాల్సిన సమయంలో ఆయన ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేయడం ఎవరి ప్రయోజనాలకోసం?

18 ఎమ్మెల్యేల బలం లేనందున స్పీకర్ ఆయనను సభలో వైసీపీ శాసనసభాపక్ష నేతగా గుర్తిస్తారు తప్ప, ప్రతిపక్ష నేతగా గుర్తించే అవకాశం లేదు. ఇప్పుడు సుభాషితాలు చెబుతున్న జగన్‌రెడ్డి తానూ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం 23 మంది శాసనసభ్యులలో కొందరిని నేను లాగేస్తే చంద్రబాబుకి ప్రతిపక్ష హోదా కూడా ఉండదని అన్నారు. నేడు అదే జగన్‌రెడ్డి తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఎలా అడుగుతారు? ఇప్పుడు సంప్రదాయాలకు విరుద్ధంగా జగన్‌కి ప్రతిపక్ష నేత హోదాను కట్టబెడితే, దానిని ఉపయోగించి మళ్లీ కోర్టు వాయిదాలకు వెళ్లకుండా తప్పించుకోవడానికే ఇదంతా, అంతేగానీ జనం కోసం మాత్రం కాదు.

– నీరుకొండ ప్రసాద్

ప్రాజెక్టులపై నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆంధ్ర–తెలంగాణ సరి-హద్దులోని ఏలూరు–భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఉన్న మీడియం ఇరిగేషన్ పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడింది. ఇది ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని 12 గ్రామాలను తుడిచిపెట్టేసింది. ఇళ్ళు, వాకిళ్లు కొట్టుకుపోయాయి. వేలాది కుటుంబాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. రోడ్లు దెబ్బతిని మండలంలో 30 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి-పోయాయి. వందల ఎకరాలలో ఇసుక మేటలు వేసి పంటలు పండించుకునే అవకాశం లేకుండా పోయింది. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్తి నష్టం అంచనా రూ.150 కోట్లు పైనే. ఇక్కడ రైతులు, ప్రజల బాధలు వర్ణనాతీతం.

పెద్దవాగు ప్రాజెక్టు గండితో రాష్ట్రం ఉలిక్కి పడింది. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 85:15 నిష్పత్తిలో నిధులు ఖర్చు చేయాలి. 1981లో పూర్తి చేసిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధి 16వేల ఎకరాలు కాగా, ఇందులో ఏలూరు జిల్లా పరిధిలోని వేలేరుపాడు మండలంలో 13,640 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని అశ్వారావుపేట మండలంలో 2,360 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ పనులకు రూ.100 కోట్లు ప్రతి-పాదనలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.85 కోట్లు, తెలంగాణ ప్రభుత్వం రూ.15 కోట్లు నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రాజెక్టు గేట్లు నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడం వల్ల భారీ నష్టానికి కారణమైంది. మూడు భారీ గండ్లు, 25 చిన్నగండ్లు పడ్డాయి. ప్రజలు ఇళ్ళు, పంటలు, పశువులు, సామాగ్రి అన్నీ కోల్పోయారు. అర టీఎంసీ వాటర్ స్టోరేజి సామర్థ్యం కలిగిన పెద్దవాగు ప్రాజెక్టు పరిధిని పెంచి సాగు విస్తీర్ణం పెంచే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రణాళికలు గానీ, నిధులు కేటాయింపు కానీ లేకపోవడం అన్యాయమే. ప్రాజెక్టు పరిధి పెంచడం సంగతి అలా ఉంచితే, కనీసం గేట్లకు గ్రీజు పెట్టడానికి నిధులు లేవు. ఏలూరు జిల్లా పరిధిలోని మిగి-లిన ముఖ్యమైన జలాశయాల పరిస్థితీ ఇదే.

ఒక్క పెద్దవాగు ప్రాజెక్టే కాదు. బుట్టాయిగూడెం మండలంలో గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం 217 మీటర్ల నిల్వ సామర్థ్యంతో ఉంది. దీని నిర్వహణకు రూ.28 లక్షల ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదు-వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ప్రాజెక్ట్ నిర్వహణ చర్యలు చేపట్టడం లేదు. గేట్ల తలుపులకు చిల్లులు పడి వాటర్ లీక్ అవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. గట్లు బలహీనంగా ఉన్నాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయాయి. ప్రాజెక్టు పరిధి పెంచి సాగు విస్తీర్ణం పెంచే అవకాశం ఉన్నా, నిర్వహణకే దిక్కులేదు.

ఎర్ర కాలువ నది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దుఃఖదాయనిగా పేరుగాంచింది. వరదల నుంచి రక్షణ కోసం జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వద్ద కరాటం కృష్ణమూర్తి జలాశయం నిర్మించారు. నాలుగు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ప్రాజెక్టు గట్లు బల-హీనంగా ఉండడంతో మూడు టీఎంసీలు వాటర్ వస్తేనే గేట్లు ఎత్తేస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో కొయ్యల-గూడెం మండలం, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం తదితర మండలాల్లో వరద ముంపుతో వేలాది ఎకరాల్లో ప్రతి ఏటా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్వహణకు రూ.15కోట్లు ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ నిధులు మంజూరు కాలేదు.

ఈ ప్రాజెక్టు పరిధిలో అత్యధిక భాగం మెట్ట ప్రాంతంగా ఉంది. బోర్లు పైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అన్నదాతలు పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. ప్రాజెక్టు విస్తృతిని పెంచి సాగు విస్తీర్ణం పెంచేందుకు, మెట్ట ప్రాంతంలో ఎర్రకాలువ నది నీటి ద్వారా చెరువులు నింపేందుకు అవకాశాలు ఉన్నాయి.

పోలవరం మండలం ఎల్.ఎన్.డి పేట వద్ద కొవ్వాడ ప్రాజెక్టు ఉంది. దీని నిల్వ సామర్థ్యం 90.5 అడుగులు. దీని గేట్లకు గ్రీజు పూయడానికి కూడా నిధులు లేవు. ప్రాజెక్టు వద్ద కాపలా కాసే వాచ్‌మెన్‌లకు కూడా మూడు సంవత్స-రాలుగా జీతాలు లేవు. గేట్లు ఎత్తే మోటార్లు పాడై-పోయాయి. ప్రాజెక్ట్ నిర్వహణకు రూ.30 లక్షలు ప్రతి-పాదనలు ఉన్నా, నిధుల కేటాయింపు లేదు. భారీ వర్షాలకు వరద వచ్చి చేరడంతో నిర్వహణ లోపాలతో ప్రజలు, రైతులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. గండ్లు పడితే వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతాయి.

చింతలపూడి మండలం పరిధిలో నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మాణం చేశారు. నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలు కాగా 1.7 టీఎంసీలు రాగానే గేట్లు ఎత్తి-వేస్తున్నారు. ప్రాజెక్టు మెట్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. తమ్మిలేరుకు వరద పెరిగితే ఏలూరు నగరంతో పాటు వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతాయి. నిర్వహణ పనుల కోసం రూ.15 కోట్లు ప్రతిపాదన చేయగా, నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కానీ విడుదల చేయలేదు. బుట్టాయిగూడెం మండలం చింతలగూడెం వద్ద రూ.70 కోట్లతో పోగొండ రిజర్వాయర్ నిర్మాణం చేశారు. దీని నిర్వహణకు నిధులు లేవు. కాలువలు పూర్తిగా తవ్వలేదు. కోట్లు ఖర్చు పెట్టినా కాలువల తవ్వకం జరగకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదు.

> నిధుల కొరత, నిర్లక్ష్యం ఫలితంగా సాగునీటి జలాశయాలు నిర్వహణ లోపాలతో ఉన్నాయి. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం సంగతి అలా ఉంచితే, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణయినా సక్రమంగా లేదు. గిరిజన ప్రాంతాల్లో, కొండ ప్రాంతాల్లోని జలాశయాలను పర్యాటక ప్రాంతాలుగా కూడా అభివృద్ధిచేయవచ్చు. యువతకు ఉపాధి, ప్రభుత్వాలకు ఆదాయ మార్గాలుగా కూడా ఈ జలాశయాలను ఉపయోగించుకోవచ్చు.



ఈ రకంగా ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న సాగునీటి జలాశయాలు నిధుల కొరత, పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా నిర్వహణ లోపాలతో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో పెద్దపీట వేశామని పాలకులు గొప్పగా చెబుతుంటారు. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ ఉంది. కొత్తగా ప్రాజెక్టుల నిర్మాణం సంగతి అలా ఉంచితే, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణయినా సక్రమంగా లేదు. గిరిజన ప్రాంతాల్లో, కొండ ప్రాంతాల్లో ఈ జలాశయాలు ఉండటం వల్ల వీటిని పర్యాటక ప్రాంతాలుగా కూడా అభివృద్ధి చేయవచ్చు. సాగునీరు, తాగునీరు అవసరాలకే కాదు యువతకు ఉపాధి, ప్రభుత్వాలకు ఆదాయ మార్గాలుగా కూడా ఈ జలాశయాలను ఉపయోగించుకోవచ్చు. కేరళ రాష్ట్రం తరహాలో ఈ జలాశయాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయాలి. ప్రాజెక్టు నిర్వహణ లోపాలను సరిచేయాలి. నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయిం-చాలి. పెద్దవాగు ప్రాజెక్టు నేర్పిన అనుభవంతో మైనర్, మీడియం సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

■ కె. శ్రీనివాస్
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం




విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని వన్‌టౌన్‌లో ప్లకార్డుతో ఎన్‌సీసీ విద్యార్థి ప్రదర్శన

● పూర్వ ప్రకాశం



ఐదేళ్లుగా విద్యుత్‌కాంతులు లేక వెలవెలబోయిన ప్రకాశం బ్యారేజీ ఎట్టకేలకు మళ్లీ కళకళలాడింది. పర్యాటకాభివృద్ధిలో భాగంగా గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రకాశం బ్యారేజీకి విద్యుద్దీపాలను అలంకరించింది. నగరానికి వచ్చిన పర్యాటకులు దుర్గమ్మ దర్శనం, కృష్ణమ్మ పరవళ్లతో పాటు ప్రకాశం బ్యారేజీ రంగుల సోయగాన్ని చూసి ముచ్చటపడేవారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్యారేజీని అందవిహీనంగా మార్చింది. లైట్లను తొలగించింది. ఐదేళ్ల పాటు చీకట్లో మగ్గిపోయిన ప్రకాశం బ్యారేజీకి తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ వెలుగులు కల్పించింది. దీంతో రెండు రోజులుగా బ్యారేజీ ఇలా ధగధగలాడుతోంది.

మేటల మ్యాపింగ్



ఇసుక మేటల గుర్తింపునకు రంగంసిద్ధం

- జలవనరుల శాఖకు భూగర్భ గనుల శాఖ లేఖ
- తగ్గుముఖం పడుతున్న స్టాక్ పాయింట్లలో ఇసుక
- అందుబాటులో ఉన్న ఇసుక 88 వేల మెట్రిక్ టన్నులే

ఇసుక ఖాళీ..

● కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి ఎన్టీఆర్ జిల్లాలోని ఎనిమిది స్టాక్ పాయింట్లలో 3 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేది. ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన తర్వాత ఈ పాయింట్లలో ప్రస్తుతం 88 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. అంటే 2 లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఖాళీ అయ్యింది.

తవ్వకాలకు అవకాశాలేంటి?

● జగ్గయ్యపేట నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు ఎక్కడెక్కడ ఇసుక మేటలున్నాయి? ప్రకాశం బ్యారేజీ దిగువ నుంచి హంసలదీవి మధ్యలో ఇసుక మేటలు ఎక్కడున్నాయి? ఇవి నదిలో ఏ పరిస్థితుల్లో ఉన్నాయి? అనే వివరాలు సేకరించడానికి జలవనరుల శాఖ ఒక సర్వే చేయబోతోంది. ఇసుక మేటలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి తవ్వకాలకు భూగర్భ గనుల శాఖ అనుమతులిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కృష్ణానదిలో వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా తవ్వకాలు చేసింది. జేపీ కంపెనీ కృష్ణానదికి ఎగువ, దిగువన లెక్కలేనంత ఇసుకను తవ్వేసింది. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన తర్వాత స్టాక్ పాయింట్లలో ఇసుక తగ్గుముఖం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని భవన నిర్మాణదారులు ఈ స్టాక్ పాయింట్లలోని ఇసుకను తీసుకెళ్తున్నారు.

కారుచౌకగా కొట్టేసి..

నదిలో ఇసుక మేటలు (సిల్టింగ్ పాయింట్లు) పేరుకుపోయే ప్రదేశాలను గుర్తించడానికి బ్యాథమెటిక్ సర్వే (ఇసుక ఎంత ఉందో గుర్తించే ప్రక్రియ) నిర్వహించారు. వాస్తవానికి సిల్టు తవ్వకాల ద్వారా ఇసుక అత్యంత సారవంతంగా ఉంటుంది. దీనికి మంచి గిరాకీ ఉంటుంది. ఆ ఇసుకను కొనుగోలు చేయడానికి బిల్డర్లు పోటీపడతారు. అటువంటి ఇసుకను గత ప్రభుత్వం తమ వారికి కారుచౌకగా కట్టబెట్టింది.

● నది స్వరూపంపై అంచనా

ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల నుంచి ఎలాంటి నీటి విడుదల లేదు. ఎగువ తెలంగాణలో కురిసిన వర్షాలతో వాంగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఈ నీరంతా కృష్ణానదిలోకి వస్తోంది. ఎగువ నుంచి నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నది భౌగోళిక స్వరూపంలో మార్పులు వస్తాయి. ఒకచోట ఉన్న ఇసుక మేటలు కొట్టుకుపోయే అవకాశం ఉంటుంది. కొత్తగా మరోచోట ఇసుక మేటలు ఏర్పడతాయి. ఈ మేటలను నీటి ప్రవాహం తగ్గినప్పుడు మాత్రమే గుర్తించే వీలుంటుంది. గత ప్రభుత్వం ఇసుక తవ్వకాలను జేపీ సంస్థకు ఇవ్వడమే కాకుండా బ్యారేజీ వద్ద నుంచి వెంకటాయపాలెం వరకు డ్రెడ్జింగ్ ద్వారా బయటకు తీసిన ఇసుక ఏమైపోయిందో తెలియలేదు.

● కొత్త ఇసుక మేటలు గుర్తింపు

ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నెల రోజుల వరకు సరిపోతుందని భూగర్భ గనుల శాఖ అధికారులు అంచనా వేశారు. ఆ తర్వాత ఇసుక కొరత లేకుండా చేయాలంటే నదిలో తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కృష్ణానదిలో ఇసుక మేటలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని జలవనరుల శాఖ అధికారులకు భూగర్భ గనులశాఖ అధికారులు లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నదిలో జరిగే తవ్వకాలకు జలవనరుల శాఖ, భూగర్భ గనుల శాఖల ఎన్‌వోసీ కచ్చితంగా ఉండాలి. నదిపై పూర్తి పర్యవేక్షణ జలవనరుల శాఖకు ఉంటుంది. జలవనరుల శాఖ ఎస్ఈ, నది పరిరక్షణ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఇసుక మేటలను గుర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ప్రకాశం బ్యారేజీకి వరద వస్తోంది. వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టిన తర్వాత మేటలను అధికారులు మ్యాపింగ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు మేటల గుర్తింపునకు ఎలాంటి సమాచారమూ అందలేదని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

విరమణ పేరిట.. సమర్పణ

విలాసవంతమైన ఫంక్షన్ హాల్.. ఖరీదైన భోజనాలు.. బహుమతిగా వజ్రాలు పొదిగిన బంగారు గండపెండేరం.. ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పదవీ విరమణా.. మజాకా.. ముఖేష్ అంబానీలా అన్నీ రాయల్‌గా ఉండాలనుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ భారాన్ని మాత్రం ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కాంట్రాక్టర్లపై పడేశారు. ఈఎన్‌సీ పదవీ విరమణ వేడుక పేరుచెప్పి ఒక్కొక్కరికీ టార్గెట్లు విధించి మరీ బహిరంగంగా రూ.లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు.



ఈఎన్‌సీ పదవీ విరమణ వేడుకకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ధనకార్యాలు

- ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలపై వసూళ్ల ఒత్తిడి
- స్పోర్ట్స్ రిక్రియేషన్ నిధులు రూ.25 లక్షలపై కన్ను
- క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లకు రూ.3 లక్షల చొప్పున టార్గెట్లు
- కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు తెగబడుతున్న ఇంజనీర్లు
- ఈఎన్‌సీకి వజ్రాలు పొదిగిన బంగారు గండపెండేరం బహుమతిగా ఇవ్వాలని నిర్ణయం
- మరిన్ని అమూల్యమైన కానుకల కోసమే ఈ వసూళ్లు
- ప్లేటు భోజనానికి రూ.2 వేలు ఖర్చు చేయాలని యోచన
- విలాసవంతమైన ఫంక్షన్ హాల్లో వేడుకకు భారీ ఏర్పాట్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పదవీ విరమణ పేరుచెప్పి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు బలవంతంగా టార్గెట్లు విధించి, వసూళ్లకు తెగబడటం వివాదంగా మారింది. గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఈఎన్‌సీగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చెందుతున్న నేపథ్యంలో భారీగా రిటైర్‌మెంట్ వేడుక నిర్వహించాలని ఈఎన్‌సీ కార్యాలయం నిర్ణయించింది. మహానాడు జంక్షన్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చు కోసం డబ్బులివ్వాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులను ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు బలవంత పెడుతున్నారు. వారం రోజులుగా ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు ఇదే పనిలో ఉన్నారు. 'వెయ్యో, రెండు వేలో ఇస్తాం.. కానీ, లక్షల రూపాయలు తామెక్కడ ఇస్తాం..' అంటూ ఉద్యోగులు చాలా వరకు మొండికేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘంపై కూడా ఇదే రకమైన ఒత్తిడి తెచ్చారు. సదరు సంఘం ససేమిరా.. అనటంతో బలవంతం చేస్తున్నారు. గతంలో రిక్రియేషన్ స్పోర్ట్స్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు ఈఎన్‌సీ కార్యాలయం రూ.25 లక్షలు కేటాయించింది. ఈ మొత్తంలో సింహభాగాన్ని ఈఎన్‌సీ రిటైర్‌మెంట్ వేడుకకు ఖర్చు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు బలవంతం చేయటంతో కొంతమంది ఉద్యోగులు తప్పక డబ్బు సమర్పించుకుంటున్నారు. మరికొందరు ఎదురు తిరుగుతున్నారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిఘటన వస్తుండటంతో ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు రూటు మార్చారు.

క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్‌కు టార్గెట్లు

క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లపై టార్గెట్లు పెట్టారు. ఒక్కో క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ రూ.3 లక్షలకు తక్కువ కాకుండా వసూలు చేసి పంపాలని నిర్దేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఈ టార్గెట్లు విధించారు. దీంతో కాంట్రాక్టర్లందరి దగ్గర నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసి ఈఎన్‌సీ కార్యాలయ అధికారులకు పంపుతు న్నారు. ఇంత భారీ ఎత్తున ఎందుకు వసూలు చేస్తున్నారని ఆరా తీయగా, ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పదవీ విరమణ చెందుతున్న ఈఎన్‌సీకి వజ్రాలు పొదిగిన బంగారు గండపెండేరాన్ని బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారని, దీనికే ఎక్కువ ఖర్చు అవుతుందని, అందుకే ఇలా టార్గెట్లు విధించారని తెలిసింది. అలాగే, ఒక్కో అతిథికి అందించే భోజనం ఖరీదు రూ.2 వేలుగా నిర్ణయించారని సమాచారం. ఈఎన్‌సీకి సమర్పించే ఇతరత్రా కానుకలు అమూల్యమైనవిగా ఉండాలని, వీటికోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడం వల్లే ఈ టార్గెట్లు అని ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇప్పుడు చర్చ నడుస్తోంది.

'కృష్ణలీలలు' వివాదం

ఓవైపు ఈఎన్‌సీ కృష్ణారెడ్డి పదవీ విరమణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు ఆయన లీలలపై కొందరు కాంట్రాక్టర్లు ముద్రించిన 'కృష్ణలీలలు' పుస్తకాన్ని ఆహ్వానితులకు ఎలాగైనా పంపిణీ చేయాలని తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏదో రకంగా ఫంక్షన్ హాల్లోకి వచ్చి ఆ పుస్తకాలు పంచుతామని కాంట్రాక్టర్లు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వానికి అంటకాగి, ఆయన సాగించిన 'ధన'కార్యాలను సాక్ష్యాలతో సహా పుస్తకం రూపంలో వెలువరించామని పలువురు కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపిస్తున్నారు.

మౌలిక సదుపాయాలకే ప్రాధాన్యం

బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషనర్ ధ్యానచంద్ర



చిట్టినగర్, జూలై 25 : నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యమి స్తానని, ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా పనిచేస్తానని నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజయవాడతో తనకెంతో అనుబంధం ఉందన్నారు. లోగడ ఇక్కడ పనిచేశానని గుర్తుచేసుకున్నారు. ఇప్పటి వరకు వెంకన్న వద్ద పనిచేసిన తాను, ఇప్పుడు దుర్గమ్మ వద్దకు వచ్చానన్నారు. నగర పరిధిలోని 64 డివిజన్లలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని, పారిశుధ్య నిర్వహణలో జాతీయ స్థాయిలో ప్రమాణాలను మెరుగుపడేలా చూస్తానని చెప్పారు. నగరవాసులకు స్వచ్ఛమైన తాగునీరుఅందించడంతో పాటు సైడ్ డ్రెయిన్లు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతానని, నగరంలో పచ్చదనాన్ని పెంచి, కాలుష్యాన్ని నివారించి ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులను కొత్త ప్రాజెక్టులకు ఉపయోగపడేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. కాగా, కొత్త కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మిని ఆమె చాంబర్‌లో కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అవినీతి అంతస్థు

వీఎంసీ కొత్త భవన నిర్మాణంలో మాజీమంత్రి వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మీ అక్రమాలు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కొత్త భవన రెండో అంతస్థు నిర్మాణంలో మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి ఇష్టానుసారంగా దోచేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట తమ అనుయాయులకు కాంట్రాక్టులు ఇప్పించుకున్న వీరిద్దరూ పనుల్లో నాణ్యత ఏమాత్రం పాటించలేదని టీడీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు వారు గురువారం రెండో అంతస్థు నిర్మాణ పనులను వారు పరిశీలించారు.

- రెండో అంతస్థు ఇంటీరియర్‌కు రూ.2.70 కోట్ల ఖర్చు
- శ్లాబ్ కోసం రూ.80 లక్షలు కేటాయింపు
- వెలంపల్లి, భాగ్యలక్ష్మి అనుచరులే కాంట్రాక్టర్లు
- పనులు లోపభూయిష్టమంటున్న టీడీపీ నేతలు
- నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ల బృందం

మేయర్ భాగ్యలక్ష్మి రాజీనామా చేయాలని డిమాండ్

చిట్టినగర్ : 2014వ సంవత్సరంలో టీడీపీ హయాంలో వీఎంసీకి కొత్త భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు. సెల్లార్‌తో పాటు తొమ్మిది అంతస్థుల్లో భవనం ఉండేలా డిజైన్ చేశారు. తొలి విడత పనులకు ప్రభుత్వం రూ.32 కోట్లు కేటాయించారు. సెల్లార్, గ్రౌండ్, మొదటి అంతస్థును నిర్మించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రివర్స్ టెండర్ పేరిట ఈ భవన నిర్మాణానికి రూ.50 కోట్లు కేటాయిస్తున్నట్టు వైసీపీ నేతలు ప్రకటించారు. కానీ మూడున్నరేళ్లలో రూ.8 కోట్లే కేటాయించి అందినకాడికి దోచుకున్నారని టీడీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు.

రెండో అంతస్థుకు రూ.3.50 కోట్లు

వైసీపీ అధికారంలోకి వచ్చాక రెండో అంతస్థు నిర్మించారు. దీని శ్లాబ్ నిర్మాణానికి రూ.80 లక్షలు వెచ్చించారు. ఇంటీరియర్ కోసం ఏకంగా రూ.2.70 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలేశారు. వాస్తవానికి సెల్లార్, గ్రౌండ్, మొదటి అంతస్థును హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. అప్పటి వరకు పనులు చేసిన కాంట్రాక్టరును తప్పించారు. కొత్తగా టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో ఇద్దరు కాంట్రాక్టర్లే పాల్గొన్నారు. అందులో ఒకరు వెలంపల్లి శ్రీనివాసరావు అనుచరుడు కాగా, మరొకరు మేయర్ భాగ్యలక్ష్మి అనుచరుడు. ఇందులో ఇంటీరియర్ పనులను ఒకరికి, నిర్మాణ పనులను మరొకరికి కట్టబెట్టారు. ఒక అంతస్థును పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లకు వీఎంసీ చెల్లించిన మొత్తం రూ.3.50 కోట్లు. రెండో అంతస్తును చేసిన ఖర్చుకు, జరిగిన పనులకు ఎక్కడ పోలిక మాత్రం లేదు. ప్లైవుడ్ షీట్లను ఏర్పాటు చేసి రంగులు వేశారు. దీన్నే అద్భుతమైన ఇంటీరియర్‌గా చూపించారు. నాణ్యతలో చివరి గ్రేడ్ టైల్స్‌తో ఫ్లోరింగ్ చేశారు. లోపభూయిష్టంగా చేసిన పనులను కార్పొరేటర్లు మీడియాకు చూపించారు. ఈ విషయాన్ని నూతన కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



రెండో అంతస్థును పరిశీలిస్తున్న టీడీపీ, బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

మిగతా 6లో...



అనుమంచిపల్లి ఇసుక యార్డులో

ఎస్ఈబీ తనిఖీలు

అధికారుల అదుపులో ప్రైవేటు వ్యక్తి.. రెండు ట్రాక్టర్ల సీజ్

నరసాపురం - మచిలీపట్నం

కొత్త రైల్వేలైన్ సర్వేకు గ్రీన్‌సిగ్నల్

- కోటిపల్లి ప్రాజెక్టుకు రూ.300 కోట్లు
- రైల్వే బడ్జెట్‌లో తీర ప్రాంతానికి వరం

5 నుంచి పలు రైళ్ల రద్దు

12 వరకు 38 రైళ్లు దారి మళ్లింపు

6లో..


దుర్గగుడిలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

15 రోజులకు దుర్గమ్మ హుండీ కానుకలు

రూ. 2,68,18,540

వన్‌టౌన్, జూలై 25 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను గురువారం మహామండపంలో లెక్కించారు. 15 రోజులకుగాను రూ. 2,68,18,540 నగదు సమకూరింది. రోజుకు సగటున రూ.17,54,569 మేరకు కానుకలు వచ్చాయి. 380 గ్రాముల బంగారం, 5కిలోల 540గ్రాముల వెండి కానుకల రూపంలో సమకూరాయి. 281 యూఎస్‌ఏ డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 401 ఓమన్ రియాల్స్, 5 కెనడా డాలర్లు, 10 యూఏఈ దీర్హమ్‌లు, 10 సింగపూర్ డాలర్లు, 110 యూరప్ యూరోలు, 20 ఇజ్రాయిల్ షేకల్స్, ఒక మలేషియా రిగ్గింట్, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ. 54,228 వచ్చాయి. లెక్కింపును ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో లీలాకుమార్, వన్‌టౌన్ పోలీసులు ఎస్‌పీఎఫ్, దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఇగ్నోలో ఎంఏ భగవద్గీత కోర్సు

వన్‌టౌన్, జూలై 25 : ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో కొత్తగా ఎంఏ భగవద్గీత కోర్సును ప్రవేశపెట్టినట్టు రీజనల్ డైరక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధి 15 జిల్లాలకు విస్తరించి ఉందని తెలిపారు. మొత్తం 12 అధ్యయన కేంద్రాలు పనిచేస్తున్నట్టు తెలిపారు. 44 మాస్టర్స్ డిగ్రీలు, 24 డిగ్రీలు, 46 డిప్లమా, పీజీ డిప్లమా, 60 సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు మొత్తం 180 కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నామని, తాజాగా ఎంఏ భగవద్గీత కోర్సును ప్రవేశపెట్టినట్టు తెలిపారు దీంతో పాటు ఎంబీఏ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ అండ్ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ ఎంఏ అప్లయిడ్ ఉర్దు కోర్సులను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. మరోవైపు నర్సరీ పిల్లలకు బోధించే పీజీ డిప్లమా ఇన్ ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ కోర్సు కూడా ఉందన్నారు. ఎంఏ సైకాలజీ, కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీలకు డిమాండ్ ఉందని తెలిపారు. ఇదే సమయంలో 2024 జూలై సెషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరక్టర్లు డాక్టర్ కె.సుమలత, బి.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

త్వరితగతిన పూర్తి చేయాలి : జేసీ నిధి మీనా



కృష్ణలంక, జూలై 25 : సుమోటో వెరిఫికేషన్ ఆఫ్ క్యాస్ట్ ఫర్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ జారీ అంశంపై గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జేసీ నిధి మీనా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో భాగంగా వెరిఫికేషన్‌ను వీఆర్‌వోలు పూర్తిచేయాలన్నారు. విజయవాడ వెస్ట్, నార్త్ మండలాల పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన పెండింగ్ ఎక్కువగా ఉన్నాయన్నారు. పెండింగ్‌లో వున్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హత వున్న వారికి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా తహసిల్దార్లకు సిఫార్సు చేయాలని భూ పరిపాలన శాఖ ఆదేశించిందన్నారు. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పత్రాల జారీకి తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండల తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రెవెన్యూ లాగిన్‌లో పెండింగ్‌లో వున్న సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పూర్తిచేసేలా మండల తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, తహసీల్దార్లు కిషోర్, శంకరబాబు, వీఆర్‌వోలు వున్నారు.

చంద్రబాబును కలిసిన పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబును ఆంధ్రా పెన్షనర్ల పార్టీ ప్రతినిధులు సచివాలయంలో గురువారం సాయంత్రం కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలకు సంబంధించి వినతిపత్రం ముఖ్యమంత్రికి అందజేశారు. దీన్ని పరిశీలించిన చంద్రబాబు సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారన్నారు. సీఎంను కలిసిన వారిలో పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్, గుడివాడ రామస్వామి, మూర్తి, నాగభూషణం, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పరామర్శ

హనుమాన్‌జంక్షన్, జూలై 25 : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం తన వద్ద పనిచేసే భద్రతా విభాగం ఉద్యోగి సనపల శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. బాపులపాడు గ్రామంలో నివాసం ఉండే శ్రీనివాసరావు తండ్రి రామారావు రిటైర్డు పంచాయతీ ఉద్యోగి. ఆయన గురువారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. రామారావు కానుమోలు పంచాయతీ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేయడంతో గ్రామ మాజీ సర్పంచ్‌లు చింతల వెంకటశివ అప్పారావు, దన్నే దుర్గారావు తదితరులు రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. రామారావు కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

పారిస్ ఒలింపిక్స్‌పై అవగాహన సదస్సు

పెనమలూరు : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరిం గ్ కళాశాలలో త్వరలో జరగనున్న పారిస్ ఒలింపిక్ క్రీడలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 33వ ఒలింపిక్స్ పోటీల్లో మన తెలుగు రా ష్ట్రాల నుంచి 8మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈసందర్భంగా కళాశాల నుంచి కానూరు వ రకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పీడీ రఘు, కళాశాల డీన్ పాండురంగారావు, ఏవో సాయిబాబు పాల్గొన్నారు.

అవినీతి అంతస్థు

(5వ పేజీ తరువాయి)

టీడీపీ కార్పొరేటర్ల పరిశీలన

వీఎంసీ కొత్త కార్యాలయ భవనం రెండో అంతస్థు నిర్మాణంలో వైసీపీ నేతలు మేతమేశారని టీడీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. మాజీమంత్రి, అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఈ విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించారంటున్నారు. కమీషన్ల కోసం నాణ్యత లేని పనులు చేయించారని మండిపడ్డారు. ఈ భవన నిర్మాణంలో జరిగిన అవినీతిని వెలికితీయడానికి టీడీపీ కార్పొరేటర్లు గురువారం వీఎంసీ నూతన భవనం రెండో అంతస్థును పరిశీలించారు.

నిజనిర్ధారణ కమిటీ వేయాలి : బాలస్వామి, టీడీపీ ఫ్లోర్‌లీడర్

వీఎంసీ కొత్త భవన నిర్మాణానికి రూ.50 కోట్లు కేటాయిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.8 కోట్లే కేటాయించింది. ఈ మొత్తం నిధులను మేయర్, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కాజేశారు. తమ వారిని కాంట్రాక్టర్లుగా నియమించుకుని లోపభూయిష్టంగా పనులు చేయించారు. చెక్కముక్కలను పెట్టి ఇంటీరియర్ అని చెబుతున్నారు. ముక్క టైల్స్‌తో ఫ్లోరింగ్ చేశారు. రూ.కోటితో పూర్తయ్యే పనికి రూ.4 కోట్ల వరకు ఖర్చు చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ మేయర్ తక్షణమే రాజీనామా చేయాలి. దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేయించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని కూటమి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అందరి పాత్రను బయటకు తీస్తాం.

పనులన్నీ లోపభూయిష్టం : బుల్లా విజయ్‌కుమార్, కార్పొరేటర్

కోట్లాది రూపాయలతో చేపట్టిన వీఎంసీ నూతన భవనంలోని రెండు, మూడు అంతస్థుల నిర్మాణం, ఇంటీరియర్ పనులు లోపభూయిష్టంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి దీనికి బాధ్యత వహించాలి. కోట్ల రూపాయలు చేతులు మారాయి. రూ.కోటి అయ్యే పనులకు రూ.3 కోట్లు చెల్లించారంటే పనుల్లో ఎంత అవినీతి జరిగిందో తెలుస్తుంది. ఈ పనులపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. విషయాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు దృష్టికి తీసుకెళ్తాం.



దుర్గగుడిలో బదిలీల రచ్చ!

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన అంతర్గత బదిలీలపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయినవారికి, సొమ్ములు ఇచ్చినవారికి ప్రధాన పోస్టులను, మిగిలిన వారికి అప్రాధాన్య పోస్టులు అప్పగించారనే ఆరోపణలు వస్తున్నాయి. 84 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేసినట్లు చెబుతున్నా.. ఏడెనిమిది మందికే పరిమితం చేశారని చెబుతున్నారు.

- అంతర్గత బదిలీల పేరిట తూతూమంత్రంగా ఉత్తర్వులు
- మొత్తం 84 మంది బదిలీ అని ఆదేశాలు
- సీటు కదిలింది మాత్రం ఏడెనిమిది మందే..
- మిగిలిన వారికి అదే సీటు.. అదే పోస్టు..
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్)

దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి దుర్గగుడిలో అంతర్గత బదిలీలు జరుగుతాయి. కానీ, సుమారు ఆరు నెలలుగా ఎలాంటి బదిలీలు జరగలేదు. ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, రెండు రోజులుగా అంతర్గత బదిలీలు చేపట్టారు. అయితే, ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. బుధవారం వరకు వివిధ కేటగిరీలకు చెందిన సుమారు 84 మందిని అంతర్గతంగా బదిలీ చేశారు. అయితే, సూపరింటెండెంట్ స్థాయిలో ఇద్దరికి, మిగిలిన ఉద్యోగుల్లో ఐదారుగురికి తప్ప మిగిలిన వారందరినీ వారు ఉంటున్న స్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని ఏ విధంగా అంతర్గత బదిలీలు అంటారని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కొందరు ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఒకే సీట్లో ఉండిపోతున్నారని, కీలకమైనవి కావడంతో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజా బదిలీల్లోనూ పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

గతంలోనూ అంతే..

గతంలో అర్చక విభాగంలో జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు అర్చకులు కూడబలుక్కుని ముఖ్య అధికారికి బంగారు బిస్కెట్‌ను బహుమతిగా ఇచ్చినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. తాజాగా అదే తరహాలో బహుమతితో ముఖ్య అధికారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆ ఇద్దరు అర్చకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇంకా ఏఈవోలు, అర్చకులు, పలు సెక్షన్లలో బదిలీలు జరగాలి. అయితే, ఈ బదిలీలకు కూడా నిర్దేశిత మొత్తాలను నిర్దేశించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అదే సీటులో ఉంచి..

- దుర్గగుడికి చెందిన ఉద్యోగి ఒకరు దేవదాయ శాఖ కమిషనర్ వద్ద సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. సుమారు మూడేళ్లుగా ఆయన అక్కడే విధులు చేపట్టారు. ఆయనకు అంతర్గత బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చేశారు. బదిలీ జాబితాలో మాత్రం చూపారు.
- 14 మంది సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వాస్తవానికి కేవలం ఇద్దరు ఉద్యోగులకే బదిలీ జరిగింది. మిగిలిన 12 మంది గతంలో ఏ విధులు నిర్వహిస్తున్నారో అదే విధులు నిర్వహించేలా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- దుర్గగుడిలో వివిధ విభాగాల్లో పనిచేసే మరో 70 మందిని కూడా అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ, వాస్తవంగా బదిలీ జరిగింది ఐదారుగురికే. మిగిలిన వారిని గతంలో వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో అవే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు.
- దుర్గగుడిలో ఐదుగురు ఏఈవోలు వివిధ విభాగాలను పర్యవేక్షిస్తుంటారు. అంతర్గత బదిలీల్లో వీరినీ బదిలీ చేయాల్సి ఉంది. కానీ, ఏడాదిగా వీరి జోలికే వెళ్లిన దాఖలాల్లేవు. ఈసారైనా వీరిని కదుపుతారా లేదా అన్నది ప్రశ్నార్థకమే.

రూ.1.60 కోట్లతో ఉడాయించిన

వ్యాపారికి రిమాండ్

- శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు


వివరాలు తెలుపుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

గుడ్లవల్లేరు, జూలై 25 : బంగారు ఆభరణాలు చేసి ఇస్తానని, 150 కిలోల వెండి దిమ్మెలు ఇస్తామని నమ్మబూపి రూ1.60కోట్లతో ఉడాయించిన స్వర్ణ వ్యాపారిని మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్రం లోని శంషాబాద్ ఎయిర్ పోర్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు సాయంత్రం గుడివాడ కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి రిమాండ్ విధించిన ఉదంతమిది. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కూరాడ, పెసరమిల్లి గ్రామాలకు చెందిన శాయిన వెంకటేశ్వరరావు(నాని), అతని సోదరుడు కమ్మిలి రాధాకృష్ణల కుటుంబాలకు మచిలీపట్నంకు చెందిన బంగారు ఆభరణాల వ్యాపారి ఉదత్తు మధుసూధనరావు అతడి కొడుకు, సోదరుడులు నమ్మకంగా గత కొంతకాలంగా బంగారు వస్తువులు చేసి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాలు, 70, 80 కేజీల వెండి దిమ్మెలు ఇస్తానని నమ్మబూపి బాధితుల వద్ద నుంచి పలు దఫాలుగా రూ 1.60 కోట్ల ను తీసుకున్నారు. నెలలు గడిచినా వస్తువులు చేసి ఇవ్వకపోగా.. ఫోన్ లోనూ స్పందించడంలేదు. ఉదత్తు మధుసూధనరావుచే మోసపోయామని గ్రహించిన బాధితులు గత ఏడాది ఏప్రిల్ 22న గుడ్లవల్లేరు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ ప్రారంభించారు. నిందితుడు సింగపూర్‌లో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు అంతర్జాతీయ విమానాశ్రాయాల ఏవియేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్రం శంషాబాద్ విమానాస్రయం వద్ద మధుసూధనరావును పోలీసులు అదుపులోకి తీసుకొని అదేరోజు సాయంత్రం గుడివాడ కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.


వివరాలు తెలుపుతున్న అధికారులు


ఇసుక డంప్ వద్ద ఆధారాలు పరిశీలిస్తున్న సీఐ

అనుమంచిపల్లి ఇసుక యార్డులో

ఎస్ఈబీ తనిఖీలు

- అధికారుల అదుపులో ప్రైవేటు వ్యక్తి..

రెండు ట్రాక్టర్ల సీజ్


ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్‌లు

జగ్గయ్యపేట రూరల్, జూలై 25 : అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ఒకే వే బిల్లుపై రెండు ట్రాక్టర్‌లలో 10 టన్నుల ఇసుక తరలిస్తున్న వాహనాలతో పాటు డంప్ వద్ద ప్రైవేట్ వ్యక్తిని గురువారం ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్, సీఐ మణికంఠరెడ్డి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. ప్రభుత్వం ఉచిత ఇసుకకు సంబంధించి ఆయా శాఖల అధికారులను రెండు షిఫ్టులుగా విధులు నిర్వహించేందుకు నియమించింది. డంప్‌పై కన్నేసిన అక్రమార్కుల వత్తిడితో సింహభాగం అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. సైదాఅనే ప్రైవేట్ వ్యక్తిని అక్కడ ఉంచినట్టు అధికారులు తెలిపారు. ఇసుక కోసం వచ్చే వాహనదారులు ప్రభుత్వ ఖజానాకు సొమ్ము చెల్లించి రశీదు చూపిన తరువాత వే బిల్లు అందించాల్సి ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించి రశీదులు ఇస్తున్నాడని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. దీనిపై విచారిస్తున్నామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంటుందన్నారు.

డంప్‌లో సిబ్బందిపై అక్రమార్కుల పెత్తనం!

వైసీపీ ప్రభుత్వ హయాంలో అంటకాగిన వ్యక్తులు ఇసుక డంప్‌పైనా పెత్తనం చెలాయిస్తున్నారనే వార్తలు స్థానికంగా హల్‌చల్ చేస్తున్నాయి. ఉద్యోగులను సైతం బెదిరించి ప్రైవేట్ వ్యక్తిని ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేయడాన్ని ఎస్ఈబీ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకోవటం, నందిగామకు చెందిన వ్యక్తి ఎస్కవేటర్‌ను వినియోగిస్తుండటం వాదనలకు బలం చేకూరుతోంది. జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించకపోవటంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక యార్డు వద్ద అవకతవకలపై సమాచారంతో సీఐ జానకిరామ్ విచారణ చేశారు. ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు విధులకు హాజరుపై విచారణ చేశారు. స్థానిక వీఆర్వో పుల్లారావు ద్వారా సమాచారం సేకరించారు. విచారణ అనంతరం పూర్తి సమాచారం అందిస్తామని సీఐ తెలిపారు.

నరసాపురం మచిలీపట్నం కొత్త రైల్వేలైన్ సర్వేకు గ్రీన్‌సిగ్నల్

- కోటిపల్లి ప్రాజెక్టుకు రూ.300 కోట్లు
- రైల్వే బడ్జెట్‌లో తీర ప్రాంతానికి వరం



నరసాపురం/మచిలీపట్నం, జూలై 25 : సముద్ర తీరం వెంబడి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బ్రిటీష్ హయాం నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన నరసాపురం-మచిలీపట్నం మధ్య లైన్‌కు సర్వే చేయాలని నిర్ణయించింది. మంగళవారం సమర్పించిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదనలు చేసినట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పనులు పూర్తయితే నరసాపురం పెద్ద జంక్షన్‌గా మారనుంది. చివరి స్టేషన్ అన్న పేరు నుంచి తప్పుకోనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి భీమవరం మీదుగా నిడదవోలు, గుంటూరు, విజయవాడ, నాగర్‌సోల్, బెంగళూరు, హుబ్లీ, ధర్మవరం, లింగంపల్లి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నరసాపురం జంక్షన్ అవుతుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లావాసులు స్వాగతిస్తున్నారు. మచిలీపట్నం-నరసాపురం మార్గాన్ని రైల్వే రూట్‌లో కలపాలని బ్రిటిష్ హయాంలోనే ప్రతిపాదించారు. దీనిని పట్టాలెక్కించేందుకు మోదీ సర్కార్ ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించింది. 69 కిలోమీటర్ల మేర కొత్త లైన్‌కు పలుచోట్ల ఉప్పుటేర్లపై వంతెనలు వేయాల్సి ఉంది. ఈ కారణంగా భారీ వ్యయం అవుతుందని అప్పట్లో ఈ ప్రతిపాదనను పెండింగ్ పెట్టారు. ప్రస్తుతం రైలులో మచిలీపట్నం వెళ్లాలంటే గుడివాడ వెళ్లి అక్కడి నుంచి రైలు మారాలి. అదే నరసాపురం నుంచి మచిలీపట్నం పూర్తయితే మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా వెళ్లవచ్చు. దీనివల్ల కోస్తా తీరం వెంబడి రైలు మార్గం ఏర్పడుతుంది. ఇప్పటికే కోటిపల్లి రైల్వేలైన్ వల్ల కాకినాడ నుంచి నరసాపురం వరకు రైలు మార్గం ఏర్పడింది. ఇటు మచిలీపట్నం పూర్తిచేస్తే సముద్ర తీరం వెంబడి రైలు కూత వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ బడ్జెట్‌లో సర్వే పనులు చేపడుతున్నట్టు రైల్వే మంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే నరసాపురం స్టేషన్ పెద్ద జంక్షన్‌గా మారడంతోపాటు చివరి స్టేషన్ అన్న మార్క్ నుంచి తొలగనుంది.

కోటిపల్లికి రూ.300 కోట్లు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో కోటిపల్లి రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌ల్లో రూ.1,150 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రూ.300 కోట్లతో రూ.1,450 కోట్లకు చేరింది. ఈ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రాష్ట్రం ఇచ్చిన వాటా మొత్తం రూ.50 కోట్లు మాత్రమే అది కూడా 2019కి ముందు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఈ ప్రాజెక్టుకు కేటాయించలేదు. ఈ కారణంగా పనులు ముందుకు సాగలేదు. 51 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్ వల్ల కోనసీమ జిల్లాలోని అమలాపురం, రాజోలుకు రైలు మార్గం ఏర్పడనుంది. దీంతో పాటు విశాఖ, రాజమండ్రి మధ్య మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో మూడు భారీ వంతెనలు చివరి దశకు చేరుకున్నాయి. భూసేకరణ కూడా 75 శాతం పూర్తయింది. నిధులు పూర్తి స్థాయిలో ఉంటే ట్రాక్ పనులు వేగవంతం కానున్నాయి.

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో

5 నుంచి భారీగా రైళ్ల రద్దు

- జాబితాలో తిరుమల, శాతవాహన, పినాకిని ఎక్స్‌ప్రెస్‌లు
- మూడో లైన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో నిర్ణయం
- 12 వరకు 38 రైళ్లు దారి మళ్లింపు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-గూడూరు మూడో లైన్ పనుల్లో భాగంగా విజయవాడ-న్యూ వెస్ట్ బ్లాక్ హట్ మధ్య ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల రీత్యా ఆగస్టు 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో భారీగా రైళ్లను రద్దు చేశారు. డివిజన్ మీదుగా వెళ్లే 37 రైళ్లను రద్దు చేయడంతో పాటు, మరో 38 రైళ్లను దారి మళ్లించారు. రద్దు చేసిన రైళ్లలో విజయవాడ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే శాతవాహన (12713-14) ఎక్స్‌ప్రెస్, హుబ్బళ్లి - విజయవాడ మధ్య నడిచే (17329-30) ఎక్స్‌ప్రెస్, కడప-విశాఖపట్నం (17487-88) తిరుమల ఎక్స్‌ప్రెస్, విజయవాడ-చెన్నై (12711) పినాకిని, చెన్నై సెంట్రల్-విజయవాడ (12077-78) జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లు ఉన్నాయి.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు

విశాఖపట్నం-సికింద్రాబాద్ (12739), సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), విశాఖపట్నం-గాంధీనగర్ (20803), గాంధీనగర్-విశాఖపట్నం (20804), పూరి-ఓఖా (20819), ఓఖా-పూరి (20820), నిజాముద్దీన్- విశాఖపట్నం(12804), ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (11019), భువనేశ్వర్ -ఛత్రపతి శివాజీ టెర్మినల్ (11020), యశ్వంత్‌పూర్-టాటా (18112), టాటా-యశ్వంత్‌పూర్ (18111), హైదరాబాద్-షాలిమార్ (18046), షిర్డీసాయినగర్-కాకినాడ పోర్టు (17205), కాకినాడ పోర్ట్-షిర్డీసాయినగర్ (17206), విశాఖపట్నం-షిర్డీసాయినగర్ (18503), షిర్డీసాయినగర్-విశాఖపట్నం (18504), విశాఖపట్నం-న్యూఢిల్లీ (20805), న్యూఢిల్లీ-విశాఖపట్నం(20806), విశాఖపట్నం-హైదరాబాద్ (12727), హైదరాబాద్-విశాఖపట్నం (12728), షాలిమార్-హైదరాబాద్ (18045), విశాఖపట్నం-నిజామాబాద్ (12803), మచిలీపట్నం-షిర్డీసాయినగర్(17208), షిర్డీ సాయినగర్-మచిలీపట్నం (17207), నర్సాపూర్-నాగర్‌సోల్ (12787), నాగర్‌సోల్-నర్సాపూర్ (12788), మచిలీపట్నం-బీదర్ (12749), బీదర్-మచిలీపట్నం (12750), విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ (18519), లోకమాన్యతిలక్ టెర్మినల్-విశాఖపట్నం (18520), హైదరాబాద్-తాంబరం (12760).


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భూ సమస్యలు పరిష్కరించండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భూమి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. విమానాశ్రయ విస్తరణకు రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపు, సీఆర్‌డీఏలో ప్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. భూములు ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం, వార్షిక కౌలు, సీఆర్‌డీఏలో ప్లాట్ల కేటాయింపు కోసం సీఆర్‌డీఏకు లేఖలు రాయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. విమానాశ్రయ సరిహద్దు వెంబడి జరుగుతున్న నిర్మాణాలతో భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని, విమానాశ్రయం పక్కనే ఉన్న భూముల్లో వివిధ పంటలు సాగు చేస్తుండటంతో పక్షుల సంచారం అధికంగా ఉండి విమాన రాకపోకలకు అంతరాయంగా ఉందని, ఈ అంశంపైనా అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలిశర్మ డీఆర్వో కె.చంద్రశేఖరరావు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయ అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు

- పార్లమెంట్ సమావేశాల్లో బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి పనులు 2023 మార్చి నాటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఎందుకు ఆలస్యం జరిగిందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శుక్రవారం పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. 2020లో విమానాశ్రయం పనులకు ఆమోదం తెలిపారని, పనులకు సంబంధించిన వ్యయాన్ని పెంచితే వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. విమానాశ్రయ అభివృద్ధికోసం రూ.347కోట్లను కేటాయించినా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. పనుల జాప్యానికి కారణాలు, ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు సమాధానమిస్తూ గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి చేసేందుకు రూ.611.80 కోట్లతో అంచనాలు రూపొందించి 2020జూన్‌లో ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. జూన్ 2024నాటికి ప్రాజెక్టు పనులు 48.5శాతం పూర్తయ్యాయన్నారు. ఇప్పటివరకు రూ.279.93 కోట్లతో పనులు చేసినట్టు తెలిపారు. పర్యావరణ అనుమతులు రావడంలో ఆలస్యం, కొవిడ్-19, తీరప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. 2025 జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి తెలిపారు.

ఇద్దరు వీఆర్వోలపై వేటు

మైలవరం : మైలవరం మండలం చంద్రాల వీఆర్వో ఇమ్మానుయేలు, గణపవరం వీఆర్వో షేక్ ఈసూబ్‌లను సెస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తహసీల్దార్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మట్టి అక్రమ నిల్వలకు సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ, కారు ఢీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

ఇబ్రహీంపట్నం, జూలై 25 : గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీని వేగంగా వస్తున్న స్కార్పియో కారు ఢీ కొట్టిన ఘటనలో కారులో ఉన్న ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ప్రమాదం 30 నంబరు జాతీయ రహదారిపై కొండపల్లి ఐడీఏ హెచ్‌పీసీఎస్ గ్యాస్ ఫిల్లింగ్ సంస్థ వద్ద గురువారం జరిగింది. విజయవాడ నగరానికి చెందిన చెన్నుపాటి సాంబశివరావు (58) గుమస్తాతో కలిసి స్కార్పియో కారులో మైలవరం వైపు వెళుతుండగా అదే సమయంలో కంపెనీ వద్ద గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ రోడ్డు దాటుతోంది. వేగంగా వస్తున్న కారు లారీ వెనుకభాగంలో ఢీ కొట్టింది. ప్రమాదంలో సాంబశివరావు మృతి చెందగా గుమస్తాకు గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడి అవశేషాలను సేకరిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో కృష్ణమాన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గుంటుపల్లి మామిడి తోటలో నేపాల్ వ్యక్తి కళేబరం!

ఇబ్రహీంపట్నం, జూలై 25 : గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని మామిడి తోటలో నేపాల్ దేశస్థుడి కళేబరాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేపాల్ దేశానికి చెందిన కృష్ణమాన్‌కుమార్ (46) కోయంబత్తూరు సోనాలి అల్యూమినియం ఫ్యాక్టరీలో గత పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది నేపాల్ వెళ్లి ఏప్రిల్ 24న తిరిగి స్నేహితులైన రాజ్‌కుమార్, కంచన్‌కుమార్, సంజనకుమార్‌లతో కోయంబత్తూర్ వెళుతూ మార్గమధ్యలో విజయవాడ స్టేషన్‌లో కృష్ణమాన్ కుమార్ దిగాడు. అక్కడ రైలు మిస్ కావడంతో మే 25న స్నేహితులకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. సూరాయిపాలెం గ్రామానికి చెందిన మామిడి తోట యజమాని చలపతిరావు గురువారం తోటలో పిచ్చి మొక్కలు తొలగిస్తుండగా మృత కళేబరం కనిపించింది. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పక్కనే ఫోన్ లభించడంతో మృతుడి వివరాలు సేకరించారు. నేపాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తోట యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

విఘ్నేశ్వర ఆలయంలో అన్నసంతర్పణ

సత్యనారాయణపురం: విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వాసవీ కన్యకాపరమేశ్వరి అధ్యక్షుడు తుమ్మలపెంట శ్రీనివాసులు అన్నారు. సంకటహర చతుర్థి సందర్భంగా గిరవీధిలోని శ్రీ అభయ విఘ్నేశ్వర ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి అనంతరం 600 మందికి అన్నసంతర్పణ చేశారు. అలయ అధ్యక్షుడు చొగ్గరపు వెంకట బాలకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



యువత దేశ సేవకు అంకితం కావాలి

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యువమోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ

వన్‌టౌన్, జూలై 25: కార్గిల్ విజయాన్ని నేటి యువత స్ఫూర్తిగా పొందాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని గురువారం యువమోర్చా ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని విద్యావేత్త డాక్టర్ కిటప్ప వైద్యనాథన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్‌లో ఆనాటి సైన్యం చేసిన వీరోచిత పోరాటాన్ని గుర్తు చేశారు. ఆనాడు అమరులైన సైన్యం చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళి సమర్పించేందుకు కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత వారి స్ఫూర్తితో విద్యతో పాటు సామాజిక సేవ, దేశసేవకు అంకితం కావాలన్నారు. కిటప్ప వైద్యనాథన్ మాట్లాడుతూ. శుక్రవారం నుంచి ఒలిపింక్ క్రీడలు ప్రారంభమవుతున్నాయన్నారు. మనదేశ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఒలింపిక్ క్రీడలలో భారత్‌కు అత్యధిక పతకాలు రావాలని ఆకాంక్షిస్తూ కేబీఎన్ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేయడం ముదావహమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, యువమోర్చా రాష్ట్ర నాయకులు మిట్టా వంశీ, షేక్ బాజీ, మువ్వల సుబ్బయ్య, బొడ్డు నాగలక్ష్మి, శివకుమార్ పట్నాయక్, కళాశాల అధ్యాపకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు

పాయకాపురం: పాయకాపురం ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ గురువారం జరిగింది. కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల త్యాగాలు, సాధించిన విజయాలను స్మరించుకుంటూ జవాన్లకు మద్దతుగా స్థానిక ప్రకాష్‌నగర్ నుంచి పైపుల రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానిక కృష్ణవేణి స్కూల్, అక్షరనందన స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజి, పార్టీ రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి తూములూరు కృష్ణచైతన్య పాల్గొన్నారు.



భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ, కేబీఎన్ విద్యార్థుల ర్యాలీ, బీజేపీ ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ నుంచి పైపుల రోడ్డు వరకు ర్యాలీ



మారిస్ స్టెల్లా విద్యార్థినుల ఒలింపిక్ రన్

పటమట, జూలై 25 : పారిస్‌లో ప్రారంభంకానున్న ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక మారిస్ స్టెల్లా కళాశాలలో గురువారం విద్యార్థినులు ఒలింపిక్ రన్ నిర్వహించారు.ముఖ్య అతిథులుగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్రరావు, ఈసీ మెంబర్ ఆకుల హైమావతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ మాట్లాడుతూ భారతదేశ క్రీడాకారులు దేశం గర్వించేలా పతకాలను సాధించి తీరతారని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వప్న, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ కుమార్, ఫిజికల్ డైరక్టర్ రాజా, క్రీడాకారిణి సునీత, మౌనికలు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మీవంతు చర్యలు ఏవి ?

బీసెంట్‌రోడ్డు షాపింగ్ మాల్ యజమానులను ప్రశ్నించిన డీసీపీ చక్రవర్తి

గుణదల, జూలై 25: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగర వాసులంతా కలిసికట్టుగా ఉంటేనే పరిష్కార మార్గాలు దొరుకుతాయని, మీ వంతుగా తీసుకుంటున్న చర్యలు ఏమీ కనబడటం లేదని షామింగ్‌మాల్ యజమానులను ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ప్రశ్నించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బీసెంట్ రోడ్‌కు ఇరువైపులా ఉన్న షాపింగ్ మాల్ యజమానులతో ట్రాఫిక్ డీసీపీ గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య పరిష్కార విషయమై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

బందర్ రోడ్డు, బీసెంట్ రోడ్డుల్లో ఉన్న కొన్ని షాపింగ్ మాల్స్‌కు పార్కింగ్ లేకపోవడం వల్ల బందర్‌రోడ్డు, బీసెంట్‌రోడ్డుల్లో వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారని చెప్పారు. తద్వారా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అంబులెన్స్ రావడానికి కూడా కొన్ని ప్రదేశాల్లో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. ఈ తరహా ఇబ్బందులను తొలగించడానికి షాపింగ్‌మాల్ యజమానులు ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని వాహన దారులు వారి వారి వాహనాలను దగ్గర్లోని పార్కింగ్ ప్రదేశాల్లో పార్క్ చేసి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా చాలా వరకు ట్రాఫిక్ సమస్య తగ్గేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.



షాపింగ్‌మాల్ యజమానులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

విద్యార్థులకు రిఫరెన్స్ పుస్తకాలు అందజేత

గవర్నర్‌పేట, జూలై 25: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రిఫరెన్స్ కోసం జిల్లా విద్యాశాఖాధికారి ఠాగూర్ గ్రంథాలయానికి పాఠ్య పుస్తకాలు అందజేశారు. విద్యార్థుల కోరిక మేరకు గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి పోటీ పరీక్షలకు అవసరమైన 6 నుంచి 10వ తరగతి టెస్ట్ బుక్స్ కావాలని జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో గురువారం రిఫరెన్స్ పుస్తకాలు ఠాగూర్ గ్రంథాలయానికి అందజేసినట్లు రమాదేవి తెలిపారు. అడిగిన వెంటనే పుస్తకాలు అందజేసిన జిల్లా విద్యాశాఖాధికారికి ధన్యవాదాలు తెలిపారు.



కొత్త పుస్తకాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: బొండా ఉమా



పాయకాపురం, జూలై 25 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 60వ డివిజన్ వాంబేకాలనీలో గురువారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపిస్తానని పేర్కొన్నారు.



దుర్గమ్మకు దర్శిపేటవాసుల ఆషాఢ సారె



దుర్గమ్మకు ఆషాఢ సారె తీసుకెళుతున్న దర్శిపేట వాసులు

పటమట, జూలై 25 : 14వ డివిజన్ దర్శిపేట రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానంలో మహిళా భక్తులు గురువారం కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ సారె అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, దేవస్థానం గౌరవాధ్యక్షుడు బొప్పన భవకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళా భక్తులు మేళ,తాళాలతో పటమట పురవీధులు, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానానికి పసుపు కుంకుమ, చీరలు, గాజులు, మిఠాయిలు తీసుకుని వెళ్లి అమ్మవారికి సారెను సమర్పించారు. రంగలక్ష్మి, ఆకుల వీరయ్య, తోట అల్లూరయ్య, చింతకృష్ణ సుజాత, ఆలయ పూజారి మల్లిఖార్జునశర్మ, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, ఆవుల నరసయ్య పాల్గొన్నారు.



యువకుడు ఆత్మహత్య

పాయకాపురం, జూలై 25: నున్న గ్రామం విశ్వబ్రాహ్మణ కాలనీలో ఉంటున్న కొలుసు నందకుమార్(30)బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం నందకుమార్ భార్య ఇంటి వద్దనే మిషన్ కుడుతుంది. గత కొంత కాలంగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం కూడా దంపతులు మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన నందకుమార్ ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన జగన్ సర్కార్

● 10వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పటమట, జూలై 25 : వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని, తత్ఫలితంగా ప్రజలు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ఓట్లు వేశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో గద్దె గురువారం పర్యటించి రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నగరంలో డ్రెయినేజీల వ్యవస్థను మెరుగుపర్చడానికి కేంద్ర నిధులు తీసుకువస్తామని, ఈ విషయమై స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి చర్చించానని గద్దె వివరించారు. డ్రెయినేజీ కనెక్షన్లు తీసుకోని వారు వెంటనే తీసుకోవాలని, అందరూ కనెక్షన్ తీసుకున్న తర్వాతే రోడ్లు నిర్మాణం చేస్తామన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ఉన్నారని గద్దె తెలిపారు. కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, పొన్నం శ్రీనివాస్, ముమ్మనేని ప్రసాద్, ఈఈ సామ్రాజ్యం, కోనేరు రాజేష్‌లు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



గవర్నర్‌పేట, జూలై 25: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబ శివరావు నేతృత్వంలో ఆ పార్టీ నేతలు గురువారం విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మొక్కను జ్ఞాపికగా అందజేశారు.

అజిత్‌సింగ్‌నగర్ : ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును టీఎన్‌టీయూసీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో కలసిన నేతలు శాలువా కప్పి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఆర్ఆర్‌ను కలిసిన వారిలో సాయిచరణ్, బుద్ధరాజు శివాజీ, దుర్గాప్రసాద్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.




రఘురామ కృష్ణంరాజును సన్మానిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

297 సైలెన్సర్లు ధ్వంసం

గుణదల, జూలై 25: మోటారు వాహన చట్టానికి విరుద్ధంగా ధ్వని కాలుష్యం చేసే వాహనాలకు సంబంధించిన 297 సైలెన్సర్లను జిల్లా పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మే 18 నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ధ్వని కాలుష్యం చేస్తున్న ద్విచక్రవాహనాలకు ఉన్న సైలెన్సర్లను గుర్తించామని ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి తెలిపారు. ఇలా గుర్తించిన వాహనాలకు ధ్వని కాలుష్య రహిత సైలెన్సర్లను వారి చేత సదరు వాహనాలకు అమర్చుకునేలా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. శబ్దకాలుష్యం చేసే సైలెన్సర్లతో ప్రయాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.





త్వరలోనే అన్న క్యాంటీన్లు ప్రారంభం

పాయకాపురం, జూలై 25 : పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను త్వరలోనే ప్రారంభిస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ టీడీపీపై కక్ష సాధింపులో భాగంగా అన్న క్యాంటీ న్లను ఎత్తివేశాడని దుయ్యబట్టారు. త్వరలోనే సీఎం చంద్ర బాబు అన్నక్యాంటీన్లు పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.

వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలి : డీఎంహెచ్‌వో

విస్సన్నపేట, జూలై 25: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, దానిలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారిణి సుహాసిని సూచించారు. కొండపర్వలో గురువారం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను ఆమె సందర్శించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, బాబువలి, డాక్టర్ సమీర తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

మైలవరం, జూలై 25: మైలవరంలోని డాక్టర్ హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. ఈమేరకు పోస్టర్‌ను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గురువారం ఆవిష్కరించారు.


పశ్చిమ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

భవానీపురం, జూలై 25 : పశ్చిమ డివిజనల్లోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు వేస్తామని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్ అన్నారు. జోనల్ కమిషనర్ బి.రమ్యకీర్తనతో పాటు శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి 41వ డివిజన్‌లోని సభాపతి రోడ్డు, బాజీబాబా ఆశ్రమం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రోడ్లు, పారిశుధ్య, డ్రెయిన్ల నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, ఏతలు అహ్మద్, రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటేశ్వరరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి గంధం ప్రసాద్‌లు పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్ల పరిశీలన


రాణిగారితోట, జూలై 25: టీడీపీ నాయకులు 18వ డివిజన్ లోని ఆంథోని వీధి, సీతయ్య వీధిలో సైడ్ డ్రెయిన్‌లను పరిశీలించారు. డ్రెయిన్లు పొంగిపొర్లడం వల్ల స్థానికులు పడుతున్న బాధలను గుర్తించారు.

ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్పొరేటర్ సత్యనారాయణ రోడ్లు వేయించి సైడ్ కాలువలు కట్టించకుండా వదిలివేయడంతో వాటిలో నీరుచేరి పారక రోడ్లపై ప్రవహిస్తున్నాయని, మిగిలిన వాటిలో దోమలు చేరి ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ఈ సమస్యలు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. కార్పొరేటర్ ఎక్కడ ఉన్నా వెంటనే డివిజన్‌కు వచ్చి ప్రజల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. సుబ్బారావు, ఇందిర తదితరలు పాల్గొన్నారు.









పోలవరం.. మూడేళ్లలో పూర్తి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయకపోగా.. నాశనం చేసిందని.. దరిమిలా రూ.30 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపే నిమిత్తం గురువారం సాయంత్రం అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని, ఇందుకు కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. పోలవరం పూర్తిచేసే బాధ్యతను కేంద్రం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే 960 మెగావాట్ల జల విద్యుత్కేంద్రం ఉత్పత్తిలోకి వచ్చేది. అది అందుబాటులోకి రాకపోవడం వల్ల చాలా ఎక్కువ ధరకు బయట నుంచి కరెంటు కొనాల్సి వస్తోంది. పంటలకు కూడా ప్రాజెక్టు నీరు అందుబాటులోకి రాలేదు. ఇవన్నీ లెక్కవేస్తే నష్టం రూ.30 వేల కోట్ల వరకు తేలుతోంది' అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు.. మలిదశలో 45.72 మీటర్ల కాంటూరులో నిర్మాణాలంటూ సందేహాలకు తావివ్వకుండా.. గరిష్ఠ నీటి నిల్వ 196.40 టీఎంసీ మేర ప్రాజెక్టు నిర్మాణం సాగాలని.. ఆ మేరకు కేంద్రం సహకరించి నిధులివ్వాల్సిందిగా కోరదామని చెప్పారు. 'కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా తీసుకున్న నిర్ణయం మేరకు.. కేంద్రం స్పందించి.. సకాలంలో ఆదేశాలు జారీ చేయాలి. కేంద్రం త్వరితగతిన నిర్ణయం తీసుకుంటే.. ఈ ఏడాది నవంబరు నుంచే పనులు ప్రారంభించే వీలుంటుంది' అని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

వెంటనే తిప్పికొట్టాలి..: తప్పుడు ప్రచారం చేయడంలో వైసీపీ ఆరితేరిందని, ఉపేక్షించకుండా అవసరమైన సందర్భాల్లో మంత్రులు తక్షణం వాటిని తిప్పికొట్టాలని కేబినెట్ నిర్ణయించింది. '2019 ఎన్నికల ముందు జగన్‌పై జరిగిన కోడి కత్తి దాడిని మనం పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు. అలాగే బాబాయి హత్యను వాళ్ళు చేసి మనపై తోసివేసినా మనం అంత బలంగా స్పందించలేదు. వాటి ప్రభావం ఉండదనుకున్నాం. కానీ అవి ప్రభావం చూపాయి. ఈసారి ఎన్నికల ముందు జగన్‌పై గులకరాయి దాడి జరిగిన వెంటనే మనం స్పందించి అది డ్రామా అని విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాం. పెద్దఎత్తున ప్రచారం చేశాం. అప్పటికే జగన్ వ్యవహారాలు వారికి అర్థమై గులకరాయి దాడిని నమ్మలేదు. కొద్ది రోజుల క్రితం వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి అందులో ఒకరు హత్యకు గురైతే.. జగన్ దానిని మన పార్టీకి పూయాలని చూశారు. రాష్ట్రంలో 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఢిల్లీ వెళ్లి యాగీ చేయాలని చూశారు. చనిపోయిన వారి పేర్లు ఇవ్వాలని జాతీయ మీడియా అడిగితే సమాధానం చెప్పలేక జగన్ వెళ్లిపోయారు. ఇటువంటివి మనం కూడా అందుకోవాలి. ప్రతి దుష్ప్రచారాన్నీ తిప్పికొట్టాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ శ్రేణులు ప్రతీకార దాడులకు, కక్ష సాధింపు చర్యలకు దిగవద్దని తాను పదేపదే ఉద్దేశపూర్వకంగానే చెబుతున్నానని అన్నారు. 'జగన్ మనపై ఎన్నో దాడులు చేశాడు. చేయాల్సినంత అరాచకం చేశాడు. కానీ మళ్లీ గెలవగలిగాడా? వాళ్లు చేసిన అరాచకానికి చట్టప్రకారం శిక్ష పడేలా చూద్దాం. చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవడం ఎందుకు? చట్టం తన పని తాను చేసుకుంటుంది' అని వ్యాఖ్యానించారు. కాగా... గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని కేబినెట్ ధ్రువీకరించింది.

> పోలవరం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం శుభపరిణామం. రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు.
>
> జగన్ వచ్చాక ఎగువ కాఫర్ డ్యాం పనులు చేయకుండా గ్యాప్‌లను అలాగే వదిలేయడంతో 2020 వరదలకు భారీ గుంతలు ఏర్పడి డయాఫ్రం వాల్ దెబ్బతింది. పీపీఏ సూచించినా పూర్తి నిర్లక్ష్యం చేశారు. రెండేళ్లపాటు పనులే చేపట్టలేదు.

ప్రతి మంత్రికి ఎంబీఏ ఎగ్జిక్యూటివ్

- ప్రతి పేషీలో 8 మంది ఉద్యోగులు

కేబినెట్‌లోని ప్రతి మంత్రికీ ఎంబీఏ చదివిన ఒక ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌ను పాలనా వ్యవహారాల్లో సహాయకారిగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రుల పేషీల్లో ఉండాల్సిన సిబ్బందికి సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రుల పేషీల్లో సిబ్బంది నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలపాల్సి ఉండడంతో గురువారంనాటి సమావేశంలో సంబంధిత తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. దీని ప్రకారం ప్రతి పేషీకి 8 మంది చొప్పున సిబ్బందిని మంజూరు చేశారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టు కూడా ఉంది. గతంలో ఈ పదవి లేదు. దీనిని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసి సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం ఈ పోస్టును కొత్తగా సృష్టించారు. మంచి వారిని చూసి పేషీల్లో సిబ్బందిగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంత్రుల కార్యాలయాల్లో ఆరోగ్యకర వాతావరణం ఉండాలని, శాఖాపరమైన అంశాలపై వెంటనే ప్రతిస్పందించే వారిని చూసి పెట్టుకుంటే ఫలితాలు బాగా ఉంటాయని తెలిపారు.



990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్!

- నిర్మాణానికి అనుమతివ్వండి
- పోలవరం తొలి దశ పనులకు తక్షణమే రూ.12,157 కోట్లివ్వండి
- కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రంవాల్ దెబ్బతిన్నందున రూ.990 కోట్లతో కొత్త వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్ర కేబినెట్ కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి కోరింది. ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తిచేసేందుకు తక్షణమే రూ.12,157.53 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేయాలని అభ్యర్థించింది. ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంజరిగింది. 41.15 మీటర్ల కాంటూరులో తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని కేంద్రం రూ.30,436.95 కోట్లకు ఆమోదించిందని గుర్తుచేసింది. ఇందులో ఇంకా రూ.12,157.53 కోట్లు రావలసి ఉన్నందున ఈ మొత్తాన్ని అడ్వాన్సు రూపంలో ముందస్తుగా ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇలా ముందస్తుగా నిధులు మంజూరు చేయడం దల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టాలెక్కించి త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుంటుందని పేర్కొంది. ఇక ప్రాజెక్టు రెండోదశలో 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీలు నిల్వ చేసేలా పనులు చేపట్టేందుకు అంచనాలు సవరించాలని కోరింది. సవరించిన అంచనా వ్యయాన్ని త్వరలోనే కేంద్రానికి అందజేస్తామని తీర్మానంలో వెల్లడించింది. 'ఈ నెల 3న కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా ఆధ్వర్యంలో అంతర్జాతీయ నిపుణులతో, రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ సాయిల్-మినరల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో పాత డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేసే బదులు కొత్తది నిర్మించాలన్న నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త వాల్ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇవ్వాలి. అలాగే పోలవరం ఎడమ కాలువ, కుడి కాలువల ద్వారా 8,123 క్యూసెక్కులు, 11,654 క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యంతో నిర్మాణాలను చేపడతామని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నాం. ఇప్పుడు రెండు కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచేందుకు అనుమతి ఇవ్వండి. ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ తరచూ స్టాప్ వర్క్ ఆర్డర్ ఇస్తుండడం.. నిర్మాణానికి ఆటంకంగా మారింది. అందుచేత నిర్మాణ పనులపై నిషేధాన్ని శాశ్వతంగా ఎత్తివేయాలి' అని విజ్ఞప్తి చేసింది. కేబినెట్ ఇంకా ఏమని తీర్మానించిందంటే..

ఈ ఐదేళ్లలో విధ్వంసం..

2014-19 మధ్యకాలంలో పోలవరం ప్రగతి పరుగులు తీసింది. 2019 మేనాటికి 72శాతం పనులు పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టు విధ్వంసానికి గురైంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎగువ కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయలేదు. పీపీఏ సూచించిన రెండు గ్యాప్‌లు పూడ్చలేదు. 2019, 20ల్లో పనులే చేపట్టలేదు. భూసేకరణ పూర్తి చేయలేదు. గ్యాప్‌లు పూడ్చకపోవడంతో.. గోదావరి వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యాం పునాదులకు సమీపంలో భారీగుంతలు పడ్డాయి.

భారీ వరద కారణంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం గ్యాప్-1 వద్ద భారీగోతులు ఏర్పడ్డాయి. గ్యాప్-2 ప్రాంతంలోనూ భారీ గుంతలు పడ్డాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో భారీగా సీపేజీ ఎగదన్నుతోంది. 500 మీటర్ల మేర నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. 2020 గోదావరి వరదల తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు నాలుగేళ్ల పాటు ముందుకు కదలకుండా నిలిచిపోయాయి. ప్రాజెక్టు సకాలంలో పూర్తికాక.. సాగు నీరందక రైతులు రూ.3,700 కోట్ల మేర పంట నష్టపోయారు. జలవిద్యుత్కేంద్రం సకాలంలో పూర్తికానందున 3,000 కోట్లు నష్టం వాటిల్లింది.

30 లక్షల ఎకరాలకు సాగునీరు..

పోలవరం ప్రాజెక్టును 194.6 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించాం. దీనివల్ల 23.5 లక్షల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడమే గాక కొత్తగా 7.2 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావచ్చు. తాగునీటి అవసరాలకు 4.9 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 18.5 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉంది. జల విద్యుత్కేంద్రం ద్వారా 960 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. పోలవరం నిర్మాణ బాధ్యతను పూర్తిగా తీసుకుంటానని బడ్జెట్‌లో ప్రతిపాదించినందుకు కేంద్ర పభుత్వానికి ధన్యవాదాలు. 45.72 మీటర్ల కాంటూరు మేరకు 194.60 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నిర్మించాలన్న నిర్ణయానికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకు కేంద్రం పూర్తిగా సహకరించి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలి.

డీటీ, ఐటీ వినియోగంలో ట్రాన్స్‌కోకు అవార్డులు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ఐటీ వినియోగంలో ట్రాన్స్‌కోకు సౌత్ గావ్‌టెక్ సింపోజియం అవార్డులు దక్కాయి. వినియోగదారుల విద్యుత్తు వాడకానికి సంబంధించి మీటరు రీడింగ్ అప్లికేషన్లలో ఐటీ వినియోగానికి గాను సౌత్ గావ్ టెక్ 2024 అవార్డు దక్కింది. ఐటీ రంగానికి సంబంధించి ట్రాన్స్‌కో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీలోనూ ఈ అవార్డును దక్కించుకుంది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నాయకత్వంలోని అధికారుల బృందం హైదరాబాద్‌లో బుధవారం రాత్రి సౌత్ గావ్ టెక్ సింపోజియంలో అవార్డులను అందుకుంది. డిజిటల్ ట్రాన్స్‌మిషన్ ఎక్స్‌లెన్స్ విభాగంలో జాయింట్ మీటర్ రీడింగ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఐటీ ఇన్నోవేషన్స్‌లో ఏపీ ట్రాన్స్‌కో అనుసరిస్తున్న విధానాలపై అవార్డు దక్కింది. ఈ అవార్డులను దక్కించుకున్నందుకు సీఎం చంద్రబాబు గురువారం ఇంధన శాఖ అధికారులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై కట్టుదిట్టమైన చర్యలు

- ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశాలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. గురువారం మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో ఆరోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై ఆయన సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన, ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ప్రబలేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియాపై 24 గంటలూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసుల ఎత్తివేతపై హర్షం

విజయవాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలపై వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను రద్దు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు గురువారం అసెంబ్లీలో ప్రకటించడంతో ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీ మరియదాస్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, హృదయరాజు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను ప్రశ్నించినందుకు ఉద్యోగులు, అధికారులపై కేసులు నమోదు చేసిన విషయాన్ని శాసనభ సాక్షిగా ప్రపంచానికి తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఐక్యవేదిక చైర్మన్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్నట్టు సీఎం అసెంబ్లీలో ప్రకటించడాన్ని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ-ఏపీజీఈఏ జేఏసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన జీపీఎస్ చట్టాలను కూడా అసెంబ్లీ వేదికగా రద్దు చేయాలని కోరారు.

పారిస్ ఒలింపిక్స్ నేటినుంచే

ఆటే ధ్యాస పతకమే శ్వాస

206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు



మళ్లీ నీరజ్‌పైనే ఆశలు

ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్ ఎన్ని పతకాలు సాధిస్తుంది అంటే.. కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. జావెలిన్ త్రోలో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న నీరజ్ చోప్రా మరోసారి గోల్డ్ కొల్లగొడతాడనే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక, బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్ జంట, షూటింగ్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా పతకాలు సాధిస్తారని భావిస్తున్నారు. బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, రెజ్లింగ్‌లో అంతిమ్ పంగల్, వినేష్ ఫొగట్‌కు కూడా మెడల్స్ సాధించే సత్తా ఉంది. టెన్నిస్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ జోడీపై భారీగా ఆశలు పెట్టుకొన్నారు. గత క్రీడల్లో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టు మరింత మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే టోక్యో క్రీడల్లో సాధించిన ఏడు పతకాల కంటే.. ఈసారి ఎక్కువగా సాధిస్తారని అనుకొంటున్నారు.

ఈ క్రీడలు ఎందుకు ప్రత్యేకమంటే..

ఏ ఆతిథ్య దేశమైనా ఒలింపిక్స్ నిర్వహణలో తమదైన ప్రత్యేకత చాటుకుంటుంది. అలాగే పారిస్ నిర్వాహకులు కూడా పర్యావరణానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ, వృథాకు చోటులేకుండా ఈసారి విశ్వక్రీడలను భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇలా పలు అంశాల్లో పారిస్ ఒలింపిక్స్ ప్రత్యేకత సంతరించుకోనున్నాయి. అవేంటంటే..

వృథాకు లేదు అవకాశం

విశ్వక్రీడల నిర్వహణ ఏ దేశానికైనా ప్రతిష్ఠాత్మకం. గర్వకారణం. అదే సమయంలో ఆర్థికంగా కూడా భారమే. రూ. వందల కోట్లు వెచ్చించి నిర్మించిన స్టేడియాలు, గేమ్స్ విలేజ్..క్రీడలు ముగిశాక ఎక్కువ శాతం నిరుపయోగమవుతాయి. కానీ పారిస్ క్రీడల నిర్వాహకులు అందుకు ఆస్కారం లేకుండా..ఈసారి ఒలింపిక్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రతి నిర్మాణంలోని వస్తువులను పునర్ వినియోగించేలా చర్యలు చేపట్టారు. భవనాలను లీజుకు ఇవ్వడం, ఇతర నిర్మాణ సామాగ్రి అమ్మకం, రీసైక్లింగ్ చేయడం ద్వారా వృథాకు తావులేకుండా చూస్తున్నారు.

పర్యావరణ హితం

ఈసారి పోటీల సందర్భంగా 20 లక్షల క్రీడా పరికరాలను వినియోగిస్తున్నారు. వీటిలో 15 లక్షల పరికరాలను ఆయా క్రీడా సంఘాలు అద్దెకు తీసుకోవడం గమనార్హం. క్రీడల్లో ఉపయోగించే కంప్యూటర్లు, ప్రింటర్లను సైతం రెంటుకు తీసుకొచ్చారు. అలాగే ఫర్నిచర్‌కు సంబంధించిన వస్తువులను కూడా ముందు అనుకున్నట్టు ఎనిమిది లక్షలకు కాకుండా ఆరు లక్షలకే పరిమితం చేశారు. ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ గ్యాస్‌తో నడిచే వాహనాలనే ఉపయోగిస్తున్నారు. అంతేకాదు. గత కొన్ని ఒలింపిక్స్‌లో కంటే 40 శాతం తక్కువగా వాహనాలను వినియోగిస్తున్నారు. బయో ఫ్యూయల్, హైడ్రోజన్, బ్యాటరీలతో నడిచే జనరేటర్లనే వాడుతున్నారు. మొత్తంగా..ఈసారి ఒలింపిక్స్ అత్యంత పర్యావరణ హితంగా నిర్వహిస్తున్నారు.

పొదుపు మంత్రం

ఇప్పటికే ఉన్న, తాత్కాలికంగా నిర్మించిన వేదికల్లోనే 329 క్రీడాంశాలను నిర్వహిస్తున్నారు. మొత్తం 35 క్రీడా వేదికల్లో రెండింటినే కొత్తగా నిర్మించారు. ఈ రెండింటిలో ఒకటి..అక్వాటిక్ స్టేడియాన్ని కర్బన్ ఉద్గారాలకు తావులేకుండా చెక్కతో నిర్మించారు. ఈ స్టేడియాన్ని నగరంలో క్రీడా సదుపాయం అందుబాటులోలేని ప్రాంతంలో ఏర్పాటు చేశారు. స్టేడియంలో సీట్లలో రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించారు. అలాగే రెండోది పోర్ట్ డి లా చాపెల్ స్టేడియం.

లింగ సమానత్వం

పారిస్ గేమ్స్‌లో మొత్తం 10,500 మంది అథ్లెట్లు తలపడుతుండగా వీరిలో సగం మంది మహిళలు కావడం విశేషం. టోక్యో క్రీడల్లో మహిళా అథ్లెట్ల శాతం 47.8 కావడం గమనార్హం. 1972 మ్యూనిచ్ క్రీడల వరకు ఒలింపిక్స్‌లో అతివల ప్రాతినిధ్యం 20 శాతం కంటే తక్కువగానే ఉండేది. సాధారణంగా పురుషుల మారథాన్‌తో ఒలింపిక్స్‌కు తెరపడుతుంది. అయితే ఈసారి మహిళల మారథాన్‌తో ముగియనుండడం మరో విశేషం.

రాత్రి 11 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో

- భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు
- వినూత్నంగా ప్రారంభ వేడుకలు

తమ దేశ జాతీయపతాకం సగర్వంగా ఎగరాలని ప్రతి ఒక్కరూ కోరుకునే అరుదైన సందర్భం.. గొప్పగొప్ప ఆటగాళ్లంతా తమ నైపుణ్యాలకు పదునుపెట్టే అసలైన సమరం.. జీవితంలో ఒక్కసారైనా పోటీపడాలని ప్రతి క్రీడాకారుడు కలలు కనే విశ్వక్రీడా సంరంభం.. యావత్ క్రీడాలోకాన్ని ఒక్కటి చేస్తూ, విశ్వవ్యాప్త అభిమానులను ఆనందసాగరంలో ముంచెత్తుతూ, ప్రపంచ మేటి అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలుస్తూ, అద్భుత విన్యాసాలు, ప్రదర్శనలకు అరుదైన వేదిక.. నాలుగేళ్లకోసారి జరిగే ఆటల సంబరం.. ఒలింపిక్స్.. వచ్చేసింది.. ఫ్రాన్స్ రాజధాని, ఫ్యాషన్ సిటీ పారిస్ ఆతిథ్యమిస్తున్న ఈ ఒలింపిక్స్ మొదలయ్యేది నేడే.

విశ్వక్రీడల చరిత్రలోనే తొలిసారిగా స్టేడియం లోపల కాకుండా బయట.. అదీ.. పారిస్‌లోని ప్రఖ్యాత సెన్ నదీ తీరంలో వినూత్నరీతిలో ప్రారంభ వేడుకలను నిర్వహిస్తున్నారు. 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో సత్తా చాటేందుకు సమాయత్తమయ్యారు.
భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు పోటీలో ఉన్నారు. గత టోక్యో క్రీడల్లో స్వర్ణ పతకంతో యావత్ భారతావనిని మెప్పించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, హ్యాట్రిక్ పతక వేటలోనున్న తెలుగు షట్లర్ పీవీ సింధు, వరుసగా రెండోసారి పతకం అందుకోవాలని పట్టుదలగా ఉన్న బాక్సర్ లవ్లీనా, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, జంబో బృందంగా బరిలో ఉన్న షూటర్లు, పతకాన్ని పట్టేయాలనుకుంటున్న రెజ్లర్లు.. ఇలా అందరిపైనా అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి.. ఈ పదిహేడురోజుల పాటు జరిగే విశ్వక్రీడా పండగలో పతక విందు ఎవరిదో?

పారిస్: ఉత్కంఠ.. ఉద్వేగంతో యావత్ ప్రపంచాన్ని గుప్పిట బంధించే విశ్వక్రీడా పండుగ ఒలింపిక్స్‌కు వేళైంది. ఫ్యాషన్ పుట్టిల్లు పారిస్.. విశ్వక్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. కరోనా ముప్పు వీడిన తర్వాత నిర్వహిస్తున్న మెగా ఈవెంట్ కావడంతో.. చిరకాలం గుర్తుండి పోయే విధంగా గ్రాండ్‌గా ఆరంభ వేడుకలను నదిలో నిర్వహించాలని ఫ్రెంచ్ ప్రభుత్వం నిర్ణయించింది. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక వేదికల్లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయడంతో.. నగరం మొత్తం సందడి వాతావరణం నెలకొంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో జరుపుతున్న మెగా ఈవెంట్ కూడా ఇదేనని భావించాలి. బలమైన శక్తుల మధ్య యుద్ధ వాతావరణం, తీవ్రవాదుల హెచ్చరికల నేపథ్యంలో భారీ భద్రత మధ్య ఈవెంట్లు జరగనున్నాయి. సుమారు 45 వేల మంది రక్షణ బలగాలను వినియోగించనున్నారు. ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ ఆతిథ్యమివ్వడం ఇది మూడోసారి. తొలిసారిగా 1900 సంవత్సరంలో విశ్వక్రీడలను నిర్వహించిన ఈ దేశంలో రెండోసారిగా 1924లో జరిగాయి. అమెరికా (నాలుగుసార్లు), బ్రిటన్ (మూడుసార్లు) తర్వాత అత్యధిక సార్లు ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్న దేశంగా ఫ్రాన్స్ రికార్డులకెక్కనుంది. ఓవరాల్‌గా 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు ఈ క్రీడల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

యూత్ కోసం..

28 రెగ్యులర్ క్రీడా విభాగాలతోపాటు ఈ ఒలింపిక్స్‌లో స్కేట్ బోర్డ్, క్లైంబింగ్, సర్ఫింగ్, బ్రేకింగ్/బ్రేక్‌డ్యాన్స్ చేర్చారు. యువతను ఆకర్షించాలన్న ఆలోచనతోనే ఈ క్రీడలకు చోటు కల్పించారు. టోక్యో క్రీడల్లో కరాటేను చేర్చినా.. ఎక్కువ వయసున్న క్రీడాకారులు భారీగా పాల్గొనడంతో యూత్‌ను పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. గత క్రీడల్లో ఎంట్రీ దక్కించుకొన్న సర్ఫింగ్, క్లైంబింగ్ క్రీడలకు పారిస్‌లోనూ అవకాశం కల్పించారు. క్లైంబింగ్ క్రీడను సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. తొలిసారి చోటు కల్పించిన బ్రేక్ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణ కానుంది.

రష్యా నుంచి 15 మందే..

డోపింగ్ స్కామ్‌తోపాటు ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా నిషేధాన్ని ఎదుర్కొంటున్న రష్యా నుంచి 15 మంది మాత్రమే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు. పైగా తటస్థ అథ్లెట్లుగా వీరు బరిలోకి దిగనున్నారు. మూడేళ్ల క్రితం టోక్యోలో జరిగిన క్రీడల్లో రష్యా ఒలింపిక్ కమిటీ కింద 30 క్రీడా విభాగాల్లో 335 మంది రష్యా అథ్లెట్లు బరిలోకి దిగారు. అయితే, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. రష్యన్లు స్వర్ణం సాధిస్తే.. పతక బహూకరణ సమయంలో ఆ దేశ జాతీయ గీతాన్ని వినిపించరు. 17 మంది బెలారస్ అథ్లెట్లకు కూడా ఇదే నిబంధనలు వర్తించనున్నాయి.

ఆరుబయట ఆటాపాట.. నీటిపై మార్చ్‌పాస్ట్



సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తూ.. ఆరంభోత్సవాన్ని ప్రధాన స్టేడియం బయట నిర్వహించనున్నారు. సెన్ నదిలో సుమారు ఏడు వేల మంది అథ్లెట్లతో బోట్లలో పరేడ్ నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. 6 కిలోమీటర్ల పరేడ్ తర్వాత ఐఫిల్ టవర్ వద్ద ఇది ముగియనుంది. ఇందుకోసం 85 బోట్లను వినియోగించనున్నారు. దాదాపు 5 లక్షల మంది ఈ ఆరంభ వేడుకల వీక్షణకు రానున్నట్టు అంచనా. ప్రముఖ సింగర్లు సెలీనా డియాన్, లేడీ గాగా తమ ఆటపాటలతో ఉర్రూతలూగించనున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్ ఓపెనింగ్ సెర్మనీపై కరోనా ప్రభావం తీవ్రంగా కనిపించింది. ఎక్కువ మంది వీక్షకులను కూడా అనుమతించలేదు. పారిస్‌లో మాత్రం అలాంటి ఇబ్బందులు లేకపోవడంతో.. మెగా ఈవెంట్‌కు అదిరే ఆరంభం దక్కాలని నిర్వాహకులు ప్రణాళికలు రచిస్తున్నారు. నీటిపై తేలియాడుతూ సాగే మార్చ్‌పాస్ట్‌లో భారత పతాకధారులుగా పీవీ సింధు, శరత్ కమల్ వ్యవహరించనున్నారు.

శరణార్థులుగా..


సిండీ ఎంగామ్‌బా

ఐవోసీ శరణార్థుల జట్టు పతాకధారులుగా బాక్సర్ సిండీ ఎంగామ్‌బా, తైక్వాండో అథ్లెట్ యహ్యా అల్ గోటనీ వ్యవహరించనున్నారు. కామెరూన్‌లో జన్మించిన సిండీ యూకేకు వలస వెళ్లగా.. సిరియా అంతర్యుద్ధం కారణంగా యహ్యా తన కుటుంబంతో కలసి జోర్డాన్ పారిపోయాడు. రెఫ్యూజీ టీమ్‌లో ఉన్న 37 మంది అథ్లెట్లు 12 క్రీడా విభాగాల్లో బరిలోకి దిగనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 10 కోట్లకుపైగా ఉన్న శరణార్థులకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని ఐవోసీ పేర్కొంది. 2016 రియో ఒలింపిక్స్ నుంచి శరణార్థుల జట్టు మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగుతోంది.

1 — భారత బృందం నుంచి స్వర్ణ పతక విజేతగా మళ్లీ బరిలోకి దిగుతున్న ఏకైక అథ్లెట్ నీరజ్ చోప్రా

ఈసారి ఒలింపిక్స్‌కు భారత రెజ్లింగ్ జట్టులో పురుషుడు ఒక్కడే ఉన్నాడు. అతనే అమన్ సెహ్రావత్.

2 — ఈ క్రీడల్లో ఒకటి కంటే ఎక్కువ ఈవెంట్లలో పోటీపడుతున్న భారత ప్లేయర్లు. అథ్లెట్ పారుల్ చౌదరి 5వేల మీటర్ల రేసుతో పాటు 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌కు అర్హత సాధించగా.. షూటర్ మనూ భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్లకు ఎంపికైంది.

5 — టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ తరపున పతకాలు సాధించిన ఐదుగురు (నీరజ్ చోప్రా, పీవీ సింధు, మీరాబాయి, లవ్లీనా, హాకీ జట్టు) పారిస్ క్రీడల బరిలోనూ ఉన్నారు.

14 — పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత జట్టులోని ధినిధి దేషింగు వయసు ఇది. పిన్న వయసులో విశ్వక్రీడల బరిలోకి దిగుతున్న రెండో భారత ప్లేయర్‌గా రికార్డు. గతంలో స్విమ్మర్ ఆర్తి సాహా 11 ఏళ్ల వయసప్పుడు 1952 ఒలింపిక్స్‌లో తలపడింది.

35 — పోటీలు జరిగే వేదికలు

329 — పోటీలు జరిగే పతక విభాగాలు

45 వేలు — ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న వాలంటీర్లు

6 లక్షలు — క్రీడాగ్రామంలో ప్రతిరోజు అథ్లెట్లకు వడ్డించే భోజనాల సంఖ్య

43 — పారిస్‌లో పోటీపడుతున్న టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న వయసు ఇది. భారత బృందంలో అత్యధిక వయసు ఆటగాడు ఇతనే. టీటీ ప్లేయర్ శరత్ కమల్ (42 ఏళ్లు) రెండోస్థానంలో ఉన్నాడు.

35 — ఇప్పటిదాకా ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాలు. ఇందులో పది స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, పదహారు కాంస్యాలున్నాయి.

72 — పారిస్ క్రీడలతో తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత అథ్లెట్లు. వీరిలో బాక్సర్ నిఖత్, అథ్లెట్లు జ్యోతి యర్రాజి, జ్యోతికశ్రీ, శ్రీజ, షూటర్ ఇషా సింగ్‌లాంటి తెలుగు ప్లేయర్లున్నారు.

117 — భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో పోటీపడుతున్న మొత్తం అథ్లెట్లు. ఈ బృందంలో అత్యధికంగా 29 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెటిక్స్ నుంచి, 21 మంది షూటింగ్ విభాగం బరిలో ఉన్నారు.

రూ. 40 వేల కోట్లు — పారిస్ క్రీడల నిర్వహణ కోసం ఫ్రాన్స్ వెచ్చిస్తున్న ఖర్చు

45 వేలు — ఒలింపిక్స్ కోసం ఏర్పాటుచేసిన భద్రతా సిబ్బంది

ఇటు 11.. అటు 61


జెంగ్ హావోహావో


జిల్ ఇర్వింగ్

వయసు సంఖ్య మాత్రమే. అది ప్రతిభకు ఏమాత్రం కొలమానం కాదు. కొంతమంది చిరుప్రాయంలోనే సత్తా చాటితే.. మరికొందరు లేటు వయసులో అద్భుతాలు సృష్టిస్తారు. అలా.. పారిస్ ఒలింపిక్స్‌లోనూ తమదైన రీతిలో ముద్ర వేసేందుకు పిన్న, పెద్ద వయసు అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. వీరిలో 11 నుంచి 60 ఏళ్ల పైబడిన వయసు క్రీడాకారులు ఉన్నారు. ఈసారి చైనాకు చెందిన 11 ఏళ్ల చిన్నారి జెంగ్ హావోహావో మహిళల స్కేట్‌బోర్డింగ్ ఈవెంట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఈ క్రీడల్లో పోటీపడుతున్న అతి పిన్నవయసు అథ్లెట్‌గా జెంగ్ రికార్డుకెక్కనుండగా.. ఈమె తర్వాతి స్థానంలో కెనడాకు చెందిన స్కేట్‌బోర్డింగ్ అథ్లెట్, 14 ఏళ్ల ఫే డి ఫాజియోతో పాటు భారత స్విమ్మర్ ధినిధి దేషింగు (14 ఏళ్ల 2 నెలలు) ఉన్నారు. కెనడాకే చెందిన ఈక్వెస్ట్రియన్ జట్టు సభ్యురాలైన జిల్ ఇర్వింగ్ 61 ఏళ్ల వయసులో ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేస్తోంది. పారిస్ క్రీడల బరిలో ఉన్న అతిపెద్ద వయసు అథ్లెట్ రికార్డు ఈమెదే. ఒక ఒలింపిక్స్ చరిత్రలోనే అతిపెద్ద వయసులో పోటీపడ్డ అథ్లెట్‌గా స్వీడన్ షూటర్ ఆస్కార్ స్వాహ్ ఘనత సాధించాడు. ఇతను 72 ఏళ్ల వయసులో 1920 ఆంట్వెర్ప్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు.


ధినిధి దేషింగు

మెరిసిన ధీరజ్, అంకిత

- క్వార్టర్స్‌లో రికర్వ్ ఆర్చరీ జట్లు

పారిస్: తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, అంకిత భకత్ గురి కుదరడంతో.. ఒలింపిక్స్‌ను భారత్ ఆశావహంగా ఆరంభించింది. ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందే.. గురువారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్లలో అదరగొట్టిన భారత పురుషులు, మహిళల జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ రమేష్ జాదవ్‌లతో కూడిన పురుషుల జట్టు మొత్తం 2013 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. క్వార్టర్స్‌లో టర్కీ లేదా కొలంబియాతో తలపడే అవకాశం ఉంది. కొరియా (2049), ఫ్రాన్స్ (2025)లు తొలి రెండుస్థానాలు దక్కించుకొన్నాయి. వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో ధీరజ్ 681 పాయింట్లతో నాలుగోస్థానంలో, తరుణ్‌దీప్ 674 పాయింట్లతో 14వ స్థానంలో, ప్రవీణ్ 658 పాయింట్లతో 39వ స్థానంలో నిలిచారు. కాగా, అంకిత భకత్, దీపిక కుమారి, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు 1983 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి రౌండ్-8 చేరుకొంది. క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ లేదా ఫ్రాన్స్‌తో భారత్ తలపడనుంది. కాగా, వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో అంకిత 11, కౌర్ 22, దీపిక 23వ స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించారు. మిక్స్‌డ్ కేటగిరీలో ధీరజ్-అంకిత జోడీ 5వస్థానంలో నిలిచింది.

అమెరికాకు పోటీగా చైనా

స్వర్ణాల వేటలో అగ్రరాజ్యం అమెరికా చైనా గట్టిపోటీ ఇవ్వనుందని విశ్లేషకుల అంచనా. తాజా డోపింగ్ కేసులు వెలుగు చూసినా చైనా ఏమాత్రం తగ్గేదేలే అని అనిపిస్తోంది. మొత్తంగా పారిస్‌లో 34 పసిడి పతకాలు సహా 86 మెడల్స్ చైనా కొల్లగొడుతుందని అంచనా. అమెరికా 39 స్వర్ణాలతో 112 పతకాలు సాధించే అవకాశాలున్నట్టు చెబుతున్నారు.

2629 — ఇప్పటిదాకా అమెరికా జట్టు సాధించిన మొత్తం ఒలింపిక్ పతకాలు. అత్యధిక పతకాల జాబితాలో అగ్రరాజ్యందే రికార్డు

ఫైనల్‌పై గురి

నేడు బంగ్లాతో భారత్ సెమీస్
మహిళల ఆసియాకప్
మ.2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దంబుల్లా: మహిళల ఆసియా టీ20 కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అంచనాలకు తగ్గట్టుగానే అదరగొడుతోంది. అన్ని విభాగాల్లో రాణిస్తున్న హర్మన్‌ప్రీత్ సేన టోర్నీలో భారీ విజయాలతో సెమీస్‌కు చేరింది. ఇప్పుడు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకునేందుకు శుక్రవారం బంగ్లాదేశ్‌తో కీలక పోరులో తలపడేందుకు సిద్ధమవుతోంది. బంగ్లాదేశ్ తమ చివరి మ్యాచ్‌లో నేపాల్‌ను చిత్తు చేసి సెమీస్‌లో అడుగుపెట్టింది. రాత్రి ఏడు గంటలకు జరిగే మరో సెమీఫైనల్లో శ్రీలంక జట్టు పాకిస్థాన్‌ను ఎదుర్కోనుంది. తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిన పాక్ ఆ తర్వాత నేపాల్, యూఏఈలపై నెగ్గి సెమీస్‌కు చేరింది.

ఒలింపిక్స్‌లో ‘రేపిస్ట్’

క్రీడా గ్రామంలోకి నో ఎంట్రీ



నెదర్లాండ్స్‌కు చెందిన బీచ్ వాలీబాల్ ప్లేయర్ స్టీవెన్ వాన్ డి వెల్డె నేపథ్యం వింటే ఎవరైనా వణికిపోతారేమో.. సరిగ్గా పదేళ్ల క్రితం అతను 12 ఏళ్ల బ్రిటిష్ స్కూల్ విద్యార్థినిని రేప్ చేశాడు. అప్పుడు స్టీవెన్ వయస్సు 19 ఏళ్లు. ఈ నేరాన్ని అంగీకరించడంతో 2016లో నాలుగేళ్ల శిక్ష విధించారు. అయితే యూకే ఆ తర్వాత నెదర్లాండ్స్‌లో శిక్ష అనుభవించిన తను 13 నెలలకే విడుదలయ్యాడు. అనంతరం వాలీబాల్ కెరీర్‌ను కొనసాగించడంతో పాటు తాజాగా తమ దేశం తరపున ఒలింపిక్స్‌కు కూడా ఎంపికయ్యాడు. కానీ జట్టులో అతడిని చేర్చడంపై విమర్శలు కూడా ఎదురవుతున్నాయి. అందుకే స్టీవెన్‌ను ఒలింపిక్ విలేజ్‌లో ఉంచడం లేదు. అలాగే గేమ్స్ జరిగినన్ని రోజులు కూడా మీడియాతో మాట్లాడవద్దని నెదర్లాండ్స్ అధికారులు ఆదేశించారు. మరోవైపు రెండేళ్ల క్రితమే వాలీబాల్ ప్లేయర్, పోలీస్ ఆఫీసర్ కూడా అయిన కిమ్ బెహ్రెన్‌ను స్టీవెన్ వివాహం చేసుకోవడం గమనార్హం.

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋుగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋుషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధిస్తారు.



గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం.. 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ణ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు.. సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేనూ? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.

"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచీ దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17 శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్వ్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

ఆక్వా ఇన్‌పుట్స్‌పై కస్టమ్స్ సుంకం తగ్గింపు

అమరావతి (ఆంధ్రజ్యోతి): దేశంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు ప్రోత్సాహం ఇస్తూ కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా ఇన్‌పుట్స్‌పై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించినట్లు ఎంపెడా చైర్మన్ డీవీ స్వామి తెలిపారు. ఆక్వా హేచరీలు, ఆక్వా ఫార్మ్ ఇన్‌పుట్స్‌పై కస్టమ్ డ్యూటీ మినహాయింపులు ప్రకటించిందన్నారు. వనామీ, బ్లాక్ టైగర్ వంటి రొయ్యల మేతపై 5% కస్టమ్ డ్యూటీ తగ్గుతుందని, ప్రీడస్ట్ బ్రెడ్ పౌడర్‌పై 30% దిగుమతి సుంకం తగ్గుతుందని, రొయ్యల పెంపకం, శుద్ధి, ఎగుమతులకు నాబార్డు సహాయాన్ని సులభతరం చేసిందని వివరించారు.

పొగాకు అదనపు పంటపై రూ.112 కోట్ల అపరాధ రుసుం రద్దు

గుంటూరు సిటీ: పొగాకు రైతులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. పొగాకు అదనపు పంటపై వేసే అపరాధ రుసుం రద్దు చేస్తూ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందుకు సంబంధించిన వివరాలను గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. గత ఏడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాను ప్రభావం వల్ల సుమారు 15,028.09 హెక్టార్లలో పొగాకు పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. 2023-2024 సంవత్సరానికి 143 మిలియన్ కేజీల పొగాకు పండించాల్సి ఉందన్నారు. తుఫాను తాకిడి తగిలినా 97,127.07 హెక్టార్లలో 205.50 మిలియన్ కేజీల పొగాకును రైతులు పండించారన్నారు. లక్ష్యాన్ని మించి పండిన పంటకు ఐదు శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉందని తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ అపరాధ రుసుం రద్దు చేసిందన్నారు. దీనివల్ల 34,089 రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సుమారు 111.65 కోట్ల అపరాధ రుసుం మాఫీ అయ్యిందని తెలిపారు.


కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.



ఈసారికి అసెంబ్లీ గడప తొక్కను!

» సన్నిహితులకు చెప్పిన వైసీపీ అధ్యక్షుడు జగన్

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నాటితో ముగుస్తుండటంతో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చివరి రోజైనా సభకు హాజరవుతారని అందరూ భావించారు. అయితే ఈసారికి అసెంబ్లీకి వెళ్లనని, వచ్చే సమావేశాల్లో పాల్గొనడంపై ఆలోచిద్దామని సన్నిహితులతో చెప్పారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు అనుకూల మీడియాతో సమావేశమవ్వాలని నిర్ణయించారు. సాయంత్రం లేదా శనివారం ఉదయం బెంగళూరు యెలహంక ప్యాలెస్‌కు వెళతారు. 3రోజులు మకాం వేస్తారు. కాగా, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ బుధవారం ఢిల్లీలో ధర్నా చేసిన జగన్ గురువారం తాడేపల్లి తిరిగొచ్చారు. మంగళ, బుధ వారాల్లో ఢిల్లీలో ఉన్నా జగన్‌కు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ దొరకలేదు. బీజేపీ నేతలెవరూ జగన్‌ను కలిసేందుకు ఇష్టపడలేదు. ధర్నా సహా మొత్తంగా ఢిల్లీ పర్యటన అట్టర్‌ఫ్లాప్ అవ్వడంతో నిరాశగా తిరిగొచ్చేశారు.

బీమా పేరిట రైతులకు మోసం

» ప్రీమియం చెల్లించలేదు.. బీమా బకాయిలు ఎగ్గొట్టారు

» ఈ ఖరీఫ్‌కు పాత బీమా విధానమే.. మండలిలో అచ్చెన్న

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం బీమా పేరుతో రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసిందని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పంటల బీమా బకాయిల చెల్లింపు, రైతులకు పెట్టుబడి సాయంపై గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. దేశంలోనే ఉత్తమ విధానం 2016 నుంచి 2019 వరకు అమలు చేశామని, కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీమా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. 2019-24 మధ్య అర్హులైన రైతులకు పంటల బీమా సొమ్మును ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఐదేళ్లలో ఏ రబీ సీజన్‌లోనూ పంటల బీమా పథకం ప్రీమియం చెల్లించలేదని, దీంతో బాధిత రైతులకు పైసా పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వమే బీమా కంపెనీ పెట్టినట్లు కొన్నాళ్లు ప్రకటించిందని, ఆ తర్వాత కేంద్రం నుంచి అనుమతి రాలేదని చేతులెత్తేశారని చెప్పారు. ఆయా కంపెనీలకు రూ.1287 కోట్ల ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని మంత్రి అచ్చెన్న తెలిపారు. బడ్జెట్‌లో బీమాకు తగిన నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రిని కోరామని తెలిపారు. సీఎం చంద్రబాబు, వ్యవసాయ, ఆర్థిక, పౌరసరఫరాల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేశారని, త్వరలో బీమా అమలులో ఉత్తమ విధానం ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ ఖరీఫ్‌కు పాత విధానం అమలు చేస్తామని(సంస్థలకు ప్రీమియం చెల్లింపుల ద్వారా పరిహారం అందించే విధానాన్ని అమలు చేస్తాం) రబీకి నూతన విధానం అమలుకు ప్రయత్నం చేయాలని అధికారులను సూచించామని తెలిపారు.

● **2016 నాటి కౌలు రైతుల చట్టాన్ని పునరుద్ధరిస్తాం**

రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు పవన్ కల్యాణ్ తన సొంత ఖర్చులతో పరిహారం అందించారంటూ అచ్చెన్న అభినందనలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు కులాలను అంటగట్టి రైతు భరోసా నిధులు ఇవ్వకుండా కష్టాలపాలు చేసిందన్నారు. ఓసీ కేటగిరీలో ఉన్న కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. వైసీపీ తెచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దు చేసి 2016 నాటి కౌలు రైతుల చట్టాన్ని పునరుద్ధరిస్తామని, కౌలు రైతులందరికీ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు.

పులివెందుల జగనన్న కాలనీలో 150కోట్ల స్కామ్

» బాధ్యులపై చర్యలు తప్పవు: మంత్రి పార్థసారథి

పులివెందుల, జూలై 25: పులివెందుల జగనన్న కాలనీలో రూ.150 కోట్ల స్కామ్ జరిగిందని గృహనిర్మాణ శాఖ, ఐఅండ్‌పీఆర్ మంత్రి పార్థసారధి పేర్కొన్నారు. పులివెందుల హౌసింగ్ అవకతవకలపై ప్రత్యేక కమిటీ వేసి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం శాసనమండలిలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పులివెందుల జగనన్న కాలనీలో జరిగిన అక్రమాలపై సభ దృష్టికి తెచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో పక్కాగృహాల మంజూరు అక్రమాలపై ఇటీవల కడప జిల్లా పరిషత్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అధికారులకు వివరించారన్నారు. దానిపై ఓ కమిటీ వేశామని, 4రోజుల్లో రిపోర్టు వస్తుందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 250 ఎకరాల్లో హౌసింగ్ కాలనీ చేపట్టారన్నారు. ఇందులో 8,402 మంది లబ్ధిదారులను గుర్తించారన్నారు. ఇందులో వందల మంది అనర్హులున్నారని, 366 మంది ప్రభుత్వ ఉద్యోగులను కూడా చేర్చడం చూసి ఆశ్చర్యపోయామన్నారు. ఈ కాలనీకి సంబంధించి రూ.150కోట్ల స్కామ్ జరిగినట్లు అప్పటి కడప జాయింట్ కలెక్టర్ గౌతమికి వివరించినా కనీస స్పందన లేదన్నారు. ఈ స్కాంపై పూర్తి విచారణ చేపట్టి, జేసీ, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పైశాచికానికి పరాకాష్ఠ

కక్షతో కేసులు..

నాటి విపక్ష నేత చంద్రబాబు	17 కేసులు
జేసీ ప్రభాకర్ రెడ్డి	66 కేసులు
చింతమనేని ప్రభాకర్	48 కేసులు
పులివర్తి నాని	31 కేసులు
లోకేశ్	17 కేసులు
పవన్ కల్యాణ్	ఏడు కేసులు
అయ్యన్నపాత్రుడు	17 కేసులు
అమరావతి రైతులు	269 కేసులు
వంగలపూడి అనిత (ఎస్సీ)	ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్	ఫర్నిచర్ దొంగతనం కేసు
వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు	కస్టడీలో థర్డ్ డిగ్రీ కోటింగ్

"కోపాలకు లోనైతే సినిమాలో పవన్ కల్యాణ్ విలన్లను కొట్టినట్లు రాజకీయాల్లో ప్రత్యర్థులను కొట్టాలి. అలా సాధ్యం కాదు గనుకే రోడ్డుపై పడుకుని ఆయన నిరసన వ్యక్తం చేశారు. 'నేను తప్పు చేసినా శిక్షించండి' అన్న పవన్‌ను అభినందిస్తున్నా" - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

గురయ్యారు. 2019-24 మధ్య స్టేట్ టెర్రరిజం చూశామని, ఎమర్జెన్సీ కన్నా దారుణమైన చీకటి పాలనతో అన్ని వర్గాలూ ఇబ్బంది పడ్డాయన్నారు. పోలీసులను చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రజాస్వామ్యంపై గొడ్డలిపోటు వేసిన జగన్ లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉంటే ప్రమాదకరన్నారు. "అలిపిరిలో క్లైమోర్‌మైన్ల పేలుళ్లకు భయపడని నేను ఇదే సభలో కన్నీరు పెట్టుకోలేదా? పల్నాడు చంద్రయ్య పాడె మోయడాన్ని మర్చిపోతానా? పవన్ కల్యాణ్ వ్యక్తిత్వ హననానికి గురికాలేదా? అన్నింటికీ చట్టపరంగా సమాధానం చెప్పే బాధ్యత ప్రభుత్వానిది. కార్యకర్తల ఒత్తిళ్లతో మీరెవ్వరూ ప్రతీకార దాడులకు దిగొద్దు" అంటూ ఎమ్మెల్యేలకు సూచించారు. ప్రజలు అధికారం ఇచ్చింది ప్రతీకారం తీర్చుకోవడానికి కాదని స్పష్టం చేశారు. అయితే తప్పు చేసిన వారిని వదిలేస్తే అది ప్రభుత్వ అసమర్థత అవుతుందని.. ఏకపక్ష అధికారులు, రెచ్చిపోయి నేరాలు చేసిన వారిని చట్టపరంగా శిక్షించడంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

రాజకీయ అరాచకం

"ఐదేళ్ల స్టేట్ టెర్రరిజాన్ని కొనసాగించిన వైసీపీ ప్రభుత్వం వేలాది తప్పుడు కేసులు పెట్టింది. ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరినీ వేధించింది. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పి.నారాయణను వేధించారు. పులివెందులలో అత్యాచారం, హత్యకు గురైన దళిత మహిళ విషయంలో నిరసన తెలిపారని ఎస్సీ వర్గానికి చెందిన అనిత, ఎం.ఎస్.రాజుపైనే అట్రాసిటీ కేసులు పెట్టారు. ఫర్నిచర్ కోసం మాజీ స్పీకరు కోడెల శివప్రసాద్‌ను వేధించి పొట్టన బెట్టుకున్న జగన్ ఇంట్లో ఇప్పటికీ ప్రభుత్వ ఫర్నిచర్ ఉంది. సొంత పార్టీ ఎంపీ రఘురామరాజుపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి ఆ దృశ్యాలను జగన్ వీడియో ద్వారా చూసి పైశాచికానందం పొందారు. ఉమ్మడి రాష్ట్రంలో నాపై బాబ్లీ ప్రాజెక్టు కోసం పోరాడిన కేసు ఒక్కటే ఉండేది. జగన్ కక్షపూరితంగా 17 కేసులు పెట్టించారు. అంగళ్లు, పుంగనూరులో నాపై పలు కేసులు పెట్టించి 700మంది టీడీపీ కార్యకర్తల్ని నిందితులుగా చేర్చి అన్యాయంగా జైల్లో పెట్టించారు. తోట చంద్రయ్య, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య, ప్రకాశంలో మునిస్వామి...ఇలా ఎందరో టీడీపీ కార్యకర్తలను పొట్టన బెట్టుకున్నారు. మా ఇంటిపైకి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్‌కు మంత్రి పదవి ఇచ్చి తన నైజమేంటో జగన్ తెలియజేశారు. టీడీపీ, జనసేన కార్యాలయాలపై దాడులు చేసిన వైసీపీ మూకలను అరెస్టు చేయలేదు. ఇప్పుడు దానిపై చర్యలు ప్రారంభమయ్యాయి. కొందరు పోలీసులను అనుకూలంగా మార్చుకుని జగన్ అరాచకాలు చేయించారు. సహకరించని పోలీసులను వీఆర్‌లో ఉంచారు. ఏబీ వెంకటేశ్వరరావు వంటి వారిని కక్షపూరితంగా వేధించారు. ఏబీఎన్ చానెల్ ప్రసారం కాకుండా నిషేధించారు. రామోజీరావుపై కేసులు పెట్టారు. పలు మీడియా సంస్థలు, పాత్రికేయులను వేధించారు. మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను పోలీసులతో కొట్టించి వైసీపీ ప్రభుత్వం బలి తీసుకుంది. డ్రైవర్ సుబ్రమణ్యంను ఆ పార్టీ ఎమ్మెల్సీ చంపేసి శవాన్ని ఇంటికి పార్శిల్ పంపారు. ఇసుక అక్రమాలను ప్రశ్నించిన యువకుడికి పోలీసుస్టేషన్లో శిరోముండనం చేయించారు. గిరిజన మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు. సొంత సోదరి మానాన్ని కాపాడుకునే క్రమంలో అల్లరి మూకల చేతిలో అమర్నాథ్ గౌడ్ అగ్నికి ఆహుతయ్యాడు. అవినీతిని ప్రశ్నించిన నందం సుబ్బయ్యను పొద్దుటూరులో పొట్టన బెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీలపై 10,377నేరాలు జరిగితే.. 300మంది బీసీలు హత్యకు గురయ్యారు. అబ్దుల్ సలామ్ కుటుంబం నంద్యాలలో ఆత్మహత్యకు వైసీపీ నేతలే కారణం. మదనపల్లెలో మిస్బాకు మొదటి ర్యాంకు వస్తే తట్టుకోలేని వైసీపీ నేత వేధింపుల వల్ల ఆ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది"

ఇక గుడి, సమాజం పదిలమే..

"రాజధానికి భూములిచ్చిన పాపానికి అమరావతి రైతులపై నాడు 269 కేసులు పెట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్షాలతోపాటు సొంత చెల్లెలు షర్మిలపైనా కేసులు పెట్టించిన ఘనుడు జగన్. సోషల్ మీడియాలో వంగలపూడి అనిత, ఆదిరెడ్డి భవాని, గౌతు శిరీష అసభ్యకరమైన ట్రోలింగ్‌ను ఆనాడు ఎదుర్కొన్నారు. ఇప్పుడు అందుకు తావు లేదు. సోషల్ మీడియాపై నిఘా పెట్టి హద్దుమీరే వారికి తగిన బుద్ధి చెబుతాం. జగన్ పాలనలో అరసవెల్లి, అంతర్వేది ఇతర ఆలయాలకు రక్షణ లేదు. కూటమి ప్రభుత్వంలో అన్ని మతాల ఆలయాలకు పూర్తి రక్షణ ఉంటుంది"

బాబాయి.. గులక రాయి..

"ఎన్నికల్లో లబ్ధి కోసం సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిపై గొడ్డలి పోటు వేసి సొంత మీడియాలో గుండె పోటు అని మాజీ సీఎం ప్రచారం చేయించారు. మరోసారి ప్రజల్ని మభ్యపెట్టేందుకు గులక రాయి డ్రామా ఆడారు. కోడికత్తి కేసులో దళిత యువకుడిని, గులక రాయి కేసులో అన్యాయంగా బీసీ మైనర్‌ను వేధించారు.బాబాయ్ హత్య విషయంలో మాత్రం నిందితుడైన ఎంపీ అవినాశ్‌రెడ్డిని రక్షించారు. శాంతి భద్రతల అంశంపై బడ్జెట్ సమావేశాల్లో మరోమారు సుదీర్ఘంగా చర్చిద్దాం. పవన్ కల్యాణ్ సూచన మేరకు రోజంతా చర్చ పెడతాం. రానున్న రోజుల్లో పోలీసుశాఖ ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చి టెక్నాలజీకి పెద్దపీట వేసి నేరస్థుల్లో భయం పుట్టిస్తాం."

జగన్.. ఎస్కోబార్ ఇద్దరూ ఒక్కటే..

"నా రాజకీయ చరిత్రలో జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు. ప్రపంచంలో ఇలాంటి వ్యక్తి ఒక్కరే ఉన్నారు. అతడు కొలంబియాకు చెందిన ఎస్కోబార్ అనే డ్రగ్ డీలర్. ఎస్కోబార్ రాజకీయాల్లోకి ప్రవేశించి ఏకంగా డ్రగ్ కారిడార్లు ఏర్పాటు చేశాడు. అమెరికా అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తే ఎంపీగా గెలిచి సొంత జైలు నిర్మించుకుని అందులో ఉన్నాడు.. జైలు నుంచి తప్పించుకుని వచ్చి కొలంబియా న్యాయ మంత్రిని హత్య చేశాడు.. ఆ దేశ సుప్రీం కోర్టుపై దాడిచేసి 11మంది జడ్జీలను చంపేశాడు. ఆ తర్వాత తన పాపాలకు తగిన శిక్ష ప్రజల చేతిలో అనుభవించాడు. రాజకీయాల్లో ఎవరున్నా పర్లేదు కానీ ఎస్కోబార్, జగన్ లాంటి వారు ఉండకూడదు" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.



కేసులు ఎదుర్కొంటున్న నేతలు నిలబడాల్సిందిగా చంద్రబాబు కోరడంతో సభలో నిలుచున్న నేతలు

జగన్ బాధితులూ లేచి నిలబడండి

అసెంబ్లీలో చంద్రబాబు సూచన

నిలబడ్డ 90% ఎమ్మెల్యేలు

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత జగన్ సర్కారు బాధితుల్లో సామాన్యులే కాదు ఎంతో మంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి లోకేశ్.. ఇంకా చాలామంది ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై గురువారం చంద్రబాబు అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ బాధితుల్లో తాను, పవన్, స్పీకర్, అచ్చెన్న, నారాయణ, లోకేశ్, ఇతర మంత్రులు ఉన్నారంటూ పేర్లు ప్రస్తావిస్తూ సభ్యుల వైపు చూశారు. ఈ సందర్భంగా 'నేను, నేను'.. అంటూ ఎమ్మెల్యేలు చేతులెత్తారు. దీంతో 'జగన్ ప్రభుత్వంలో శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు గురై అక్రమ కేసుల్లో చిక్కుకున్న బాధితులు ఒకసారి లేచి నిల్చోండి' అని చంద్రబాబు అన్నారు. దీంతో పవన్, లోకేశ్, మంత్రులు సహా 90 శాతం మంది ఎమ్మెల్యేలు లేచి నిలబడ్డారు. చంద్రబాబు చేసిన పని సభలో నవ్వులు పూయించింది. చంద్రబాబు మాట్లాడుతూ... వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడిన వీళ్లపైనే గాక కుటుంబ సభ్యులపైనా అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో పెళ్లికో, ఫంక్షన్‌కో పిలిచినట్లు ఇంట్లో ఉన్నోళ్లందరూ రావాలంటూ 41ఏ నోటీసులు ఇచ్చారన్నారు. మంత్రి నారాయణ, ఆయన భార్య, అల్లుడు, కూతురుకు కూడా నోటీసులు ఇచ్చారన్నారు. 'అత్యధికంగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై 66 కేసులు, చింతమనేని ప్రభాకర్‌పై 48, పులివర్తి నానిపై 31 కేసులున్నాయి. కేసుల్లో వీరు మొదటి స్థానాల్లో ఉన్నారు. నాపై 17, లోకేశ్‌పై 17, మీ (స్పీకర్)పై 17, పవన్ కల్యాణ్‌పై 7 కేసులు ఉన్నాయి. ఇంకా అచ్చెన్న, నారాయణ, కొల్లు రవీంద్ర, రఘురామ తదితరులపై కేసులు పెట్టారు' అని పేర్లు చదివారు. 'ఇవన్నీ మనందరి ర్యాంకులు అధ్యక్షా' అని అనడంతో మరోసారి నవ్వులు విరబూశాయి. కేసుల్లేని వారు అదృష్టవంతులంటూ ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. దీంతో మీరు (కేసులు లేని వారు) కూడా లేచి నిలబడండి అని ముఖ్యమంత్రి సూచించారు. పదిశాతం మంది సభ్యులు కూడా లేచి నిలబడలేదు. వారిని ఉద్దేశిస్తూ 'నిజంగా వీళ్ల అదృష్టవంతులే' అని చంద్రబాబు నవ్వుతూ వ్యాఖ్యానించారు. అక్రమ కేసులపై సమీక్షించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

అసెంబ్లీలో మంత్రులు

టీడీఆర్ బాండ్ల అవినీతిపై ఏసీబీ విచారణ: మంత్రి నారాయణ

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్ల జారీలో భారీఎత్తున జరిగిన అవినీతి, అవకతవకలపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. ప్రమేయమున్న అధికారులు, రాజకీయ నాయకులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి నారాయణ తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎం మాలకొండయ్య, గోరంట్ల బుచ్చయ్య చౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

డిసెంబరు నెలాఖరుకల్లా టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం

రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనను డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వెలగపూడి రామకృష్ణబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, కొలికపూడి శ్రీనివాసరావుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

స్పెషల్ చిల్డ్రన్ కోసం ప్రత్యేక కార్యాచరణ: మంత్రి లోకేశ్

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను తమ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు. విశాఖ పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాల లేమిపై పెన్మత్స విష్ణుకుమార్‌రాజు ప్రశ్నకు లోకేశ్, ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాల రద్దుపై గిడ్డి సత్యనారాయణ, బి.రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోలా వీరాంజనేయస్వామి, కేసీ కెనాల్ మళ్లింపుపై భూమా అఖిలప్రియ అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల సమాధానాలిచ్చారు.

మండలిలో మంత్రులు

ఈ వ్యర్థాల ఉత్పత్తిలో ఏపీది 12వ స్థానం: పవన్ కల్యాణ్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెపుతూ... 'దేశంలో ఈ వ్యర్థాలు అధికంగా ఉత్పత్తి చేసే తొలి మూడు రాష్ట్రాల్లో ఏపీ లేదు. మనది 12వ స్థానం. ఈ వేస్ట్ రీసైక్లింగ్ కోసం రాబోయే రోజుల్లో ప్రతి జిల్లాలో ఈ యూనిట్లు ఏర్పాటు చేస్తాం' అన్నారు.

గనుల శాఖలో 20 వేల కోట్ల అవినీతి: కొల్లు

రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల అక్రమంగా గనుల తవ్వకాలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా... 'గనులశాఖలో మైనింగ్ ద్వారా రూ.20 వేల కోట్ల అవినీతి జరిగింది. అన్ని చోట్లా శాఖాపరమైన విచారణ జరుగుతోంది' అని చెప్పారు.

బోధనేతర సిబ్బంది నియామకాలు రద్దు: సత్యకుమార్

'రాష్ట్రంలో రెండవ దశలో ప్రారంభించిన వైద్య కళాశాలల్లో బోధనేతర సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరిగాయి. వాటిని రద్దు చేస్తున్నాం' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'పార్వతీపురం, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, పిడుగురాళ్ల, బాపట్ల, పెనుగొండకు వైద్య కళాశాలలను మంజూరు చేశాం' అని తెలిపారు.

ఆర్టీసీలో 1450 కొత్త బస్సులు: రాంప్రసాద్‌రెడ్డి

'ఆర్టీసీని గత వైసీపీ సర్కార్ నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీలో 1,450 కొత్త బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంది. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతాం. మహిళల ఉచిత ప్రయాణానికి విధివిధానాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది' అని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ధాన్యం డబ్బులూ బకాయి పెట్టింది: మనోహర్

'గత ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం సేకరించి రూ.2,763 కోట్లు బకాయి పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.2,000 కోట్లు అప్పులకు, రైతులకు ధాన్యం బకాయిలు రూ.1,000 కోట్లు చెల్లించాం. మిగిలిన రూ.674 కోట్లు మరో 2 వారాల్లో చెల్లిస్తాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

40 వేల ఉద్యోగాలు సృష్టించాలి

కనీసం 400 కంపెనీలు ఏపీకి రావాలి

ఎన్నారై ఎమ్మెల్యేలకు మంత్రి లోకేశ్ టార్గెట్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఐటీ కంపెనీలు నడుపుతున్న తెలుగువారి ద్వారా రాష్ట్రంలో 40,000 ఐటీ ఉద్యోగాలు సృష్టించడానికి నడుం బిగించాలంటూ టీడీపీలోని ఎన్నారై ఎమ్మెల్యేలకు ఐటీ మంత్రి లోకేశ్ టార్గెట్ పెట్టారు. కృష్ణా జిల్లా గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే వెనిగళ్ల రాముతో గురువారం ఉదయం ఆయన ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో మాట్లాడారు. 'అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగువారు నడుతుపున్న ఐటీ కంపెనీలు 800 ఉన్నాయి. ఈ కంపెనీలకు అన్నింటికీ ఇప్పటికే హైదరాబాద్‌లో ఆఫీసులు ఉన్నాయి. అందులో సగం కంపెనీలతో అయినా మన రాష్ట్రంలో కూడా ఆఫీసులు పెట్టించాలి. ఒక్కో కంపెనీ కనీసం 100 ఐటీ ఉద్యోగాలు ఇచ్చినా మొత్తం మీద 40 వేల ఉద్యోగాలు వస్తాయి. ఇంత మంది ఐటీ ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తుంటే తర్వాత చాలా కంపెనీలు వస్తాయి. ఎన్నారై ఎమ్మెల్యేలు దీనికి బాధ్యత తీసుకొని అమెరికాలోని కంపెనీల యాజమాన్యాలను కలిసి మాట్లాడి వారిని ఒప్పించాలి' అని లోకేశ్, రాముకు సూచించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... 'ఐటీ కంపెనీలు కొన్ని వసతులు కోరుతున్నాయి. వాటిని సమకూర్చడం ఎలా అన్నది ఆలోచించాలి. ప్రధానంగా ప్లగ్ అండ్ ప్లే సదుపాయం ఉన్న భవనాలు అడుగుతున్నాయి. ఇక్కడ ఉన్న విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి సిద్ధం చేయాలి' అని చెప్పారు. విశాఖలో అటువంటి సదుపాయం ఉన్న భవనాలు సిద్ధంగా ఉన్నాయని, శిక్షణ ఏర్పాట్లు కూడా చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. దీనిపై ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా లోకేశ్ అంగీకరించారు.

కృష్ణా జిల్లా ఎస్పీపై టీడీపీ నేతల అసంతృప్తి

కృష్ణా జిల్లాకు ఇటీవల ఎస్పీగా నియమితమైన గంగాధర్‌పై రాయలసీమ టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీల్లో గురువారం ఆయనపై వారి మధ్య కొంతసేపు చర్చ జరిగింది. తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటించిన సమయంలో అంగళ్లు ప్రాంతంలో ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టడంలో గంగాధర్ కీలకంగా వ్యవహరించారని, వందల సంఖ్యలో టీడీపీ నేతలపై కేసులు పెట్టింది ఆయనేనని చిత్తూరు జిల్లా టీడీపీ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. ఆయనకు కృష్ణా జిల్లా ఎస్పీ పోస్టు ఇవ్వకుండా ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ అధికారి కృష్ణా జిల్లాకు వచ్చిన తర్వాత గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ మాజీ మంత్రి కొడాలి నాని పట్ల మృదువుగా వ్యవహరిస్తున్నారని కృష్ణా జిల్లా టీడీపీ ఎమ్మెల్యే ఒకరు ఆరోపించారు. 'కొడాలి నాని పీఏను ఎవరో కొట్టారు. గంటలో ఎస్పీ అతని వద్దకు వెళ్లి కేసు పెట్టాలని ఒత్తిడి తెచ్చారు. ఆయనకు అంత అవసరం ఏమిటి? ఇంకా వైసీపీ ప్రభుత్వమే ఉందని అనుకొంటున్నారా?' అని ఆయన అన్నారు. వైసీపీలో ఎవరిని ఉపేక్షించినా కొడాలి నాని, వల్లభనేని వంశీని మాత్రం ఉపేక్షించరాదని, వారిద్దరూ అంత నీచంగా ప్రవర్తించారని మాజీ మంత్రి సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. వంశీ ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయాడని, కొడాలి నాని గుడివాడ వస్తే తిరగబడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము వ్యాఖ్యానించారు.

ప్రజల భద్రత ప్రభుత్వ బాధ్యత!

» శాంతి భద్రతలపై సభలో చర్చ జరగాలి

» సీఎం విడుదల చేసిన శ్వేతపత్రం సమగ్రంగా ఉంది: పవన్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రం చాలా సమగ్రంగా ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. గురువారం అసెంబ్లీలో శాంతిభద్రతలపై చర్చలో పవన్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో కేవలం శ్వేతపత్రమే కాకుండా ఒకటి రెండు రోజుల పాటు చర్చ జరగాలని సూచించారు. 'గత ప్రభుత్వం ఎలా చేసింది? భవిష్యత్తులో ఏం చేయాలి?' అన్న దానిపై చర్చ జరగాలన్నారు. ఐదు కోట్ల మంది ప్రజలకు భద్రత కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు దేశానికి తలమానికంగా ఉండాలని పేర్కొన్నారు. కాగా, గత ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా అందరిపై కేసులు పెట్టిందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చెప్పారు. తనపైనే వ్యక్తిగతంగా కేసులు పెట్టారని, దీనిపై గత ప్రభుత్వంలో అనేక ఫిర్యాదులు చేశానని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఫిర్యాదులపై స్పందన వచ్చింది కానీ, విచారణ ప్రారంభించలేదని పేర్కొన్నారు. సెక్షన్ 307 కేసు నమోదైన అధికారులను సస్పెండ్ చేయాలని, వారు డీజీ స్థాయి అధికారులైనా శిక్ష పడాలని, అప్పుడే పోలీసులకు క్రమశిక్షణ వస్తుందని స్పష్టంచేశారు. నేరస్థుడు ముఖ్యమంత్రి అయితే పరిస్థితి ఇలానే ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పోలీసులు రాజకీయ నాయకులకు కొమ్ము కాశారని, తనపై కూడా 15 కేసులున్నాయని తెలిపారు. అన్యాయంగా, అక్రమంగా ప్రజల ఆస్తులు కొట్టేద్దామని అనేక కేసులు నమోదు చేశారని, ఈ కేసులన్నింటిపై మళ్లీ విచారణ చేయించాలని కోరారు. చాలామందికి నెలలో వారం రోజులపాటు కోర్టుల చుట్టూ తిరగడానికే సరిపోతోందని సభ దృష్టికి తీసుకువచ్చారు. నెల్లూరులో ఒక సీఏ 22 ఏళ్ల చిన్న కుర్రాడిని కొట్టి చంపేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపించారు. తమ జిల్లాలో ఇలా అక్రమ కేసులు పెట్టినవాటి నుంచి బయటకు వచ్చిన తర్వాత కొన్ని రోజుల్లోనే మరణించారని చెప్పారు. ఈ కేసులపై విచారణ చేయించాలని కోరారు.

'కూటమి' చట్టపరంగానే వ్యవహరిస్తుంది: బీజేపీ

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎవరిపైనా కక్ష, ప్రతీకారం తీర్చుకోకుండా, చట్టపరంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలను కాపాడుతుందని విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చెప్పారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా, అన్యాయంగా దొంగ కేసులు పెట్టి, ప్రతిపక్ష నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని చూశారు. నాపైనా తప్పుడు కేసులు పెడితే.. బెయిల్ తెచ్చుకున్నా' అని అన్నారు. జగన్‌రెడ్డిలాంటి వ్యక్తులు ప్రజాస్వామ్యంలో పనికిరారని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. అసెంబ్లీకి రావడానికి మొఖం చెల్లక, ఢిల్లీలో ధర్నా చేసిన జగన్‌రెడ్డికి ఎన్డీయే వ్యతిరేకులే మద్దతిచ్చారని, ఆయనకు రాష్ట్ర ప్రజల మద్దతు లేదని అన్నారు. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... 2019-24 మధ్య రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం అసెంబ్లీలో ఇచ్చిన శ్వేతపత్రాన్ని చూసి, ఆశ్చర్యపోయా. జగన్ అరాచకాలను చెప్పుకుంటూ పోతే లెక్కే ఉండదు' అని అన్నారు. ఎచ్చర్ల బీజేపీ ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ..'. 2019-24 మధ్య ఎమర్జెన్సీని మించి, ప్రజల్ని ఎంతో ఇబ్బంది పెట్టారు. నాపై హత్యాయత్నం, అట్రాసిటీ లాంటి సెక్షన్ల కింద కేసులు పెట్టి, బెయిల్ రాకుండా చేశారు. బతకాలని ఆశ ఉంటే ఎక్కడికైనా పారిపొమ్మని నాటి అదనపు డీజీ హెచ్చరించడంతో మూడు నెలలు అజ్ఞాతంలో గడిపా' అని అన్నారు.

నేడైనా జగన్ అసెంబ్లీకి రావాలి: చదలవాడ

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీకి నాలుగు రోజులు ఎగ్గొట్టిన జగన్‌రెడ్డి శుక్రవారమైనా రావాలని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సూచించారు. కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి ఆరోపణలకు సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని, జగన్ అసెంబ్లీకి రావాలని అన్నారు.

అమరావతిలో 'నిమ్స్' సౌకర్యాన్ని కల్పించాలి: పీడీఎఫ్

ఉమ్మడి రాష్ట్రానికి హైదరాబాద్‌లో నిమ్స్ ఉన్నట్లే.. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో నిమ్స్ వంటి వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కింద మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య సౌకర్యం కల్పించాలని మండలిలో ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు.

దమ్ముంటే అసెంబ్లీకి రండి

రాజకీయ హత్యలపై చర్చిద్దాం

» జగన్‌కు హోం మంత్రి అనిత సవాల్

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దమ్ముంటే అసెంబ్లీకి రావాలని, రాజకీయ హత్యలపై చర్చిద్దామని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి హోం మంత్రి వంగలపూడి అనిత సవాల్ చేశారు. హత్యకు గురయ్యారంటున్న ఆ 36 మంది పేర్లు చెబితే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ 45 రోజుల్లోనే 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ రాష్ట్రంలో ఎక్కడా చోటు లేనట్టుగా ఢిల్లీ వెళ్లి సిగ్గులేకుండా ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు, సానుభూతిపరులపై రాజకీయ దాడులను నిరోధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని ఆ పార్టీ ఎమ్మెల్యేలు తాటివర్తి చంద్రశేఖర్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బి.విరూపాక్షి, మత్స్యరాస విశ్వేశ్వరరాజు గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు అనిత సమాధానమిచ్చారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

రాష్ట్రంలో సామాన్యులపై అకారణంగా దాడులకు పాల్పడుతున్న బ్లేడ్‌బ్యాచ్‌లు, అసాంఘిక శక్తులు, గంజాయి స్మగ్లర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని అనిత చెప్పారు. ఈ తరహా నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడతామని, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. నేరాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు ఇప్పటికే ట్రాకింగ్, నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్యే మాధవి అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానమిస్తూ.. తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎక్కువగా బ్లేడ్ బ్యాచ్‌లను గుర్తించినట్లు చెప్పారు. గత ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం పోలీసులను రాజకీయ అవసరాలకే వాడుకుని ఆ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో రాష్ట్రమంతటా గంజాయి అమ్మకాలు పెరిగిపోయాయని తెలిపారు. ఈ సమస్యపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి ఇటీవల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆర్థిక అగాధం!

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో గత ఐదేళ్లలో ఆర్థిక రంగంలో జరగని అవకతవకలు లేవు. ఆదాయం పెంచడం పూర్తిగా మానేసి కొత్తకొత్త మార్గాల్లో అప్పులు తెచ్చి ఆర్థిక రంగాన్ని పాతాళానికి తొక్కేశారు. జగన్ హయాంలో పనిచేసిన అత్యంత వివాదాస్పద అధికారులను మాత్రం ఇంకా ఆర్థిక శాఖలోనే కొనసాగిస్తున్నారు. అలాంటప్పుడు వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి? శుక్రవారం ఆర్థిక రంగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేస్తున్న సందర్భంగా ఇదే ప్రశ్న ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. పెండింగ్ బిల్లులతో కలిపి రాష్ట్రం అప్పు రూ.11 లక్షల కోట్లకు పైనే ఉంటుంది. జగన్ హయాంలో ఏటా రూ.లక్ష కోట్లకు తగ్గకుండా అప్పులు తెచ్చారు. పెండింగ్ బిల్లులు దాదాపు రూ.2 లక్షల కోట్ల వరకు ఉంటాయి. ఏపీఎస్‌డీసీ, బేవరేజెస్ కార్పొరేషన్, ఏపీఆర్‌డీసీ, ఏపీఎస్ఎఫ్‌సీఎల్‌ల ద్వారా రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఖజానా ఆదాయం మళ్లించి మరీ అక్రమ మార్గంలో అప్పులు తెచ్చారు. అలాగే, విద్యుత్ కార్పొరేషన్లు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, ఇంకా ఇతర కార్పొరేషన్ల ద్వారా అప్పులు తెచ్చి ప్రభుత్వం సొంత ఖర్చులకు వాడారు. అలాగే, ప్రభుత్వానికి పనులు చేసిన కాంట్రాక్టర్లను జగన్ సర్కారు రాచిరంపాన పెట్టింది. 'ఫిఫో' ఉల్లంఘించి మరీ ప్రభుత్వం వైసీపీ అస్మదీయులకు మాత్రమే బిల్లులు చెల్లించారు. దీంతో లక్షల మంది కాంట్రాక్టర్లు తమకు బిల్లులు ఇప్పించాల్సిందిగా కోరుతూ హైకోర్టులో పిటిషన్లు వేశారు. కోర్టు ఆదేశాలిచ్చినా అప్పటి ఆర్థిక శాఖ అధికారులు బిల్లులు చెల్లించకపోగా కోర్టుకు హాజరై సంజాయిషీలు ఇచ్చుకున్నారు. ఇప్పుడు ఆ పాత అధికారే శ్వేతపత్రానికి అవసరమైన సమాచారం అందించడంలో కీలకంగా ఉన్నారు. అందుకే ఈ శ్వేతపత్రం ద్వారా వాస్తవాలన్నీ బయటకు వస్తాయా లేదా ఇదొక రహస్యపత్రంగానే మిగులుతుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. పైగా, కూటమి ప్రభుత్వానికి ఈ అవకతవకలను సరిచేయడం సవాలే. ఎందుకంటే ఏడాదికి చెల్లించాల్సిన అప్పుల అసలు, వడ్డీలు కలిపి దాదాపు రూ.60,000 కోట్లు. యూనివర్సిటీలు, ఇంటర్మీడియట్ బోర్డు సహా ప్రభుత్వంలోని ఏ ఒక్క శాఖ వద్ద కూడా రూపాయి లేదు. వీటన్నింటినీ పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

ఊరగాయ ఇవ్వని హోటల్‌కు
రూ.35,000 జరిమానా!

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భోజనం పార్శిల్‌తో పాటు ఊరగాయ ఇవ్వని ఓ హోటల్‌కు వినియోగదారుల ఫోరం రూ.35 వేల జరిమానా విధించింది. తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఆరోగ్యస్వామి అనే వ్యక్తి ఓ ఆశ్రమానికి అందించేందుకు విల్లుపురంలోని ఓ ప్రముఖ హోటల్‌లో 25 భోజనాలు కొనుగోలు చేశారు. అయితే హోటల్ సిబ్బంది భోజన పార్శిల్‌తో పాటు ఊరగాయ ఇవ్వలేదు. ఈ విషయాన్ని ఆరోగ్యస్వామి యజమాని దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ కూడా నిర్లక్ష్య సమాధానమే వచ్చింది. దీంతో, ఆరోగ్యస్వామి విల్లుపురం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఫోరం.. హోటల్ యాజమాన్యం ఆరోగ్యస్వామికి రూ.35 వేలు నష్టపరిహారం చెల్లించాలని గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఈ ఏడాదీ జనగణన లేనట్టే!

» బడ్జెట్‌లో పరిమితంగానే కేటాయింపులు

న్యూఢిల్లీ, జూలై 25: దేశంలో జనాభా లెక్కల ప్రక్రియ ఈ ఏడాది కూడా చేపట్టే అవకాశాలు కనిపించడం లేదు. జనగణన కోసం తాజా బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్రం రూ.1,250 కోట్లకే పరిమితం చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు 17% తక్కువ. 2021-22లో కేటాయించిన దానిలో మూడింట ఒక వంతు మాత్రమే ఇవ్వడంతో ఈ ఏడాది జాతీయ జనాభా నమోదును చేపట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని తేలిపోయింది. 2020 నుంచి ఈ విభాగానికి కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. మరోవైపు కేటాయించిన దానిలోనూ ఏటా కొద్ది మొత్తాన్ని మాత్రమే ఖర్చు చేస్తున్నారు.

ఇకపై పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

» అప్రమత్తమైన కమిషన్

న్యూఢిల్లీ, జూలై 25: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ కేసు నేపథ్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అప్రమత్తమైంది. అవకతవకలను నివారించి, పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఆధార్ ఆధారిత వేలిముద్రల ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్, ఈ-అడ్మిట్ కార్డులపై క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నియమించిన సిబ్బంది పనితీరును, అభ్యర్థుల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ప్రత్యక్ష ఏఐ ఆధారిత సీసీటీవీ నిఘా కోసం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించింది. ఈ కాంట్రాక్టు కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని, దీన్ని మరో ఏడాదిపాటు పొడిగించే అవకాశం యూపీఎస్సీ ఉందని తెలిపింది.

దర్బార్ హాలు కాదు.. గణతంత్ర మండపం

» అశోక్ మండపంగా మారిన అశోక్ హాలు.. పేర్లు మార్పు

న్యూఢిల్లీ, జూలై 25: రాష్ట్రపతి భవన్‌లో వివిధ కీలక వేదికల పేర్లను మార్చారు. ప్రఖ్యాత 'దర్బార్ హాలు' పేరును గణతంత్ర మండపంగా, 'అశోక్ హాలు' పేరు అశోక్ మండపంగా గురువారం నామకరణం చేశారు. నిరుడు సుప్రసిద్ధ మొగల్ గార్డెన్స్‌ను 'అమృత్ ఉద్యాన్'గా మార్చిన సంగతి తెలిసిందే. కాగా, పేర్ల మార్పును కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆక్షేపించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వాళ్లకు 'దర్బార్' భావన లేదని.. 'నియంత' భావన మాత్రమే ఉందని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 25: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి పొడిగించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ కస్టడీని ఈనెల 31 వరకు పొడిగించగా.. సీబీఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి కావేరి బవేజా గురువారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే సిసోడియా, కవితతో పాటు ఇతర నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కూడా ఈ నెల 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తిహాడ్ జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు.

ఖనిజ సంపదపై రాష్ట్రాలు
పన్ను విధించవచ్చు!

» కేంద్రానికి ఆ అధికారం లేదు
» కాకపోతే పరిమితులను పేర్కొనవచ్చు
» రాష్ట్రాలకు చెల్లించే రాయల్టీ పన్ను కాదు
» సుప్రీంకోర్టు సంచలన తీర్పు
» రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం
» పాత బకాయిలపై 31న స్పష్టతనిస్తామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, జూలై 25: గనులపై, ఖనిజాలతో కూడిన భూములపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించే రాయల్టీ.. పన్ను కాదని తెలిపింది. దేశంలో గనులు, ఖనిజాలపై కొనసాగుతున్న కేంద్రం గుత్తాధిపత్యాన్ని పక్కనపెట్టేలా సుప్రీంకోర్టు గురువారం సంచలన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ముఖ్యంగా ఖనిజ సంపద అధికంగా ఉన్న ఝార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాలకు గొప్ప ఊరట కలిగించనుంది. వాటి ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మాసనం 200 పేజీల మెజారిటీ (8:1) తీర్పును వెలువరించింది. జస్టిస్ బీవీ నాగరత్న విడిగా తీర్పునిస్తూ.. గనులు, ఖనిజాలున్న భూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు లేదని, ఆ అధికారం పార్లమెంటుదేనని పేర్కొన్నారు. రాయల్టీ పన్ను వంటిదేనన్నారు. కాగా, మిగిలిన 8 మంది న్యాయమూర్తుల తరఫున సీజేఐ తీర్పును చదవి వినిపించారు. ఈ మెజారిటీ తీర్పు ప్రకారం.. రాజ్యాంగంలోని రెండో జాబితాలో ఉన్న ఎంట్రీ 49 (ఆర్టికల్ 246) మేరకు భూములు, భవనాలు, గనులు, క్వారీలపై రాష్ట్ర శాసనసభ పన్ను విధించవచ్చు. ఉత్పత్తి అయ్యే ఖనిజాల పరిమాణం ఆధారంగా పన్ను నిర్ణయించవచ్చు. రాజ్యాంగంలోని తొలి జాబితాలో ఉన్న ఎంట్రీ 54 పరిధిలోని ఖనిజాల హక్కులపై పన్ను విధించే చట్టబద్ధ అధికారం పార్లమెంటుకు లేదు. ఖనిజాలపై ఆయా సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించే రాయల్టీ.. పన్ను కాదు. అయితే, ఖనిజాల హక్కులకు సంబంధించి పన్నులు విధించే రాష్ట్రాల మీద పార్లమెంటు ఏవైనా పరిమితుల్ని నిర్దేశించవచ్చు. రాజ్యాంగంలోని రెండో జాబితాలో ఉన్న ఎంట్రీ 50 ప్రకారం, ఆ పరిమితులు.. ఆంక్షలు, షరతులు, నిబంధనలు, మొత్తంగా నిషేధం కూడా కావచ్చు. దేశంలో ఖనిజాభివృద్ధికి సంబంధించి పార్లమెంటు చేసే చట్టాలకు లోబడే ఏవైనా పన్నులు విధించాలని ఎంట్రీ 50 చెబుతోంది.



పాత బకాయిలు ఇప్పించండి

తీర్పు తమకు అనుకూలంగా వచ్చిన సందర్భంగా.. గనులు, ఖనిజాలపై పన్ను రూపంలో కేంద్రం ఇప్పటి వరకూ వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయలను తమకు తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టును తాజాగా కోరాయి. అయితే, కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాష్ట్రాల వాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై రాష్ట్రాలు, కేంద్రం లిఖితపూర్వకంగా వాదనలు సమర్పించాలని, జూలై 31న తాము తీర్పు చెబుతామని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఆ తీర్పు సరైనది కాదు

రాయల్టీని పన్నుగా పేర్కొంటూ 1989లో ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు సరైనది కాదని మెజారిటీ తీర్పు పేర్కొంది. మైనింగ్ లీజు తీసుకున్న సంస్థ కాంట్రాక్టు ప్రకారం చెల్లించే రాయల్టీ.. పన్ను వంటిది కాదని తెలిపింది. కాబట్టి, 1989లో ఇండియన్ సిమెంట్స్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే సీజేఐ తమ తీర్పులో.. గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టాన్ని (ఎంఎండీఆర్ఏ) ప్రస్తావించారు. ఖనిజాలు, ఖనిజ అభివృద్ధిపై పన్ను విధించకుండా ఈ చట్టంలో ఎటువంటి ఆంక్షలు లేవని గుర్తుచేశారు. ధర్మాసనంలో జస్టిస్‌లు రిషికేశ్ రాయ్, అభయ్ ఓకా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా, ఉజ్జల్ భుయాన్, సతీశ్ చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మాసి కూడా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి ఈ వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది.

నేపథ్యం ఇదీ..

తమిళనాడులో గతంలో ఓ మైనింగ్ లీజు పొందిన ఇండియా సిమెంట్స్ కంపెనీ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తూ వచ్చింది. సెస్ కూడా చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించటంతో ఆ కంపెనీ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇదే తరహా వివాదాలపై గత కొన్నేళ్లుగా 80కిపైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ఇండియా సిమెంట్స్ కేసులో ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పినందున, ఈ అంశాన్ని తొమ్మిది సభ్యుల ధర్మాసనానికి సిఫార్సు చేశారు. ఎనిమిది రోజుల పాటు విచారణ జరిగింది. మైనింగ్, ఖనిజాల మీద పన్ను విధించే అధికారం తమకు ఉందని రాష్ట్రాలు వాదించగా, కేంద్రం, మైనింగ్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఖనిజాలు, గనుల మీద పన్ను విధించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, రాష్ట్రాలకు లేదని వాదించాయి.

వర్ష బీభత్సం

మహారాష్ట్ర, గుజరాత్, హిమాచల్ రాష్ట్రాలలో కుండపోత



ముంబై, పుణె, జూలై 25: ఎడతెరిపి లేని వర్షాలు మహారాష్ట్రను వణికిస్తున్నాయి. రాజధాని ముంబై, ఐటీ సంస్థల కేంద్రం పుణెతో పాటు రాయ్‌గఢ్, పాల్ఘర్ జిల్లాల్లో వరుణుడు విజృంభిస్తున్నాడు. ముంబైలో రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ జామ్‌లతో పాటు రైల్ సర్వీసులు ఆలస్యం అయ్యాయి. రాగల 24 గంటల్లోనూ అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. సాయన్, చెంబూర్, అంధేరీల్లో వరద ప్రభావం అధికంగా ఉంది. శుక్రవారం ఉదయం వరకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ సంస్థలు విమాన సర్వీసులను రద్దు చేశాయి. పుణెతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. పుణెలో దక్కన్ జింఖానా వద్ద వీధి వ్యాపారులు ముగ్గురు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరొకరు వర్షాలకు మృతిచెందారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇక్కడివారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నగరానికీ రెడ్ అలర్ట్ జారీ చేశారు. థానె, పాల్ఘర్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన మనాలీలో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురిసింది. అంజనీ మహదేవ్ కాల్వ పోటెత్తింది. ఈ కాల్వలోని రాళ్లు.. మనాలీ-లేహ్ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపైకి వచ్చాయి. గుజరాత్‌లోని కశ్మీర్ నగర్‌లో ఔరంగా నది ఉప్పొంగడం తో తక్షణమే 150 కుటుంబాలను ఖాళీ చేయించారు. యూపీలోని మొరాదాబాద్‌ను భారీ వర్షాలు కుదిపేశాయి.

కర్ణాటకలో 'నీట్' రద్దు!

» రాష్ట్ర శాసనసభ, మండలి తీర్మానం
» మరో మూడు కీలక బిల్లులకూ ఆమోదం

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికై దేశవ్యాప్తంగా నిర్వహించే అర్హతా పరీక్షలు 'నీట్'ను కర్ణాటకలో రద్దు చేసేందుకు శాసనసభ ఉభయసభలు తీర్మానించాయి. వైద్య విద్యాశాఖ మంత్రి శరణప్రకాష్ పాటిల్ గురువారం శాసనసభలో తొలుత ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'నీట్' విధానంతో రాష్ట్ర పరిధిలోని గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్యకు అవకాశాలు లభించడం లేదన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నీట్' పరీక్షా వ్యవస్థ కాలరాస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆమోదించిన 'నీట్' రద్దు బిల్లును శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రవేశపెట్టగా సభ్యుల ఆమోదంతో ఆమోదించారు.

ఒక దేశం.. ఒకే ఎన్నికకు వ్యతిరేక బిల్లు

ఒక దేశం ఒకే ఎన్నిక జరపాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శాసనసభలో బిల్లును ఆమోదించారు. బీజేపీ, జేడీఎస్ సభ్యులు వ్యతిరేకిస్తున్నా అధికార కాంగ్రెస్ సభ్యులు సభలో అంగీకారం తెలిపారు. శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ మరో బిల్లుకు అంగీకారం తెలిపారు. 2026 లేదా ఆ తర్వాత జరిగే జనాభా లెక్కలకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన సరికాదని, 1971 జనాభా ఆధారంగా పునర్విభజన చేయాలని ఆ బిల్లు ద్వారా కోరారు. ఆదివాసీలకు అటవీ సంరక్షణ చట్టం నుంచి వినహాయింపు ఇవ్వాలనే బిల్లుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ బిల్లులకు శాసన మండలిలోనూ ఆమోదముద్ర వేశారు.

14 గంటల డ్యూటీపై
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల నిరసన

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీల్లో ఉద్యోగులకు పని సమయం 14 గంటలకు పెంచాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై టెకీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా సోషల్ మీడియా వేదికగా వారు నిరసన తెలుపుతున్నారు. రెండురోజులుగా ప్రాంతాల వారీగా రోడ్లెక్కి నిరసనలకు దిగుతున్నారు. మడివాళ, బీటీఎం లే అవుట్ ప్రాంతాల్లో టెకీలు బుధవారం రాత్రి పొద్దుపోయాక రోడ్లపైకి చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ కార్మిక సంస్థ చట్టాలను ఉల్లంఘించే చర్యలు తీవ్రమవుతున్నాయని, ఇప్పటికే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలంటే మానవవనరులపై దాడిలా మారిపోయాయని మండిపడ్డారు. ఏకంగా 14 గంటల పాటు పనిచేయడమనే నిబంధన ఉద్యోగిని మానసికంగా, శారీరకంగా దెబ్బతీయడమే అని అన్నారు. ఎలక్ట్రానిక్ సిటీకి సమీపాన ఉండే ప్రాంతంలో జరిగిన అందోళన కావడంతో పెద్దఎత్తున టెకీలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో నిరసన సాగించారు. టెకీలు మెయిల్ ద్వారా నిరసన అస్త్రాన్ని ప్రయోగించదలచారు. కార్మికశాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి, డీసీఎంలకు మెయిల్ ద్వారా నిరసన తెలుపదలచినట్లు వెల్లడించారు.

ఆర్నెల్లకో ఇంజెక్షన్‌తో..
గుండెపోటుకు చెక్

చెడ్డ కొలెస్ట్రాల్ తయారీని జన్యుస్థాయిలో అడ్డుకునే అద్భుత ఔషధం.. ఇన్‌క్లిసిరాన్

ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మన శరీరంలో చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) రెండూ ఉంటాయి. చెడ్డ కొలెస్ట్రాల్ పెరిగిపోతే రక్తనాళాలు పూడుకుపోయి గుండెపోటు బారిన పడే ప్రమాదం ఉంటుంది. శరీరానికి హాని చేసే ఈ ఎల్‌డీఎల్‌ను తగ్గించడానికి రకరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఆ సంప్రదాయ మందులకు భిన్నంగా జన్యుస్థాయిలోనే ప్రభావం చూపి ఎల్‌డీఎల్ తయారీకే అడ్డుకట్ట వేసే ఒక ఇంజెక్షన్ ఇప్పుడు హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. కాకపోతే ఖరీదు కాస్తంత ఎక్కువే. దాదాపు లక్ష రూపాయల విలువైన ఈ ఇంజెక్షన్‌ను ఆర్నెల్లకొకసారి చేయించుకుంటే.. గుండెపోటు రాకుండా సాఫీగా జీవించవచ్చని అపోలో ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ వివరించారు. గుండెపోటు వచ్చిన తర్వాత శస్త్రచికిత్స చేయించుకునే కంటే.. చెడ్డ కొలెస్ట్రాల్ బాధితులు ముందు జాగ్రత్త చర్యగా ఈ ఇంజెక్షన్ తీసుకుంటే ఇబ్బందులు లేకుండా జీవించవచ్చునని ఆయన తెలిపారు. గతంలో ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేసేవారని.. కానీ, ఇప్పుడు బ్లాక్ అయిన ధమనులను క్లియర్ చేయడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయని.. అలాంటి ఒక ప్రత్యేక పద్ధతే ఈ ఇంజెక్షన్ అని డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఇతర దేశాల్లోనూ దీన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ ఇంజెక్షన్‌ను స్టెంట్ వేయించుకున్న వారు, బైపాస్ సర్జరీ చేయించుకున్నవారూ తీసుకోవచ్చని చెప్పారు. అయితే.. ఈ ఇంజెక్షన్ ఎల్‌డీఎల్ అధికంగా ఉన్న వారిలో బాగా పనిచేస్తుందిగానీ, ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్న వారికి ఉపయోగపడదన్నారు. అపోలో ఆస్పత్రిలో మూడు నెలల నుంచి ఈ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరగనున్న ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ సదస్సులో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైద్యులకు దీనిపై 30% మేరకు రాయితీ ఇవ్వనున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ ఇంజెక్షన్ వినియోగం పెరిగితే.. భవిష్యత్తులో ధర తగ్గే అవకాశముందన్నారు. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్న వారు ఏ వయసులోనైనా ఈ ఇంజెక్షన్ చేయించుకోవచ్చని చెప్పారు. అయితే.. 'ఇంజెక్షన్ తీసుకున్నాం కదా' అని నిర్లక్ష్యంగా ఉండడం మంచిదికాదని.. ఏది పడితే అది తినడం, కదలకుండా ఎక్కువసేపు కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి జీవనశైలితో గుండెకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.



ఇలా పనిచేస్తుంది..

మన శరీరంలో ఉండే 'ఎల్‌డీఎల్ రిసెప్టర్ల'ను నాశనం చేసే ప్రొటీన్‌ను నియంత్రించే ఒక కీలకమైన జన్యువు.. పీసీఎస్‌కే9 (ప్రోప్రొటీన్ కన్వర్టేజ్ సటిలిసన్/కెక్సిన్ టైప్ 9). ఎల్‌డీఎల్ రిసెప్టర్లు రక్తంలో ఉండి.. చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) రేణువులకు అతుక్కుని.. ఆ రేణువులను కాలేయంలోకి తీసుకెళ్తాయి. అక్కడ కాలేయం ఎల్‌డీఎల్‌ను బ్రేక్‌డౌన్ చేసి అధికంగా ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. కానీ, పీసీఎస్‌కే9 ప్రొటీన్ ఆ రిసెప్టర్లను నాశనం చేయడం వల్ల ఎల్‌డీఎల్ రక్తనాళాల్లో పెద్దఎత్తున పేరుకుపోయి గుండెపోటుకు కారణమవుతుంది. దీంతో పీసీఎస్‌కే9ను పనిచేయకుండా చేసే (ఇన్హిబిటర్) ఔషధాలపై శాస్త్రజ్ఞులు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికే అలాంటి కొన్ని ఇన్హిబిటర్లు పాశ్చాత్యదేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. ఇన్‌క్లిసిరాన్ కూడా ఆ కోవలోనిదే. ఇది పీసీఎస్‌కే9 జీన్‌ను స్విచాఫ్ చేసేస్తుంది. దానివల్ల పీసీఎస్‌కే9 ప్రొటీన్ అసలు తయారే కాదు. ఆ ప్రొటీన్ లేకపోవడం వల్ల.. ఎల్‌డీఎల్ రిసెప్టర్లు స్వేచ్ఛగా పనిచేయగలుగుతాయి. ఫలితంగా శరీరంలో ఎల్‌డీఎల్ స్థాయిలు తగ్గిపోతాయి. గుండెపోటు ముప్పు తగ్గుతుంది.

ఫ్లై ఓవర్ ఎక్కండి!

గూగుల్ మ్యాప్స్‌లో కొత్త ఫీచర్లు అందుబాటులోకి..

» దేశంలోని 40 ప్రముఖ నగరాల్లో ఫ్లై ఓవర్ అలర్ట్
» ఫ్లై ఓవర్ ఎక్కాలా? వద్దా? అనే సందేహానికి చెక్
» ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలూ ఇక ఆ యాప్‌లో!
» ఇరుకు రోడ్ల గురించి ముందే హెచ్చరించే వ్యవస్థ
» చెన్నై, కొచ్చి నగరాల్లో మెట్రో బుకింగులకూ చాన్స్

న్యూఢిల్లీ, జూలై 25: గూగుల్ మ్యాప్స్ పెట్టుకొని ఎక్కడికో బయల్దేరాం! దారిలో ఒక ఫ్లై ఓవర్ కనిపిస్తుంది. గూగుల్ మ్యాప్స్ ఏమో.. నేరుగా వెళ్లాలని చెబుతుంది. నేరుగా అంటే.. ఫ్లై ఓవర్ ఎక్కాలా? లేక ఫ్లై ఓవర్ పక్కగా కింద నుంచి వెళ్లాలా? అర్థం కాదు. చాలా మందికి ఎదురవుతున్న ఈ సమస్యను పరిష్కరిస్తూ గూగుల్ మ్యాప్స్ భారత్‌లో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు.. ఇరుగ్గా ఉండే రోడ్లను గురించి ముందే హెచ్చరించే ఫీచర్‌ని, ద్విచక్ర విద్యుత్తు వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఎక్కడున్నాయో చెప్పే ఫీచర్, మెట్రో టికెటింగ్.. ఇలా మొత్తం ఆరు కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓలా మ్యాప్స్ నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకే గూగుల్ ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఫ్లైఓవర్ అలర్ట్ సమాచారం ప్రస్తుతానికి మనదేశంలోని 40 నగరాల్లో, ఆండ్రాయిడ్ వినియోగదారులకు కనిపిస్తుంది. ఐఫోన్ వినియోగదారులకు, మిగతా నగరాల్లో త్వరలో అందుబాటులోకి రానుంది. ఇక.. దేశంలో విద్యుత్తు వాహనాలు.. ముఖ్యంగా ఎలక్ట్రిక్ స్కూటర్ల వినియోగం బాగా పెరిగిన నేపథ్యంలో గూగుల్ సంస్థ ప్రముఖ ఈవీ చార్జింగ్ ప్రొవైడర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫలితంగా.. దేశవ్యాప్తంగా ఉన్న 8000కు పైగా ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలు గూగుల్ మ్యాప్స్‌లో కనిపిస్తాయి. ఆయా స్టేషన్లలో ఏ తరహా చార్జర్లు ఉన్నాయనే విషయాన్ని కూడా గూగుల్ మ్యాప్స్ ద్వారానే తెలుసుకోవచ్చు. ఇలా ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలు, ఫ్లై ఓవర్ అలర్ట్, ఇరుకు రోడ్లపై అప్రమత్తం చేసే పరిజ్ఞానం.. గూగుల్ మ్యాప్స్‌లో కనిపించే తొలి దేశం మనదే కావడం గమనార్హం. ఇక.. గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని వెళ్తున్నప్పుడు ఉన్నట్టుండి చాలా ఇరుకైన రోడ్లు ప్రత్యక్షమవుతాయి. వెనక్కి, ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇబ్బందిని తప్పించడానికి గూగుల్ సంస్థ ఏఐ సాయంతో అలాంటి ఇరుకు రోడ్ల గురించి ముందే హెచ్చరించే ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై కోయంబత్తూరు, ఇండోర్, భోపాల్, భువనేశ్వర్ నగరాల్లో ఆండ్రాయిడ్ వినియోగదారులకు ఈ వారం నుంచే ఈ ఫీచర్ అందుబాటులోకి రానుంది. యాపిల్ ఫోన్ వాడేవారికి, మిగతా నగరాల వారికి కూడా త్వరలోనే దీన్ని అందుబాటులోకి తెస్తామని గూగుల్ పేర్కొంది. కొచ్చి, చెన్నై నగరాల్లో వినియోగదారులు మెట్రో రైలు టికెట్లు సైతం గూగుల్ మ్యాప్స్ నుంచే బుక్ చేసుకునేలా ఓఎన్‌డీసీ, నమ్మ యాత్రితో ఒప్పందాలు చేసుకుంది. అలాగే, మనం వెళ్లేదారిలో ఏదైనా ప్రమాదం జరిగినా, నిర్మాణ పనుల వల్ల ఆ దారి బ్లాక్ అయినా.. గూగుల్ మ్యాప్స్‌లో ఆ విషయాన్ని సులువుగా రిపోర్ట్ చేసే అవకాశాన్ని ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులందరికీ అందుబాటులోకి తెచ్చింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.





అయ్యయ్యో..!

పై దృశ్యాలను చూస్తే నగర శివారు కానూరు గ్రామంలో రోడ్లు ఎంత దారుణంగా తయారయ్యాయో అర్థమవుతుంది. గురువారం సాయంత్రం కానూరు ప్రధాన రహదారిపై ఓ యువకుడు తన ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. దీంతో అతడికి ఎదురుగా ఓ గుంత దర్శనమిచ్చింది. ఆ గుంతను తప్పించే క్రమంలో మరో గుంతలో పడిపోయాడు. దీంతో అతడి చేతులు, కాళ్లు కొట్టుకుపోయాయి. ఇంతలో పక్కనే ఉన్న ఓ వ్యక్తి హుటాహుటిన అక్కడికి చేరుకుని కిందపడిన ఆ యువకుడిని పైకి లేపి సపర్యలు చేయగా కొంచెం తేరుకున్నాడు. తనకు తగిలిన దెబ్బలను చూసుకుంటూ ఆ యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆంధ్రజ్యోతి-విజయవాడ

త్వరలోనే సీడ్ యాక్సెస్ రోడ్డు మిగిలిన పనులకు టెండర్లు

వన్‌టౌన్: సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంలో మిగిలిన పనులకు త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. ఇందుకోసం భూ సమీకరణ పథకంలో భూములివ్వడానికి రాజధాని రైతులు ముందుకొచ్చారు. పెనుమాక రైతులు గురువారం 2.65 ఎకరాలు సీఆర్‌డీఏ కు ఇచ్చారు. ఫేజ్-2 కింద మిగిలిన పనులను తిరిగి ప్రారంభించేందుకు 30 ఎకరాల భూమి కావాల్సి ఉంది. గతంలో ల్యాండ్ పూలింగ్‌పై కేసులు వేసిన రైతులే ఇప్పుడు సీడ్ యాక్సెస్ రోడ్డు కోసం భూములివ్వడానికి ముందుకు రావడం విశేషం. కొద్దిరోజుల కిందట రైతులతో సీఆర్‌డీఏ కమిషనర్ జరిపిన చర్చలు ఫలించాయి.2 రోజులుగా అధికారులు ఎల్‌పీఎస్‌ను ప్రక్రియను చేపట్టారు. పక్షం రోజుల్లో ప్రక్రియను పూర్తిచేసి పనులకు టెండర్లను పిలవనున్నారు.

ఆగస్టు 16 నుంచి అక్టోబరు 30 వరకు వెల్ఫేర్ ఫండ్ చెల్లించుకునే అవకాశం

విజయవాడ లీగల్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీలో వెల్ఫేర్ ఫండ్ కట్టని 36ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య వయసున్న న్యాయవాదులు ఆగస్టు 16 నుంచి అక్టోబరు 30వరకు కట్టుకొనే అవకాశం బార్ కౌన్సిల్ కల్పించినట్టు బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరాం ప్రసాద్ (రాజా) గురువారం తెలిపారు. 36 నుంచి 40 ఏళ్లున్న న్యాయవాదులు రూ.35వేలు, 46 నుంచి 50ఏళ్లున్న వారు రూ.40వేలు, 51 నుంచి 55 ఏళ్లున్న వారు రూ.45వేలు, 55నుంచి 60మధ్య వయస్సున్న న్యాయవాదులు రూ.55వేలు కట్టాలని బార్ కౌన్సిల్ నిర్ణయించినట్టు రాజా తెలిపారు. వెల్ఫేర్ ఫండ్ కట్టిన వెంటనే నవంబరు 1నుంచి న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ నిబంధనలు వర్తిస్తాయన్నా రు. ఈ అవకాశాన్ని న్యాయవాదులకు కల్పించిన ఏ పీ బార్ కౌన్సిల్ సభ్యులకు, ఛైర్మన్‌కు రాజా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించండి: ఏఐఎస్ఎఫ్

ధర్నాచౌక్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక దాసరిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులందరూ పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చేవారన్నారు. వీరికి ఉచిత విద్యతో పాటు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్, సుధీర్, సురేష్ పాల్గొన్నారు.

అన్యాయం జరిగింది.. రాష్ట్రపతి వద్దకెళ్తా..!

● మల్లిఖార్జునరావు

ధర్నాచౌక్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తానని విజయవాడ పార్లమెంట్ థర్డ్‌ఫ్రంట్ అభ్యర్థి దేవరపల్లి మల్లిఖార్జునరావు (మహేష్) తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తిలాపాపం త లా పిడికెడు అన్నట్టుగా వ్యవస్థలు తయారయ్యాయన్నారు. విజయవాడ పార్లమెంట్ ఎన్నికలు తనతో పాటు ఓట్లర్లను గందరగోళానికి గురి చేశాయన్నా రు. వైసీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ తనకు కేటాయించిన సీరియల్ నెంబర్లో నోటా పేరును ప్రచారం చేయడమే దీనికి కారణమన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. సీపీ దృష్టికి కూ డా తీసుకువెళ్లినా న్యాయం జరగలేదన్నారు.

వైసీపీకి 4వ డివిజన్ ఇన్‌చార్జి, అధ్యక్షుల రాజీనామా

భారతీనగర్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పరాజయం పాలవడంతో తూర్పు పరిధిలోని 4వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, డివిజన్ అధ్యక్షుడు గల్లా సదాశివరావు (రవి) గురువారం వైసీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనా మా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్తల తో మాట్లాడి ఏపార్టీలో చేరేది తెలియజేస్తామన్నారు.

ఆక్రమణలోని దేవదాయ ఆస్తుల స్వాధీనంపై దృష్టి

వన్‌టౌన్: జిల్లాలో ఆక్రమణలో ఉన్న దేవదాయ శాఖ ఆస్తులను స్వాధీనం చేసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా దేవదాయశాఖ ఇన్‌చార్జి సహా య కమిషనర్ సీతారావమ్మ ఇన్‌స్పెక్టర్లకు, కార్యనిర్వహణ అధికారులకు సూచించారు. గురువారం గవర్నర్‌పేటలోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని దేవాలయాలు, ట్రస్టులకు సంబంధించిన ఆస్తుల వివరాలపై ఆరా తీశారు. ప్రధానంగా నందిగామలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన సుమారు 3వేల ఎకరాలు కబ్జాకు గురైనట్టు గుర్తించారు. జిల్లాలో ఆరు దేవాలయాలకు చెందిన ఖాళీ స్థలాలను స్థానికులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. ఈ అంశాన్ని కలెక్టర్, ఆర్‌జేసీ దృష్టికి తీసుకు వెళ్లనున్నారు. జిల్లాలో సుమారు 50 ఆలయాలకు సంబంధించి కబ్జాకు గురైన ఆస్తుల్లో ఓఏ వేసి దీర్ఘకాలంలో ఉన్నవాటికి 83 నోటీసులిచ్చి స్వాధీనం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్లకు, కార్యనిర్వహణ అధికారులకు సూచించారు.

చేనేత ఎగ్జిబిషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత


చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత

కృష్ణలంక, జూలై 25: వచ్చేనెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే చేనేత ఎగ్జిబిషన్‌కు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, సౌకర్యాల కల్పనలో అలక్ష్యం చేయొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు సందర్భంగా నగరంలోని మెరీస్టెల్లా కాలేజీ, ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా మెరీస్టెల్లా కాలేజీని పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని చేనేత శాఖాధికారులను ఆదేశించారు. అనంతరం ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎం చంద్రబాబు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించే అవకాశముందన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహా పలువురు మంత్రులు పాల్గొనే అవకాశముందన్నారు. అతిథుల కార్ల పార్కింగ్, చేనేత కార్మికులు, సందర్శకులకు సౌకర్యాల కల్పనపై ప్రధాన దృష్టి సారించాలని స్పష్టం చేశారు. చేనేత కార్మికులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించే అవకాశముంటుందని, ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 7 నుంచి 10 రోజుల పాటు జరిగే చేనేత ఎగ్జిబిషన్లను ప్రజలు సందర్శించేలా విస్తృతమైన ప్రచారం కల్పించాలన్నారు. చేనేత కార్మికుల్లో అవగాహన కల్పించి, ఈ చేనేత ఎగ్జిబిషన్‌లో అత్యధిక స్టాళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ స్టాళ్లలో చీరలు, ఇతర చేనేత వస్త్రాల విక్రయాల ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగే అవకాశముందన్నారు. ప్రస్తుతం ఎంతమంది స్టాళ్ల ఏర్పాటుకు ముందుకొచ్చారని మంత్రి ఆరా తీశారు. 80 స్టాళ్లు ఏర్పాటు చేసే అవకాశముందని, ఇందుకోసం 300 మంది చేనేత కార్మికులు రానున్నారని మంత్రికి అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, స్టాళ్ల ఏర్పాటుకు వచ్చే చేనేత కార్మికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎగ్జిబిషన్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కృష్ణవేణమ్మకు కుంభహారతి, కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఈవో రామారావు

కృష్ణమ్మకు పంచహారతులు

● దుర్గాఘాట్‌లో పూజలు చేసిన ఈవో రామారావు

వన్‌టౌన్, జూలై 25: కృష్ణవేణీ నదీమ తల్లికి దుర్గగుడి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దుర్గాఘాట్‌లో పంచహారతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి అర్చకులు వేద మంత్రాల మధ్య ఓంకార హారతి, కుంభ హారతి సింహహారతి, నంది హారతి, నక్షత్ర హారతి సమర్పించారు. ఆయా హారతులకు సంబంధించిన విశేష మంత్రాలను అనుసంధానం చేసి కృష్ణవేణి నదీమతల్లికి సమర్పించారు. రాష్ట్రంలో పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో గడపాలని, ఈతి బాధలు లేకుండా చూడాలని కోరుతూ సంకల్పం చెబుతూ హారతులు సమర్పించారు. తొలుత ఈవో రామారావు. ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రితో కలిసి నదీమతల్లికి వేదమంత్రాల మధ్య పూలు, గాజులు పసుపు కుంకుమలు, వస్త్రాలు సమర్పించారు హారతులకు తొలుత అర్చక బృందం నదీమతల్లికి నమస్కారం చేసి ఎలాంటి ఉధృతులు లేకుండా సజావుగా సాగి అన్నిప్రాంతాలను సశ్యశ్యామలం చేయాలని ప్రార్థించారు. పర్యవేక్షకుడు నగేష్ పాల్గొన్నారు.



దుర్గమ్మ ఉత్సవమూర్తి, దక్షిణామూర్తికి పూజలు


దుర్గమ్మ సన్నిధికి వస్తున్న హైకోర్టు జడ్జి హరినాథ్


మంత్రి సత్యప్రసాద్‌కి దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో

పంచహారతుల్లో పాల్గొన్న జస్టిస్ హరినాథ్

దుర్గమ్మ పంచహారతుల్లో రాష్ట్ర హైకోర్టు జడ్జి హరినాథ్ పాల్గొన్నారు. ఆయనకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. హారతుల అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు. డిస్పాచ్ విభాగంలో ఈవో రామారావు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి అనగాని

రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మకు భక్తుల సారె సమర్పణ

ఆషాఢమాసం సందర్భంగా దుర్గమ్మకు సారె సమర్పణలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తబృందాలు ఆలయానికి విచ్చేసి సారె సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఏఈ బొప్పన అశోక్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

దుర్గగుడిలో గురువారం సందర్భంగా మల్లేశ్వరాలయ కుడ్యాలపై నెలకొన్న దక్షిణామూర్తి స్వామికి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు వివిధ మంత్రాలు వేదాలను మిళితం చేసుకుని వివిధ ఉపచారాలను నిర్వహించి, మంత్రపుష్పం సమర్పించి హారతులిచ్చారు స్వస్తి, శాంతి మంత్రాలను పఠించారు.



గ్యాస్ లీకై ఆటో దగ్ధం

లబ్బీపేట, జూలై 25: బందర్ రోడ్డులోని చెన్నుపాటి పెట్రోల్ బంకు వద్ద గురువారం ఉదయం 11.30 గంటలకు సీఎన్‌జీ ప్యాసింజర్ ఆటో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి అగ్నికి ఆహుతైంది. రామలింగేశ్వరనగర్‌కు చెందిన తరుణ్ అనే వ్యక్తి సీఎన్‌జీ నడుపుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కంకిపాడు నుంచి ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకుని బస్టాండ్‌కు బయలుదేరాడు. ఆటో బందర్ రోడ్డులోని చెన్నుపాటి పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆటోలోని సీఎన్‌జీ సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతుండడం గమనించి ప్రయాణికులు, డ్రైవర్ ఆటో నుంచి దిగగానే ఒక్కసారిగా ఆటో నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో వారు దూరంగా పరుగుపెట్టడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ముందుగానే గ్యాస్ లీకును గమనించడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు మంటలపై నీళ్లు చల్లి అదుపుచేశారు. అప్పటికే ఆటో పూర్తిగా దగ్ధమైంది. కృష్ణలంక పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అన్న క్యాంటీన్‌లో వసతులు కల్పించండి

అధికారులకు వీఎంసీ కమిషనర్ ఆదేశం

ధర్నాచౌక్, జూలై 25: అన్నా క్యాంటీన్‌లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలుత ధర్నాచౌక్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంటీన్ ఫ్లోరింగ్ ఫినిషింగ్ నాణ్యత ప్రమాణాలతో చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, క్యాంటీన్ ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ జోనల్ కమిషనర్-2 ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పద్మజ బాధ్యతల స్వీకరణ



రైల్వేస్టేషన్, జూలై 25: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా కే పద్మజ గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈమె దక్షిణ మధ్య రైల్వేలో మొదటి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా గుర్తింపు పొందారు. 1991 ఐఆర్‌టీఎస్ బ్యాచ్ అధికారిణి. సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. చీఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ మేనేజర్‌గా పనిచేస్తూ ప్రస్తుత హోదాకు బదిలీ అయ్యారు. దక్షిణ మధ్య రైల్వే డివిజన్‌లో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌గా, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా, బొగ్గు, వస్తువుల డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, గుంతకల్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్‌గా, డిప్యూటీ కమర్షియల్ మేనేజర్‌గా, సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యాలయంలో సీనియర్ కమర్షియల్ మేనేజర్‌గా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్, ప్యాసింజర్ సర్వీసెస్ విభాగాల్లో ఉన్నతాధికారిగా 30ఏళ్ల అనుభవం ఉంది. వీటితో పాటు గోదావరి ఫెర్టిలైజర్స్ సలహాదారుగా, హైదరాబాద్ కాంకోర్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఎస్‌సీఆర్ తెలంగాణా గైడ్స్ కమిషనర్‌గా, హ్యాండ్ బాల్ కార్యదర్శిగా, లలితా కళాసమితి సికింద్రాబాద్ అధ్యక్షురాలుగా, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పనిచేశారు.

ఆర్టీసీలో బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


మంత్రి రాంప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న శేషగిరిరావు

బస్టేషన్, జూలై 25: ఆర్టీసీలో బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం మంత్రి రాంప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా గతంలో మాదిరి బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రీజియనల్ స్థాయిలో నెలకోసారి, హెడ్ ఆఫీసు స్థాయిలో 3నెలలకోసారి సమావేశాలను పునరుద్ధరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు శేషగిరిరావు తెలిపారు. వీజే రత్నం, ఎం తిరుపతిరావు, పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


శేషసాయిని సత్కరిస్తున్న బార్ కార్యవర్గ సభ్యులు

బెజవాడ బార్‌లో అన్నప్రసాద వితరణ

విజయవాడ లీగల్, జూలై 25: బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా అన్నప్రసాద వితరణను హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ కార్యవర్గ సభ్యులు శేషసాయిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్ (రాజా), జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతి కుమార్, ట్రెజరర్ నిడుమోలు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


చెస్ విజేతలతో ముఖ్య అతిథులు

కృష్ణా అండర్-7 చెస్ విజేతలుగా మౌర్య, ఆరుషి

విజయవాడ స్పోర్ట్సు, జూలై 25: నగరం సమీపంలోని కానూరు ది ఐ ప్లే స్కూల్‌లో గురువారం జరిగిన కృష్ణాజిల్లా అండర్-7 బాలబాలికల చెస్ విజేతలుగా కే వేదాంత మౌర్య (ప్రథమ), సీహెచ్ లోహితేష్ (ద్వితీయ), కె.ఆరుషి (ప్రథమ), పి.జోష్నిక (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. హోరాహోరీగా పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన ఈ నలుగురు విజయనగరంలో ఆగష్టు 3,4న జరిగే రాష్ట్రస్థాయి అండర్-7 టోర్నీలో బరిలో దిగుతారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్‌ఎం ఫణికుమార్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ది ఐ ప్లే స్కూల్ డైరెక్టర్ కె.సంధ్య, ప్రముఖ వ్యాపారవేత్త కె. భాగ్యరేఖ, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ రేణుక,చెస్‌కోచ్ సతీష్ పాల్గొని అందజేశారు.

మాకు రక్షణ కల్పించండి

● కులాంతర వివాహం చేసుకున్న జంట వేడుకోలు

ధర్నాచౌక్, జూలై 25: కులాంత వివాహం చేసుకున్న తమకు ఇరు కుటుంబాల నుంచి ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన చిట్టూరి చైతన్య, పంచకర్ల ధనుంజయ కుమార్ కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. నాలుగేళ్లుగా తాము ప్రేమిం,చుకుంటున్నామని ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలుసునన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 1న కనకదుర్గ గుడిలో తాము వివాహం చేసుకున్నామన్నారు. తమకు రక్షణ కల్పించాలని పటమట పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించగా వారు ఇరు కుటుంబ సభ్యులకు పిలిచి మాట్లాడారన్నారు. దీనికి ఇరు కుటుంబాల పెద్దలు మాట్లాడుకుని ఒక తేదీ నిర్ణయించి పెళ్లి చేస్తామని నమ్మబలికి తర్వాత పెళ్లికి నిరాకరించారన్నారు. జూలై 23న ఏలూరులో సోషల్ మ్యారేజ్ చేసుకుని తాము సంతోషంగా ఉంటున్నామన్నారు. ఈ క్రమంలో చైతన్య తల్లిదండ్రులు తమ కూతురు కనబడటం లేదని పోలీస్ కేసు నమోదు చేశారన్నారు.

విద్యార్థుల సంపూర్ణ విజయానికి సూత్రాలివే..!



భారతీనగర్, జూలై 25: ఆంధ్రాలయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు సంపూర్ణ విజయం సాధించడానికి తీసుకోవాల్సిన సూత్రాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. అమెరికా వాస్తవ్యులు లైలా, జాన్‌గ్రోలు ముఖ్య అతిథుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాము విజయాలను సాధించేందుకు నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి కోసం కృషిచేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఐక్యూఏఆర్ కో-ఆర్డినేటర్ సిస్టర్ క్యాండీ, ఇనమల కళావతి, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కేఆర్ మార్కెట్, బీఆర్‌పీ రోడ్డు పార్కింగ్ టెండర్ల ఖరారు

వన్‌టౌన్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ (కేఆర్) సెల్లార్ పా ర్కింగ్, బాబూ రాజేంద్రప్రసాద్ రోడ్డు (బీఆర్‌పీ రో డ్డు) పార్కింగ్ ఫీజు వసూలుకు టెండర్లు ఖరారయ్యాయి. బుధవారం సాయంత్రం వీఎంసీ కమిషన ర్ ఆదేశాల మేరకు ఎస్టేట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. కేఆర్‌మార్కెట్ పార్కింగ్ వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. వీరిలో వన్‌టౌన్‌కు చెందిన అశోక్ ఏడాదికి రూ.44.50 లక్షల హెచ్చుధర కు పాట పాడుకుని టెండరు దక్కించుకున్నారు బీఆర్‌పీ పార్కింగ్‌కు చిట్టినగర్‌కు చెందిన ఎస్ బాబీ రూ.44.20 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు.

అమరావతి ప్రాంతానికి చెందిన ఆయన... మొదట ఓ సాధారణ ఫొటోగ్రాఫర్. గత చంద్రబాబు ప్రభుత్వంలో అమరావతి రాజధానికి శ్రీకారం చుట్టిన సమయంలో జరిగిన అరటి తోటల దహనం కేసులో అనుమానితుడిగా ఉన్నారు. ఇదే కారణంతో జగన్‌కు దగ్గరయ్యాయి. 2019లో మరో ప్రాంతం నుంచి వైసీపీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయనలోని అసలు మనిషి బయటకొచ్చారు.

జగన్ ఐదేళ్ల పాలనలో సదరు నేత అమరావతిని అడ్డాగా చేసుకుని ఎన్నో దౌర్జన్యాలు, దాడులు, అక్రమాలు, ఇసుక తవ్వకాలు, సెటిల్మెంట్‌లకు పాల్పడ్డారు. దాదాపు 500 కోట్ల అక్రమాస్తులు సంపాదించినట్టు ఆరోపణలున్నాయి. అంతేగాక తన స్వార్థం కోసం పుట్టి పెరిగిన ప్రాంతానికి ద్రోహం చేసి అమరావతి రాజధాని వ్యతిరేక ఉద్యమాన్ని నడిపించారు. కూటమి ప్రభుత్వం రావడంతో గోవాకు జంప్ అయ్యారు. సదరు నేత అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

రాజధానిలో రాజ్యాంగేతర శక్తి!

- జగన్ పాలనలో అడ్డగోలుగా దందా
- ప్రైవేటు సైన్యంతో రెచ్చిపోయిన వైసీపీ నేత
- ఐదేళ్లూ ఇసుకలో కుమ్ముడే కుమ్ముడు
- మట్టి, కంకర, రోడ్లనూ వదలని వైనం
- నాడు ఫొటోగ్రాఫర్‌గా సాధారణ జీవితం
- నేడు 500 కోట్ల అక్రమార్జనకు అధిపతి
- కూటమి ప్రభుత్వం రాగానే నేత అదృశ్యం

రాజధాని అమరావతి కోసం భూములు త్యాగం చేసిన రైతులు జగన్ ఐదేళ్ల పాలనలో నరకం చూశారు. అక్రమ కేసుల్లో ఇరుక్కుని, అణచివేతకు గురయ్యారు. కానీ ఆ ప్రాంతంలో ఓ సాధారణ వ్యక్తి మాత్రం కోట్లకు పడగలెత్తారు. మరో ప్రాంతం నుంచి ప్రజాప్రతినిధిగా గెలిచిన ఆయన రాజధాని ప్రాంతంలో అరాచకాలకు తెగబడ్డారు. భారీగా డబ్బు పోగేసుకోవడంతో పాటు అధికారాన్ని అడ్డు పెట్టుకుని గత ఐదేళ్లూ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారు. ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారు. అమరావతి రాజధాని కోసం పోరాడిన రైతులు శిబిరాల్లో జై అమరావతి అనడమే నేరం అన్నట్టుగా వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించారు. గడిచిన ఐదేళ్లలో రాజధాని ప్రాంతంలో ఆయన, ఆయన అనుచరులు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. రాజధాని ప్రాంతం తన సామ్రాజ్యం అన్నట్టుగా ఒక సామంత రాజులాగా రెచ్చిపోయారు. మొదట అక్కడ ఇసుక రీచ్‌లపై కన్నేశారు. ఆయన ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకముందే రీచ్‌లపై స్పష్టమైన అవగాహన ఉంది. గతంలో రీచ్‌లలో పనిచేసిన అనుభవం ఉంది. దీంతో ఇసుక రీచ్‌ల నుంచి ఐదేళ్లూ నిత్యం వందలాది లారీల ఇసుకను తరలించి కోట్లు కొల్లగొట్టారు. అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ఐదారు హెలిప్యాడ్ల ప్రాంతాన్ని ఇసుక డంపింగ్ యార్డ్‌గా మలుచుకున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళ ఇసుక తరలించేవారు. ఆయనకు సంబంధించిన లారీలకు ముందు భాగంలో ప్రత్యేకమైన రంగు ఉంటుంది. ఆ లారీలను పోలీసులు కనీసం ఆపే ప్రయత్నం కూడా చేసేవారు కాదు. ఒక్క ఇసుకలోనే 400 నుంచి 500 కోట్ల వరకు కొట్టేసినట్లు అంచనా. నాటి వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధికి చెందిన లారీలు ఆ ప్రాంతంలో తిరగకూడదన్నట్లుగా వ్యవహరించారు. స్థానిక వైసీపీ మహిళా ప్రజాప్రతినిధిని అడుగడుగునా అవమానం, అవహేళనకు గురిచేసేలా వ్యవహరించారు. తానే అక్కడ వైసీపీ ప్రజాప్రతినిధి అన్నట్టుగా వ్యవహరించారు. ఆయన ఆగడాలు భరించలేక ఆమె పార్టీని వీడారు. దీంతో రాజధాని ప్రాంతంలో తనకు తిరుగే లేదన్నట్లుగా మరింత రెచ్చిపోయారు. ఇసుక దోపిడీ కొనసాగిస్తూనే రాజధాని ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వంలో వేసిన కంకర, మట్టి, రోడ్లను సైతం తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. మరోవైపు పంచాయితీలు, దందాలపైనా దృష్టి సారించారు. భారీగా అక్రమార్జన వస్తుండటంతో తన గ్రామ సమీపంలోని నదీపాతంలో అంటే లంకలో కట్టడాల నిర్మాణం నిషేధమైనా అనుమతులు లేకుండా రూ.12 కోట్లతో ఓ ప్యాలెస్ నిర్మించుకున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ఉద్దండరాయునిపాలెం పరిధిలో సీఆర్‌డీఏ భూములను ఆక్రమించి ఓ కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. అక్కడి నుంచి దందాలు, సెటిల్మెంట్లు ఇతర ప్రైవేటు కార్యకలాపాలు సాగించారు.

అమరావతి వ్యతిరేక ఉద్యమంలో...

నాటి జగన్ ప్రభుత్వం అమరావతిని ధ్వంసం చేసి ఆడిన మూడుముక్కలాటలో సదరు ప్రజాప్రతినిధి కీలకపాత్ర పోషించారు. స్వార్థ ప్రయోజనాల కోసం అమరావతికి వ్యతిరేకంగా మూడు రాజధానులకు మద్దతుగా నిలిచారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని ఆశ కల్పించి దళిత ఉద్యమ నాయకుడు మారగాని గురునాథాన్ని పావుగా వాడుకున్నారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని రాజధాని రైతులు అనేక ప్రాంతాల్లో నిరవధిక శిబిరాలు ఏర్పాటు చేసి దీక్షలు కొనసాగిస్తుంటే.. అందుకు పోటీగా తాళ్లాయపాలెం వై జంక్షన్‌లో మూడు రాజధానుల శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. విజయవాడ చిట్టినగర్, మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాల్లోని పేద దళిత వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని ఆశ పెట్టి ఈ శిబిరానికి రప్పించారు. మొదట్లో పేదలు ఈ మాటలు నమ్మినా తరువాత విషయం తెలుసుకుని వెనకడుగు వేశారు. దీంతో రోజువారీ కూలీ ఇచ్చి ఆ శిబిరాన్ని కొనసాగించారు. మూడు రాజధానుల శిబిరం ముసుగులో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో తమను మోసం చేశారని గ్రహించిన దళిత ఉద్యమ నేత గురునాథం ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. సదరు నేత తమను ఎలా మోసం చేసింది, చేసిన అక్రమాలను ఆయన ఏకరువు పెట్టారు. రాజధాని ఉద్యమ సమయంలో రైతులు జై అమరావతి అని నినాదాలు చేసినందుకు వారిపై అక్రమ కేసులు బనాయించారు. నందిగామలో రైతులు జై అమరావతి అంటూ గులాబీలు ఇచ్చినందుకు వారిని అడ్డుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. 17 మంది రైతులపై వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టించి బెయిల్ రాకుండా 30 రోజులు జైల్లో ఉండేలా చేశారు. అమరావతికి సమీపంలోని శిబిరంలో రైతులు జై అమరావతి అన్నందుకు శిబిరం వద్దకు వెళ్లి నానాయాగీ చేశారు. రైతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి అరెస్టులు చేయించారు.

ఎన్నో దాడులు, దౌర్జన్యాలు

వైసీపీ ఐదేళ్ల పాలనలో సదరు నాయకుడు రాజధాని ప్రాంతంలో ఎంతో మందిపై దాడులు, బెదిరింపులకు పాల్పడ్డారు. కొట్టడమే గాక బాధితులపైనే ఎదురు కేసులు పెట్టి మరీ వేధింపులకు గురి చేశారు. మందడం ప్రాంతంలో ఓ టీ స్టాల్ వద్ద ఆయన అనుచరుల వైపు కన్నెత్తి చూశారనే కారణంగా విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. బాధితులపైనే ఎదురు కేసు పెట్టి భయభ్రాంతులకు గురి చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులోనూ ఆయన ఆదేశాల మేరకు అనుచర గణం పాల్గొన్నట్లు పోలీసు వర్గాలు ధ్రువీకరించాయి. ఆ కేసులో ఆయనతో పాటు ఆయన అనుచరులను కూడా నిందితులుగా చేర్చారు. ముందస్తు బెయిల్‌కు ఆయన దరఖాస్తు చేసుకోగా కోర్టులో విచారణ జరుగుతుంది. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అడ్డుపెట్టుకుని పెద్ద ఎత్తున ప్రైవేటు పంచాయితీలు, సెటిల్మెంట్లకు తెరదీశారు.

గోవాలో ప్రత్యక్షం

కూటమి ప్రభుత్వం రాగానే ఆ మాజీ ప్రజా ప్రతినిధి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తాజాగా గోవాలో ప్రత్యక్షమయ్యారు. అక్కడ వెలగబెడుతున్న రాచకార్యాల వీడియోలు సైతం సోషల్ మీడియాలో ఇప్పుడు చక్కర్లు కొడుతున్నాయి.

ఎలా సంపాదించారో చెప్పండి?

ఒక సాధారణ వ్యక్తి ప్రజాప్రతినిధి అయ్యాక కోట్ల రూపాయల ఆస్తులు ఎలా కూడబెట్టారో చెప్పాలని సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఎలా సంపాదించారో చెబితే తామూ ఆయనలా కష్టపడి ఆస్తులు సంపాదించుకుంటామని పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. వాటిలో కొన్ని..

- 12 కోట్లతో కృష్ణా నది ఒడ్డున విలాసవంతమైన ప్యాలెస్ నిర్మాణం ఎలా సాధ్యం?
- ఇసుక పనికి పోయిన వ్యక్తి రూ.40 కోట్లతో తన బయోపిక్ సినిమా ఎలా తీయగలిగారు?
- ఒకప్పుడు అరిటాకులు అమ్ముకున్న వ్యక్తి ప్రజాప్రతినిధి అయ్యాక నాలుగు ఆడి కార్లు, మూడు రేంజ్ రోవర్ కార్లు, మూడు బీఎండబ్ల్యూ కార్లు ఎలా వచ్చాయి?
- ఒక సాధారణ ప్రజాప్రతినిధి విజయవాడ గురునానక్ కాలనీలో నాలుగు కోట్ల రూపాయలతో డూప్లెక్స్ ఎలా కొనగలిగారు?
- హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎకరం 9 కోట్లు చొప్పున 15 ఎకరాలు (రూ.135 కోట్లు) ఎలా కొనగలిగారు.
- రాజధాని తుళ్లూరులో బినామీ పేరుతో నాలుగు అంతస్థుల అపార్టుమెంట్ ఎలా కొన్నారు? మందడం పెట్రోల్ బంకు సమీపంలో అపార్టుమెంట్ కొనడానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? రాజధానిలో 7 ప్లాట్లు ఎలా వచ్చాయి?
- కృష్ణా జిల్లా కంచికచర్ల సమీపంలో ఏడు ఎకరాల భూమి ఎలా సంపాదించారు?

-(గుంటూరు)



విశాఖ పోర్టుకు భారీ నౌక రాక

విశాఖపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టుకు గురువారం 1,99,900 టన్నుల మాంగనీస్‌తో భారీ నౌక 'ఎంవీ హహైన్' వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో సరకు ఒకే నౌక ద్వారా భారతీయ పోర్టుకు రావడం ఇదే ప్రథమమని పోర్టు వర్గాలు తెలిపాయి. మాంగనీస్ ఎగుమతికి పేరొందిన ఎరామెట్ ఎస్.ఎ.ఫ్రాన్స్ దీనిని గబాన్ నుంచి ఇక్కడకు పంపించింది. జనరల్ కార్గో బెర్తులో ఈ నౌకను నిలిపి బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ సంస్థ 1,24,500 టన్నుల మాంగనీస్‌ను అన్‌లోడింగ్ చేసింది. ఈ నౌక పొడవు 300 మీటర్లు, వెడల్పు 50 మీటర్లు కాగా డ్రాఫ్ట్ 18.46 మీటర్లుగా పోర్టు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ విశాఖ పోర్టును బల్క్ కార్గో ట్రాన్షిప్‌మెంట్ హబ్‌గా మార్చడానికి యత్నిస్తున్నామన్నారు.

చట్ట నిబంధనల మేరకు నడుచుకోండి

నాగార్జున యాదవ్ కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌కు భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 35(3) (సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ) కింద నోటీసులు ఇచ్చి వివరణ కోరామని కుప్పం పోలీసులు హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తూ.చ. తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుదారుడు వరుణ్‌కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇవి వైషమ్యాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొంటూ చిత్తూరుకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.వరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ నాగార్జున యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి పిటిషనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ వాదనను ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వదిలేశారని విన్నవించారు.

100 కోట్లకు బోర్డు తిప్పేసిన 'డాయ్'

- నెల రోజుల్లో రెండింతలు చెల్లిస్తామంటూ ఎర
- చిత్తూరు జిల్లా పలమనేరులో గగ్గోలు

పలమనేరు, జూలై 25: డిపాజిట్ చేసిన నెల రోజుల్లో రెండింతలు చెల్లిస్తామంటూ డబ్బు వసూలు చేసిన 'డాయ్ యాప్' ప్రజలకు కుచ్చుటోపీ పెట్టి అదృశ్యమైంది. చిత్తూరు జిల్లా పలమనేరులో ఆరు నెలల వ్యవధిలోనే రూ.వంద కోట్లకుపైగా డిపాజిట్లు వసూలు చేసినట్లు సమాచారం. నెల రోజుల్లో రెండింతలు అనేసరికి మహిళలు బంగారం కుదవ పెట్టి మరీ డబ్బులు డిపాజిట్ చేశారు. ఏజెంట్లకు ప్రతి పది మంది డిపాజిట్‌దారుల చొప్పున కమీషన్లు ఇవ్వడంతో పోటీపడి డిపాజిట్లు చేయించారు. పలమనేరు మున్సిపాలిటీలోని మెప్మా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి రాజేష్ ఈ డాయ్ యాప్‌ను ప్రజల్లోకి తీసుకొచ్చారు. పలువురు ఆర్పీల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, వారి భర్తలు, బంధువర్గాలతో డిపాజిట్లు కట్టించారు. డబ్బుకట్టిన మూడో రోజుకే వారు కట్టినంత డబ్బు తిరిగి వారి డాయ్ యాప్ వ్యాలెట్‌లలో జమ అయినట్లు చూపడంతో తమ డబ్బులు తమకు వచ్చేశాయని జనం నమ్మారు. తొలుత కట్టిన వారికి కొంత మేర డబ్బులు తిరిగి చెల్లించడంతో జనం పెద్ద ఎత్తున డిపాజిట్లు చేశారు. చివరకు తమ సెల్‌ఫోన్లలో డాయ్ యాప్ అదృశ్యమయ్యేసరికి మోసపోయామని గుర్తించి బాధితులు గురువారం డీఎస్పీ విష్ణు రఘువీర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు వివరంగా ఫిర్యాదులు ఇస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఇలాంటి యాప్‌లను నమ్మి మోసపోవద్దని సూచించారు.



ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి జవహర్

కోర్టు తీర్పిచ్చినా.. వైసీపీ నేతలు అడ్డుపడుతున్నారు

మా పొలంలోకి వెళ్లనీయడం లేదు.. టీడీపీ ఆఫీస్‌కు పోటెత్తిన అర్జీదారులు

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పిచ్చినా తమ భూమిని తాము అనుభవించకుండా వైసీపీ నేతలు అడ్డుపడుతున్నారని పలువురు బాధితులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి సుభాష్, మాజీ మంత్రి జవహర్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి బాధితులు పోటెత్తారు. భూ సమస్యలు, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు చేసేందుకు ఎక్కువ మంది వచ్చారు. కడప జిల్లా కాశినాయన మండలానికి చెందిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి అనే బాధితుడు తమకు వారసత్వంగా వచ్చిన 5.26 ఎకరాలను వైసీపీ నేతలు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి, లింగారెడ్డి పేరుతో రిజిస్టర్ చేయించుకున్నారని చెప్పారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా తన భూమిలో తనను సాగు చేసుకోనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డికి జవహర్ ఫోన్ చేసి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో అధికారులను లోబర్చుకుని, తన భూ వివరాలను తారుమారు చేశారని బీలా పార్వతి అనే మహిళ వాపోయారు. ఏలూరు కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అప్పన్న అనే వ్యక్తి కుమారులు తమపై దౌర్జన్యం చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విజయనగరం జిల్లా దన్నానపేటకు చెందిన వంద మంది ఎస్సీలు టీడీపీకి అనుకూలంగా ఉన్నారనే కారణంగా వైసీపీ నేతలు వారి ఇళ్లను కూలకొట్టారని నెల్లిమర్ల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నర్సయ్య ఫిర్యాదు చేశారు. ఈ విధంగా అనేక మంది సమస్యలు చెప్పుకొన్నారు.

రేపు ఎన్టీఆర్ భవన్‌కు చంద్రబాబు రారు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ శనివారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌కు ఆయన రారని టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పి.అశోక్‌బాబు తెలిపారు. ఆ రోజు ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌తో పాటు సీనియర్ నాయకులు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు.

బెయిల్ కోసం హైకోర్టుకు వాసుదేవరెడ్డి

- 'గుడివాడ' కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): లిక్కర్ గోడౌన్‌ను ఖాళీ చేయాలని బెదిరించారనే ఆరోపణలతో గుడివాడ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లిక్కర్ గోడౌన్ లైసెన్స్ లీజు ఒప్పందం ముగియక ముందే బలవంతంగా ఖాళీ చేయించి తన తల్లి మరణానికి కారణమయ్యారని పేర్కొంటూ దుగ్గిరాల ప్రభాకర్... గుడివాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీమంత్రి కొడాలి నాని, బెవరేజ్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి తదితరుల పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

సీఎం గారూ.. దయ చూపరూ!

- చంద్రబాబుకు ఖైదీల కుటుంబాల వేడుకోలు
- విడుదలయ్యే ఖైదీల్లో తమవారు లేరని నాడు సుప్రీం మార్గదర్శకాల్ని పక్కన బెట్టిన జగన్
- రెండున్నరేళ్లుగా 160 మంది సత్ప్రవర్తన ఖైదీల నిరీక్షణ
- తాజాగా ఏపీ సర్కారుకు జైళ్లశాఖ ప్రతిపాదనలతో ఆశలు

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): తెలిసో తెలియకో.. పొరపాటునో.. క్షణికావేశంలోనో.. తప్పు చేసిన తమ వారిపై దయచూపండి చంద్రబాబు గారూ అంటూ రాష్ట్రంలోని పలు జైళ్లలో మగ్గుతున్న ఖైదీల కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రిని వేడుకొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు ఖైదీల విడుదలకు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో, సత్ప్రవర్తన కలిగినప్పటికీ తమవారు ఇంకా జైళ్లలోనే మగ్గుతున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బాధిత ఖైదీల కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. వాస్తవానికి.. ఖైదీలను ప్రతి ఆర్నెళ్లకోసారి జూన్ 30లోపు మొదటి, డిసెంబరు 31లోపు రెండో జాబితా ఎంపిక చేసి విడుదల చేయాలని సుప్రీం కోర్టు 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు పంపింది. కొవిడ్ అనంతర పరిణామాలతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, దేశంలోని రాష్ట్రాలు సమ్మతించాయి. అయితే మన రాష్ట్రంలో నియంతలా పాలించిన జగన్ రెడ్డి అవేవీ పట్టించుకోలేదు. సుప్రీం కోర్టుతో ఇబ్బందులు వస్తాయని జైళ్ల శాఖ అధికారులు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. పిట్టకథలు చెప్పడంలో పేరుగాంచిన రాయలసీమ మాజీ మంత్రి తమ బంధువులను విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించారు. అయితే సుప్రీం కోర్టు మార్గదర్శకాల పరిధిలోకి ఆ ఖైదీలు రాబోరని జైళ్ల శాఖ అధికారులు చెప్పడంతో అర్హులైన వారిని సైతం విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. అయినప్పటికీ ప్రతి ఆర్నెళ్లకోసారి అర్హుల జాబితా సుప్రీం మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి ప్రభుత్వానికి జైళ్ల శాఖ పంపింది. కోర్టుతో ఇబ్బందులు రాకుండా 2022లో ఒకసారి హోంశాఖ జీవో ఇచ్చింది తప్ప ఖైదీలను విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా జూన్ 30నాటికి ఏ జైలులో ఏ ఖైదీ అర్హుడో వివరిస్తూ 160మంది జాబితా వారం రోజుల క్రితం చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ జైళ్లశాఖ పంపింది. ఆగస్టు 15, జనవరి 26తో సంబంధం లేకుండా ఎప్పుడైనా విడుదల చేయవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోయే ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సిద్ధం చేసింది. వీరికిఉపాధి కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా జైళ్ల శాఖ పంపిన జాబితా ప్రకారం విడుదలకు అర్హులైన ఖైదీలు.. కోస్తాంధ్ర జైళ్లలో 72మంది, గుంటూరు రేంజ్ పరిధిలో 35మంది, రాయల సీమ జైళ్లలో 53మంది కలిపి మొత్తం 160మంది ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా.. ఇటీవలే 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించడంతో ఏపీలోనూ ఇటువంటి నిర్ణయం తీసుకుంటారని సంబంధీకులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.



లేటరల్ ఎంట్రీ ద్వారా 57 మంది!

- సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిలో కేంద్రం నియామకాలు

న్యూఢిల్లీ, జూలై 25: కేంద్ర ప్రభుత్వం లేటరల్ ఎంట్రీ విధానం ద్వారా 57 మందిని సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయి పదవుల్లో నియమించిందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్ పార్లమెంటుకు తెలిపారు. లాటరల్ ఎంట్రీ విధానంలో నియామకాలు, రిజర్వేషన్ల గురించి లోక్‌సభ సభ్యుడు రాంప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 'నిర్దిష్టమైన అసైన్‌మెంట్ల కోసం సంబంధిత రంగాల నిపుణుల నైపుణ్యాన్ని వినియోగించుకునేందుకు భారత ప్రభుత్వం 2018 నుంచి సంయుక్తకార్యదర్శి, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిలో లాటరల్ నియామకాలు చేపడుతోంది. ఈ విధానం ద్వారా ఇప్పటి వరకు 63 నియామకాలు చేపట్టగా, వారిలో 35మంది ప్రైవేటు రంగం నుంచి వచ్చారు. అలా నియమించిన 57 మంది అధికారులు ప్రస్తుతం వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలలో సేవలందిస్తున్నారు. ఇలాంటి నియామకాలకు రిజర్వేషన్లు వర్తించవు' అని మంత్రి వివరించారు.

ఎనీ టైమ్.. ఎనీ సెంటర్!

- జుకర్ బర్గ్‌తో ఫైట్‌కు ఎలాన్ మస్క్ సిద్ధం

వాషింగ్టన్, జూలై 25: ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన టెస్లా సంస్థ అధినేత ఎలాన్ మస్క్.. ఆయన ప్రత్యర్థి అయిన మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్ మధ్య మరోమారు వైరం రాజుకుంది. జుకర్ బర్గ్‌తో ఫైట్ చేసేందుకు తాను సిద్ధమని మస్క్ తాజాగా ప్రకటించారు. 'ఎనీ ప్లేస్, ఎనీ టైమ్, ఎనీ రూల్స్' అని సవాల్ విసిరారు. అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ చేసిన ప్రసంగాన్ని వినేందుకు అతిథిగా హాజరయ్యే సందర్భంలో మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. మస్క్ తాజా సవాలుపై జుకర్‌బర్గ్ కూడా స్పందించారు. 'మనం నిజంగానే మరోసారి తలపడుతున్నామా?' అని జుకర్‌బర్గ్ తన సోషల్ మీడియా వేదిక 'థ్రెడ్స్'లో పేర్కొన్నారు. వీరిద్దరి తాజా పోస్టులపై నెటిజన్ల నుంచి కామెంట్లు వెల్లువెత్తాయి. మస్క్ ఈ వ్యాఖ్యలను అంత సీరియస్‌గా ఏమీ చేయలేదని, అందువల్ల వీటికి అంతగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని ఒక నెటిజన్ పేర్కొన్నారు. 'మొదలెట్టండి.. ఇది ఫైట్ ఆఫ్ ద ఇయిర్ అవుతుంది' అని ఇంకో నెటిజన్ పేర్కొన్నారు. 'ఇదంతా కామెడీ.. తెరవెనుక వారిద్దరూ మంచి స్నేహితులు' అని ఇంకో నెటిజన్ ఎక్స్‌లో పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ సతీశ్ కుమార్, ఈడీ అనిల్ కుమార్

పవన్‌ను కలిసిన ఐఓసీ డైరెక్టర్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) డైరెక్టర్(మార్కెటింగ్) వి.సతీష్‌కుమార్, ఆ సంస్థ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ కార్యకలాపాలు ఎలా ఉంటాయో వారంతా పవన్‌కు వివరించారు. రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు.

త్వరలో పశుగ్రాస క్షేత్రాలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాల దిగుబడి పెంపే లక్ష్యంగా పాడి రైతులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఊరూరా పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పశుగ్రాస క్షేత్రాలను త్వరలో ప్రారంభిస్తామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదెకరాలలోపు రైతులకు 25 సెంట్ల నుంచి 2.5 ఎకరాల వరకు పశుగ్రాసం పెంచుకోవటానికి విత్తనం, గడ్డి కణుపులు, నీటి సరఫరా, ఎరువులు వంటివి అందిస్తామన్నారు. ఎకరానికి రెండేళ్లలో రూ.99 వేలు లబ్ధి చేకూరుతుందని వివరించారు.

శాప్ చైర్మన్, సభ్యుల రాజీనామాలు ఆమోదం

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ బోర్డు రద్దయింది. వైసీపీ ప్రభుత్వం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చైర్మన్‌గా 15 మంది సభ్యులతో బోర్డును ఏర్పాటు చేసింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చైర్మన్, సభ్యులు అంతా రాజీనామా చేశారు. ఆ రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో శాప్ బోర్డు మొత్తం రద్దయింది. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని శాప్ ఎండీని ఆదేశించారు.

చోరీల సొమ్ముతో షార్ట్‌ఫిల్మ్!

- సినిమా డైరెక్టర్ కావాలన్న లక్ష్యం
- 90 చోరీ కేసుల్లోని సిక్కోలు నిందితుడి పట్టివేత
- 75 తులాల బంగారం, నగదు రికవరీ

నారాయణపేట టౌన్, జూలై 25: ఇంట్లో అందరూ నిద్రించగానే మూడో కంటికి కూడా తెలియకుండా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున లోపు మొత్తం అంతా చక్కబెట్టేస్తాడు. అలా చోరీ చేసిన సొమ్ములతో జల్సాలు చేస్తుంటాడు. చోరీ సొమ్ముతో గతంలో ఓ షార్ట్‌ఫిల్మ్ కూడా తీశాడు. ఇదీ.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన చోరీ కేసు నిందితుడు అప్పలనాయుడు ఘన చరిత్ర!. నిందితుడి నుంచి 75 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.4 లక్షల నగదును రికవరీ చేసినట్లు తెలంగాణలోని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు ఈ కేసు వివరాలను డీఎస్పీ లింగయ్యతో కలిసి ఆయన వివరించారు. అప్పలనాయుడు దొంగతనాల్లో ఆరితేరిపోయాడన్నారు. ఇటీవల మక్తల్‌కు చెందిన చిగుళ్లపల్లి రాఘవేందర్ ఇంట్లో 41.5 తులాల బంగారం, మరికల్‌కు చెందిన గౌడపల్లి రాములు ఇంటిలో 20 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెంటి ఆభరణాలు, రూ.4లక్షల నగదు, నారాయణపేటలోని అశోక్‌నగర్‌కు చెందిన అబ్రేష్‌కుమార్ ఇంట్లో 2.5 తులాల బంగారం చోరీ చేయడంతో పాటు తాజాగా జరిగిన ఆరు చోరీ కేసుల్లో అప్పలనాయుడు నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఇలా చోరీ చేసిన డబ్బుతో హైదరాబాద్, రాయిచూర్‌లలో పేకాట ఆడుతూ, జల్సాలు చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 90 చోరీ కేసుల్లో నిందితుడని చెప్పారు. చోరీ డబ్బుతో గతంలో ఓ షార్ట్ ఫిల్మ్ కూడా తీశాడని, సినిమా డైరెక్టర్ కావాలన్న ఆశ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికపై హైకోర్టుకు

- ఆయన ఎన్నికను రద్దు చేయాలంటూ పిటిషన్

అమరావతి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన ఎన్నికల పిటిషన్(ఈపీ) పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, రిటర్నింగ్ అధికారి, మరో 16మందికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. విచారణను ఆగస్టు 27కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జనసేన పార్టీ నుంచి కాకినాడ ఎంపీగా విజయం సాధించిన తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికను సవాల్ చేస్తూ జి.పొట్టియ్య హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో విద్యార్హతను తప్పుగా పేర్కొన్నారని, అతనికి ఉన్న రెండు పాన్ కార్డులలో ఒకదాని వివరాలే వెల్లడించారని, ఆర్వోను ప్రభావితం చేసి ఇతర ఎంపీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించేలా చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉదయ్ శ్రీనివాస్‌ను అనర్హుడిగా ప్రకటించి, అయన ఎంపీ పదవిని రద్దు చేయాలని కోరారు.